


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 136 | గురువారం | 16-04-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## డీలిమిటేషన్ బిల్లుకు

# వ్యతిరేకంగా ఓటేస్తాం

రాజకీయ లబ్ధి కోసం కేంద్రం ప్రయత్నిస్తోందని మండిపాటు

మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము వ్యతిరేకం కాదని స్పష్టీకరణ

పార్లమెంట్ ప్రత్యేక సెషన్‌లో ఉమ్మడి వ్యూహం రూపొందించేందుకు పలు ప్రతిపక్ష నేతల భేటీ

## ఆప్ సహా ఇండియా కూటమి పార్టీలు నిర్ణయం



**న్యూఢిల్లీ :** పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న రాజ్యాంగ సవరణ బిల్లులోని నియోజకవర్గాల పునర్విభజన నిబంధనలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఓటు వేయాలని పలు ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి. తాము మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదని, అయితే బిల్లును తీసుకువస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బుధవారం తెలిపారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే మూడు రోజుల పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా పరిశీలనకు, ఆమోదానికి చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)తో పాటు ఇండియా కూటమిలోని తరువాయి 2లో

### సమాఖ్యవాదాన్ని దెబ్బతీసేందుకు మహిళా రిజర్వేషన్ ముసుగు కావొద్దు : సిపిఐ

కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో బుధవారం జరిగిన ఇండియా కూటమి సమావేశానికి సిపిఐ తరపున జాతీయ కార్యదర్శి అన్నీ రాజా ప్రాతినిధ్యం వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ సిపిఐ నాయకురాలు గీతా ముఖర్జీ చేసిన తొలి ప్రయత్నాలు, ఆమె అధ్యక్షత వహించిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ చారిత్రాత్మక సిఫార్సుల నుండి ఉద్భవించిన మహిళా రిజర్వేషన్‌కు సిపిఐ చారిత్రాత్మకంగా, స్థిరంగా కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని సిపిఐ ఎప్పటి నుంచో వాదిస్తున్నప్పటికీ, ప్రస్తుత ముసాయిదా తీవ్రమైన ఆందోళనలను రేకెత్తిస్తోందన్నారు. మహిళా సాధికారత తరువాయి 2లో

### నేడు పార్లమెంటుకు

## నియోజకవర్గాల పునర్విభజన బిల్లు

**న్యూఢిల్లీ :** చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు నియోజకవర్గాల పునర్విభజన బిల్లును తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం గురువారం దానిని లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ ఈ బిల్లును సభ ముందుకు తీసుకురానున్నారు. అనంతరం బిల్లుపై చర్చ జరగనుంది. ఇప్పుడున్న లోక్‌సభ స్థానాలను గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని బిల్లులో కేంద్రం ప్రతిపాదించింది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్య 815గానూ, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. ఇప్పటివరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉంది. కానీ ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి. మరోవైపు మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు2026ను కేంద్రం తీసుకొస్తోంది. ఆర్టికల్ 81(3)లో 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరగాలని ఉంది. ఇప్పుడు దాన్ని సవరించి, గతంలోని జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల్ని పునర్విభజించడానికి కేంద్రం తాజా బిల్లు తీసుకొస్తోంది. 2026 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాలను పునర్విభజించడానికి వీలు కల్పిస్తూ ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332, 334ఎ లకు సవరణలు ప్రతిపాదించింది. అయితే లోక్‌సభ సీట్లను 850కి ఏ ప్రాతిపదికన తరువాయి 2లో

### ఎన్‌డిఏకు మెజారిటీ లేదు

**మహిళా రిజర్వేషన్ ముందే అమలు చేసేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి అవసరమైన మూడింట రెండో వంతు మెజారిటీ ఎన్‌డిఏ ప్రభుత్వానికి లేదు. బలాబలాలను పరిశీలిస్తే.. లోక్‌సభ ప్రస్తుత సభ్యుల సంఖ్య 540. దీని ప్రకారం రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి 360 మంది ఎంపిలు అవసరం. కానీ, ఎన్‌డిఏ కూటమి సంఖ్యా బలం– 293, కాగా ప్రతిపక్ష ఇండియా కూటమి సంఖ్యా బలం – 234, ఇతరులు – 13.**

### కేంద్రం భారీ మూల్యం చెల్లించక తప్పదు

నేడు రాష్ట్రవ్యాప్తంగా నల్లజెండాలతో ఆందోళన

తమిళనాడు సిఎం స్టాలిన్ హెచ్చరిక



**చెన్నై :** ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు వ్యతిరేకంగా ఈనెల 16న తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా నల్లజెండాల ఆందోళన చేపడతామని ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ప్రకటించారు. తమిళనాడు వాణిని కేంద్రం పట్టించుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. నియోజకవర్గ పునర్విభజన అంశంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పార్టీ ఎంపిలు, జిల్లా కార్యదర్శులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అనంతరం అధికార డిఎంకె అధ్యక్షుడు స్టాలిన్ మాట్లాడుతూ 'మన తలలపై వేలాడుతున్న కత్తి ఇప్పుడు మనపైనే పడింది' అని అన్నారు. ఈ తీవ్రమైన ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి డిఎంకె వివిధ రాష్ట్రాల్లోని ఎంపిలను సంప్రదిస్తూ, సమన్వయ వ్యూహాన్ని రూపొందిస్తోందని ఆయన తెలిపారు. గురువారం పార్లమెంటులో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకురావాలని యోచిస్తున్న నియోజకవర్గాల పునర్విభజన సవరణ, తమిళనాడు, దక్షిణ రాష్ట్రాలకు వ్యతిరేకంగా జరుగుతున్న భారీ, చారిత్రాత్మక అన్యాయం అని స్టాలిన్ ఆరోపించారు. దక్షిణ రాష్ట్రాలకు వ్యతిరేకంగా తరువాయి 12లో

### దక్షిణాదికి అన్యాయం చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తాం

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్**

దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కలగని ఏ సహేతుకమైన ప్రతిపాదనకైనా బిఆర్‌ఎస్ మద్దతునిస్తుందని, కానీ దక్షిణాదికి అన్యాయం చేసే ప్రయత్నం జరిగితే మాత్రం తీవ్రంగా ప్రతిఘటిస్తామని, అవసరమైతే ఆందోళనలు చేపడతామని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు హెచ్చరించారు. 'మీరు ఒక నిప్పుల కుంపటి మీద కూర్చున్నారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యంతో ఆడుకుంటే తీవ్రమైన తిరుగుబాటు వస్తుంది' అని అన్నారు. ఇలాంటి చర్యలను అడ్డుకునేందుకు ఇతర రాజకీయ పార్టీలతో కలిసి పని చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం రాజకీయాలపైన కాకుండా, పాలన,ప్రజా సంక్షేమంపై దృష్టి తరువాయి 12లో

20న మేడిగడ్డకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

03

రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 14వేల అదనపు స్పెషాలిటీ పడకల ఏర్పాటు

## త్వరలో కార్పొరేషన్‌లు, ఫెడరేషన్ చైర్మన్‌ల భర్తీ

రెండుమూడు రోజుల్లో ప్రభుత్వం ఆదేశాలు జారీచేసే అవకాశం

నామినేటెడ్ పోస్టులు, పార్టీ పదవులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్**

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వివిధ కార్పొరేషన్లు, ఫెడరేషన్‌ల చైర్మన్‌ల పదవులను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి రెండు మూడు రోజులలో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టులు, పార్టీ పదవులపై హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, తరువాయి 2లో



## బిహార్ ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌదరి ప్రమాణస్వీకారం

జెడియుకు చెందిన బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్ కుమార్ చౌదరి మంత్రులుగా ప్రమాణం

**పాట్నా :** బిహార్ 24వ ముఖ్యమంత్రిగా బిజెపి నాయకుడు సమ్రాట్ చౌదరీ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో కాషాయ పార్టీకి చెందిన ఒక సభ్యుడు అత్యున్నత పదవిని అధిరోహించడం ఇదే తొలిసారి. బుధవారం లోక్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ సమ్రాట్‌తో ప్రమాణ స్వీకారం తరువాయి 12లో

## ముగింపు ముంగిట్లో యుద్ధం

రాబోయే రెండు రోజుల్లో చర్చలు : ట్రంప్

మాకు సమాచారం లేదు : ఇరాన్

కాల్పుల విరమణ పొడిగింపు బదులు శాశ్వత యత్నాలు!

ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనం : స్తంభించిన ఎగుమతులు

10 వేలమంది సైనికుల మోహరింపు : యుఎస్ సెంట్రల్ కమాండ్



**వాషింగ్టన్:** పశ్చిమాసియాలో ముఖ్యంగా ఇరాన్‌పై యుద్ధం ముగింపు ముంగిపు దశకు చేరుకుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎబిసి న్యూస్–న్యూయర్క్ పోస్టులకు వేరువేరుగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఇప్పుడే తాను యుద్ధం నుండి వైదొలగిపోతే ఇరాన్ దేశాన్ని వారు పునర్నిర్మించుకోవడానికి ఇరవై సంవత్సరాలు పడుతుందని అన్నారు. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవుల దిగ్బంధం విజయవంతంగా జరుగుతోందని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించిన నేపథ్యంలో ట్రంప్ ప్రకటన వెలువడింది. ''నా ఉద్దేశం యుద్ధం ముగింపు దశకు వచ్చింది, ఔను..ముగింపునకు చాలా దగ్గరకు వచ్చాం'' అని ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఈ ప్రకటనలమధ్య పాకిస్థాన్ ప్రధానమంత్రి గల్ఫ్‌దేశాల్లో పర్యటిస్తుండగా, పాకిస్థాన్ సర్వసైన్యాధిపతి ఆసిఫ్ మునీర్ ఇరాన్‌కు చేరుకున్నారు. కాల్పుల విరమణను పొడిగించే ఉద్దేశం తమకు లేదని, తరువాయి 2లో

### ఇరాన్‌కు పాకిస్థాన్ ఆర్మీ ఛీఫ్

**పాకిస్థాన్ ఆర్మీ ఛీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ నేతృత్వంలో ప్రతినిధి బృందం బుధవారం నాడు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు చేరుకుంది.వారిని వాషింగ్టన్ నుండి ఒక కొత్త సందేశాన్ని అందించడంతో పాటు, రెండవ విడత చర్చల కోసం ఈ బృందం అక్కడికి వెళ్ళింది. ఇస్లామాబాద్‌లో అమెరికాతో జరిగిన మొదటి విడత చర్చలు విఫలమైన తర్వాత, ఇరుపక్షాలు పాకిస్థాన్ ద్వారా చర్చలు కొనసాగించాయని ఇరాన్ ధృవీకరించింది.**

## రిజర్వేషన్ కుతంత్రం!

### మహిళా సాధికారీకరణ న్యాయమైన ఫెడరల్ భాగస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు సాకు మాత్రమే

('ది హిందూ' విశ్లేషణాత్మక సంపాదకీయం)

*ఏప్రిల్ 16 నుంచి సమావేశమవుతున్న పార్లమెంట్ సిట్టింగ్‌లో, యూనియన్ ప్రభుత్వం మహిళా సాధికారీకరణను ముందుకు తీసుకురావాలని కోరుకుంటున్నది; అయితే విస్తృతమైన శాసన ప్యాకేజీలో భాగంగా దాన్నితెస్తున్నది : అవి రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026, దానికి తోడుగా డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లు. లోక్‌సభ, శాసనసభల్లో 33శాతం సీట్లను మహిళలకు రిజర్వు చేసిన నారీ శక్తి వందన్ అధినియం(2023లో 106వ సవరణ) అమలులోకి తీసుకురావటం దీనివెనుకవున్న హేతువుగా చెప్పబడింది. అయితే అది ఆనాడు జనగణన (సెన్సెస్) అనంతరం డీలిమిటేషన్‌తో ముడివేయబడింది. డీలిమిటేషన్‌తో మహిళా రిజర్వేషన్‌ను ముడిపెట్టటంపై ప్రభుత్వ పట్టుదల రెండవదానికోసం మొదటి దాన్ని రాజకీయ ముసుగుగా ఉపయోగిస్తున్నట్లు సూచిస్తున్నది. డీలిమిటేషన్‌తో లోక్‌సభ సీట్ల పునఃకేటాయింపులో తీవ్రమైన మార్పులు జరుగుతాయి. అది భారతీయ జనతాపార్టీ (బిజెపి)కి ఎన్నికల రీత్యా ఆధిపత్యం ఉన్న రాష్ట్రాలకు లాభదాయకంగా, చారిత్రకంగా అది బలహీనంగా ఉన్న రాష్ట్రాలను ఫణంగా పెట్టి పార్లమెంట్ ఫెడరల్(సమాఖ్య) పొందికను మార్పు చేస్తుంది.*

*దశాబ్దానికొకసారి నిర్వహించే భారతదేశ జనాభా లెక్కల సేకరణ(సెన్సెస్)ను బిజెపి నాయకత్వంలోని యూనియన్ ప్రభుత్వం కచ్చితమైన లేదా హేతుబద్ధమైన వివరణ లేకుండా ఐదేళ్లకుపైగా జాప్యం చేసింది. అందులోని రాజకీయ తర్కం గ్రహించటం కష్టం కాదు. 2021 సెన్సెస్‌ను కోవిడ్–19 కారణంతో తొలిసారి వాయిదా వేశారు. ఆ కార్యక్రమం 2026–27లో నిర్వహించబడుతుందని మెల్లగా ప్రకటించేంత వరకు తదుపరి వరుస వాయిదాలకు ఎట్టికారణం చెప్పలేదు. రాజ్యాంగం ప్రకారం, 1971 సెన్సెస్ ప్రకారం నిర్ణయించబడిన లోక్‌సభ సీట్ల అంతర్రాష్ట్ర పంపిణీపై విధించబడిన స్తంభన, 2026 సంవత్సరం తదుపరి నిర్వహించబడే తొలి సెన్సెస్ ప్రచురించబడిన మీదట మాత్రమే ముగుస్తుంది. దీని అర్థం – సాధారణ క్రమంలో, 2031 సెన్సెస్ ఆధారంగానే డీలిమిటేషన్ జరగాలి. సెన్సెస్‌ను 2026–27 సంవత్సరానికి జాగుచేయటం ద్వారా ప్రభుత్వం తాను ఎంచుకున్న కాలనిర్ణయం ప్రకారం–2031లో నిర్వహించే సెన్సెస్ బదులు 2026–27 సెన్సెస్‌ను ఉపయోగించేటట్లు చేసుకోగలిగింది.*

*ఇప్పుడు, 2026–27 సెన్సెస్ తర్వాత ఏ డీలిమిటేషన్ ప్రక్రియ అయినా పూర్తి కావటానికి సంవత్సరాలు పడుతుందని బహుశా గుర్తించినట్లుంది. అందువల్ల 2029 లోక్‌సభ ఎన్నికలకు సైతం డీలిమిటేషన్ సిద్ధం కాదు కాబట్టి, గతంలో పూర్తి అయిన సెన్సెస్ ప్రాతిపదికగా – అనగా 2011 సెన్సెస్ ప్రకారం డీలిమిటేషన్ సాగించేందుకు ప్రభుత్వం తొందరపాటుతో కూడిన వేగం ప్రదర్శిస్తున్నట్లు కనిపిస్తున్నది. 131 వ రాజ్యాంగ సవరణ బిల్లు రాజ్యాంగ అధికరణలు 55, 81, 82, 170, 330, 332, 334ఎ లను సవరిస్తున్నది. దాని అత్యంత పర్యవసానపూర్వక మార్పులు ఇలా ఉన్నాయి : **ఒకటి,** లోక్‌సభ సభ్యత్వంపై గరిష్ఠ పరిమితిని రాష్ట్రాలనుంచి ఎన్నుకోబడే 530, కేంద్ర పాలిత ప్రాంతాలనుంచి 20 సంఖ్యను వరుసగా 815 మరియు 35కు అది పెంపుదల చేస్తుంది. **రెండు,** ''జనాభా''కు ఇప్పుడున్న రాజ్యాంగ నిర్వచనాన్ని అది మార్పు చేస్తుంది. సీటు కేటాయింపునకు 1971 సెన్సెస్, నియోజకవర్గాల హద్దుల గుర్తింపునకు 2001 సెన్సెస్‌ను ఆ నిర్వచనం నిర్దేశించింది. దానికి ప్రస్తుత బిల్లు నిర్నిబంధ సూత్రీకరణను ఇస్తున్నది : జనాభా అనగా ''చట్టంద్వారా పార్లమెంటు నిర్ణయించేటటువంటి'' సెన్సెస్ అని అర్థం. డీలిమిటేషన్ నిర్వహించేందుకు ఏ సెన్సెస్‌ను ఎంచుకోవటం అన్నది ఇకపై రాజ్యాంగంతో ముడిపడి ఉండదు. సాధారణ మెజారిటీతో ఆమోదించబడే సాధారణ శాసనం ఆధారంగా మార్పు చేసే వీలుంటుంది. **మూడు,** ఆర్టికల్స్ 82, 172 మూడవ నిబంధనను పూర్తిగా తొలగిస్తుంది. 1976లో 42వ రాజ్యాంగ సవరణ నాటినుంచీ సీటు కేటాయింపుపై అమలులో ఉన్న స్తంభన, 2001లో 84వ సవరణ ద్వారా పొడిగించబడింది. తమ జనాభాను స్థిరీకరించిన రాష్ట్రాలు, పర్యవసానంగా పార్లమెంటరీ సీట్లు కోల్పోకుండా అది హామీ ఇచ్చింది. ఈ రక్షణ ఇప్పుడు తొలగించబడుతున్నది.*

*సీట్లను ఏకరీతిన పెంపుచేయటంద్వారా ప్రతి ఒక్క రాష్ట్రానికీ ప్రస్తుతమున్న సీట్ల దామాషా పరిరక్షించబడుతుందని హోంమంత్రి అమిత్ షా, వాణిజ్య మంత్రి పీయుష్ గోయల్ సహా కేంద్రమంత్రులు దేశానికి హామీ ఇచ్చారు. అయితే ఈ హామీకి రాజ్యాంగ సవరణలో స్థానం దొరకలేదు. ఆర్టికల్ 81(2)(ఎ)ను యథాతథంగా ఉంచారు. సీట్లు, జనాభా మధ్య దామాషా అన్ని రాష్ట్రాలకూ 'ఆచరణయోగ్యంగా ఉన్న మేరకు' ఒకటిగానే ఉంటుందని అది ఆదేశిస్తున్నది. అది జనాభా దామాషా అవసరాన్ని కోరుతున్నదేగాని, అస్థిత్వంలో ఉన్న దామాషాలను పరిరక్షించదు.*

*2011 సెన్సెస్ డేటా ఆధారంగా 850సీట్ల సభను కేవలం జనాభా దామాషా ప్రకారం కేటాయింపులు చేసినట్లయితే వివిధ రీయిజన్‌లకు సీట్ల పెంపుదలలో తీవ్రమైన అసమానతకు దారితీస్తుంది. హిందీ కుంభస్థలం రాష్ట్రాల (ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, చత్తీస్‌ఘడ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ) సీట్లు ప్రస్తుతమున్న 207 నుంచి 543కు పెరుగుతాయి. 366 సీట్లు అనగా 77 శాతం పెరుగుదల* తరువాయి 2లో

## అండమాన్ జలాల్లో వలస ట్రాలర్ బోల్తా : 250 మంది గల్లంతు

### తొమ్మిదిమందిని రక్షించిన బంగ్లా నౌక

**ఢాకా:** హిందూ మహాసముద్రం అండమాన్ జలాల్లో కిటకిట లాడుతూ వెళుతున్న ట్రాలర్ బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న 250 మంది వలస ప్రజలు గల్లంతయ్యారు! వీరందరి జాడా తెలియడం లేదు. కానీ బంగ్లాదేశ్ జెండాతో అటుగా వెళుతున్న ఎం.టీ.మేఘనా ప్రైడ్ నౌక వీరిలో తొమ్మిది మందిని రక్షించింది. బంగ్లాదేశ్ కోస్ట్‌గార్డ్ ప్రతినిధి సాబ్బిర్ ఆలమ్ సుజన్ అసోసియేటెడ్ ప్రెస్‌తో మాట్లాడుతూ బహుశా ఏప్రిల్ 9వ లేదా 10వ తేదీలలో ఈ పడవ తుఫానులో చిక్కుకుని బోల్తా పడి ఉంటుందని అంచనావేశారు. తాము అధికారికంగా ఎలాంటి సహాయ కార్యక్రమాలు చేయడానికి రాలేదన్నారు. ఇవన్నీ బంగ్లాదేశ్ జలాలు కావన్నారు. మెరుగైన జీవితంకోసం వారంతా ఏప్రిల్ నాలుగో తేదీన బంగ్లాదేశ్ నుండి మలేసియా బయలు దేరారని చెప్పారు. ఈ ట్రాలర్ అండమాన్ సముద్రంలో మునిగిపోయింది. అక్రమంగా వలస వెళుతున్న రోహింగ్యాలు, బంగ్లాదేశీయుల ట్రాలర్ బోల్తా పడటంతో వారు గల్లంతయ్యారు. ఘటన ఎప్పుడు జరిగిందో స్పష్టంగా తెలియడంలేదు. ట్రాలర్‌లో తీవ్రమైన రద్దీ, బలమైన గాలులవల్ల వీరంతా గల్లంతైనట్లు ఐక్యరాజ్యసమితి శరణార్థుల,వలస ప్రజల సంస్థ సమాచారం తెలియజేసింది. మహిళలు,పిల్లలు మరణించి ఉంటారని అంచనా. బాధిత ప్రయాణికులలో సజీవంగా ఉన్నవారిలో తొమ్మిదిమంది శిథిలమైన చెక్కలు, డ్రమ్ములను పట్టుకుని వేలాడుతూ ఉండగా బంగ్లాదేశ్ నౌక వారిని రక్షించింది. మయన్మార్‌లో ఉన్న అణచివేతకు మైనారిటీ జాతులలో రోహింగ్యాలు కూడా ఉన్నారు. వీరంతా లక్షల సంఖ్యలో ఉంటారు. బతుకు గడవక, అణచివేత భరించలేక, మనుగడ సాగించలేక వీరంతా అనేక ప్రాంతాలకు దీర్ఘకాలంగా వలసలు వెళుతున్నారు. 2017లో జరిగిన ఘోరమైన అణచివేత తర్వాత ఎక్కువమంది బంగ్లాదేశ్‌కు పారిపోతున్నారు. బౌద్ధులు అధికంగా ఉన్న మయన్మార్‌లో ముస్లింలైన రోహింగ్యాలకు ఆశ్రయం ఇచ్చేందుకు తిరస్కరిస్తోంది. బంగ్లాదేశ్‌లో కూడా దయనీయమైన జీవన పరిస్థితులు ఏర్పడంతో ప్రమాదకరమైన పరిస్థితులను కూడా ప్రతిఘటించి రోహింగ్యాలు మలేసియాకు వెళ్ళిపోయేందుకు సముద్ర ప్రయాణం చేయడానికి సాహసిస్తున్నారు. మలేసియా ఒక ముస్లిం దేశం కావడంతో రోహింగ్యాలు దానిని సురక్షితమైన ప్రాంతంగా భావిస్తున్నారు.



# లెబనాన్–ఇజ్రాయెల్ మధ్య నిర్మాణాత్మక చర్చలు

● ఆగని దాడులు,ప్రతిదాడులు ● మానవతా సంక్షోభాన్ని పరిష్కరించాలి ● చర్చల్లో లెబనాన్ ప్రతినిధుల డిమాండ్ ● ఇజ్రాయెల్‌పై 30 రాకెట్లతో హెజ్బొల్లా దాడి

**వాషింగ్టన్:** ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య వాషింగ్టన్‌లో మంగళవారం రెండు గంటల పాటు ముఖాముఖీ చర్చలు విజయవంతంగా జరిగాయి. అమెరికా విదేశీమంత్రి మార్కో రుబియో ఈ చర్చలను చరిత్రాత్మకమైన అవకాశంగా పేర్కొన్నారు. ఈ నిర్మాణాత్మక చర్చలు భవిష్యత్తులో ప్రత్యక్ష సంభాషణలకు దారితీస్తాయన్నారు. ఈ చర్చలను హెజ్బొల్లా నాయకత్వం వ్యతిరేకించింది. మరోవైపు లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు జరుగుతుండగా, హెజ్బొల్లా సైన్యం కూడా ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులు చేసింది. సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో మరిన్ని చర్చలు జరపాలని రెండు దేశాలకు చెందిన ప్రతినిధులు వాషింగ్టన్ సమావేశంలో గట్టిగా నిర్ణయించుకుని ప్రతిజ్ఞ చేయడం అతిపెద్ద సానుకూల పరిణామం. ఇజ్రాయెల్ దాడులవల్ల లెబనాన్‌లో ఏర్పడిన మానవతా సంక్షోభాన్ని పరిష్కరించాలని చర్చల్లో పాల్గొన్న లెబనాన్ తరపు ప్రతినిధులు డిమాండ్ చేశారు. లెబనాన్‌లో ఇక యుద్ధం ముగించాలని, ఇజ్రాయెల్ సైన్యం వెనక్కు వెళ్ళిపోవాలని కూడా వారు కోరారు.అమెరికాలో ఉన్న లెబనాన్ దౌత్యవేత్త నాదా హమాదే మోవాహ్, అమెరికాలో ఇజ్రాయెల్ దౌత్యవేత్త యెచియెల్ లీటర్, లెబనాన్‌లో అమెరికా దౌత్యవేత్త మైఖేల్ ఇస్సా ముగ్గురు చర్చల్లో పాల్గొన్నారు. అనేక దశాబ్దాల తర్వాత ఈ రెండు దేశాలమధ్యా మళ్ళీ ముఖాముఖీ చర్చలు ప్రారంభమయ్యాయి.



ఈ చర్చలు నిర్మాణాత్మకంగా జరిగాయని లెబనాన్ దౌత్యవేత్త మోవాహ్ చెప్పారు. లెబనాన్‌లో యుద్ధం నిలిపివేయాలని ఆయన కోరారు. 1948లో పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ ఆవిర్భవించినప్పటినుండీ సాంకేతికంగా లెబనాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఇజ్రాయెల్‌తో దౌత్య చర్చలపై లెబనాన్‌లో తీవ్ర భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు బుధవారం దక్షిణ లెబనాన్ అంతటా గగనతల దాడులు,భూతల దాడులు చేసింది. బింట్ జెబైల్ వద్ద మళ్ళీ దాడులు జరిగాయి. హెజ్బొల్లా ఫైటర్లను ఐడిఎఫ్ దళాలు చుట్టుముట్టాయి. ఈ చర్చలను వ్యతిరేకిస్తున్న హెజ్బొల్లా సైన్యం బుధవారం ఇజ్రాయెల్‌పై 30 రాకెట్లతో దాడులు చేసింది. శత్రుదేశంలో చర్చలు జరపాల్సిన అవసరం లేదని హెజ్బొల్లా నాయకులు స్థిరమైన వైఖరితో లెబనాన్ భూభాగం నుండి ఉత్తర ఇజ్రాయెల్‌లోకి దాడులు చేశారు. లెబనాన్‌లో మార్చి రెండో తేదీ నుండి ఐ.డి.ఎఫ్ దళాలు భయంకరమైన దాడులు,భూతలయుద్ధం చేస్తూ మారణకాండ కొనసాగిస్తున్న తరుణంలో ఈ చర్చలను హెజ్బొల్లాతోపాటు ఇరాన్ నాయకత్వం కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇప్పటివరకూ జరిగిన యుద్ధంలో లెబనాన్‌లో 2,100 మంది మరణించారు. మరో 1500 మంది గాయపడ్డారు. అదేవిధంగా ఐదుగురు ఇజ్రాయెల్ సైనికులు మరణించారు. వాషింగ్టన్ చర్చల్లో ముఖాముఖీ పాల్గొనేందుకు మొదట లెబనాన్ ప్రధానమంత్రి నవాఫ్ సలామ్ సిద్ధమయ్యారు. ఇజ్రాయెల్‌ను తమ భూభాగం నుండి వెళ్ళగొడతామని, అప్పటివరకూ శాంతి యత్నాలు కొనసాగిస్తామని ఆయన తొలుత చెప్పారు. కానీ ఇరాన్, హెజ్బొల్లాల నుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆయన వెనుకంజవేశారు. హెజ్బొల్లా ఉగ్రవాద నాయకత్వం ఈ చర్చల ప్రక్రియను తీవ్ర వ్యతిరేకిస్తోంది. ఇజ్రాయెల్‌తో చర్చల నుండి వైదొలగాలని ఇరాన్ మద్దతుగల లెబనాన్‌లోని ఉగ్రవాద సంస్థ, రాజకీయపార్టీ ''హెజ్బొల్లా'' నాయకత్వం కోరుతున్నది. హెజ్బొల్లాను నిరాయుధులను చేయాలని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ నిర్దేశించుకున్నారు.

## శాంతి దూత పోప్‌పై ఆగని ట్రంప్ విమర్శలు

**వాషింగ్టన్:** అందరినీ తెలివితక్కువ దద్దమ్మలు, బుద్ధిహీనులు అని విమర్శించే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో యుద్ధం చేసే దురాగ్రహంలో మునిగిపోయి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, బుద్ధిహీనంగా ప్రవర్తిస్తున్నారని వాటికన్‌సిటీలో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. పోయి పోయి పోప్‌లియో –14తో వాగ్వాదానికి దిగి ట్రంప్ అప్రదిష్టపాలయ్యారు. ఐనాగానీ ఆయన ఈ గొడవను ఇంతటితో ముగించకుండా మళ్ళీ బుధవారం కొత్త విమర్శలు చేశారు. ఇరాన్‌లో యుద్ధం విరమించాలని విజ్ఞప్తి చేస్తే, ఇరాన్ దగ్గర అణుబాంబు ఉండటాన్ని పోప్ సమర్థిస్తున్నారని టంప్ భావిస్తున్నారు. ''గడచిన రెండు నెలలుగా వీధుల్లోకి వచ్చి ఉద్యమించిన 42,000 మంది సొంత ప్రజలను ఇరాన్ పాలకులు హతమార్చారని, ఇరాన్ వద్ద అణుబాంబు ఉండటం మంచిదికాదన్న విషయం ఆయనకు (పోప్) ఎవరైనా చెప్పండి'' అని రాత్రికి రాత్రే ట్రంప్ సోషల్ మీడియాలో కొత్త పోస్టింగ్ పెట్టారు. నాటో మనకు అండగా నిలవదు, భవిష్యత్తులోనూ అండగా ఉండదు అని కూడా విమర్శించారు. మొదట ఆయన ''పోప్‌కు నేరాలు, విదేశాంగ విధానం గురించి తెలియదని, ఈ రెండు విషయాల్లో ఆయన బలహీనుడు,దుర్బలుడు అని విమర్శించారు. ట్రంప్ పాలకులంటే తనకు భయం లేదని, శాంతికోసం పోరాడతానని పోప్ తిరిగి బదులిచ్చారు. ప్రపంచాన్ని శాంతి మార్గంలో నడిపించాలనే లక్ష్యంతో కార్యకలాపాలు నిర్వహించే వాటికన్‌సిటీ పెద్ద పోప్ లియో, ఇరాన్‌తో యుద్ధం మానుకోవాలని హుందాగా పెద్దరికంతో పలుసార్లు పరోక్షంగా ట్రంప్‌కు ఎవరిపేరూ ప్రస్తావించకుండానే హితవచనాలు



చెప్పారు. అధికారం ఉన్నవారు సామర్థ్యం ఉన్నవారు యుద్ధాన్ని కాకుండా శాంతిని ఎంచుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వచనాలు ట్రంప్‌ను ఉద్దేశించినట్టే కనిపిస్తున్నాగానీ ఎక్కడా పోప్‌లియో ట్రంప్ పేరు ప్రస్తావించలేదు. కానీ ట్రంప్ మాత్రం భుజాలు తడుముకున్నారు. పోప్‌లియోతో వాగ్వాదం ప్రారంభించారు. కేవలం ఆయన అమెరికన్ జాతీయుడు కావడం వల్లనే పోప్ కాగలిగారని, తాను వైట్‌హౌస్‌లో లేకపోతే ఆయన పోప్ స్థానంలో ఉండేవారే కాదని వ్యక్తిగత విమర్శలకు దిగారు. అంతటితో ఆయన ఆగకుండా ట్రంప్ దైవదూత ఏసుక్రీస్తు దుస్తులు ధరించి రోగులకు స్వస్థత చేకూర్చే బెత్యాన్ని పట్టుకుని ఒక రోగికి స్వస్థత చేకూరుస్తున్నట్లుగా కృతిమ మేధ టూల్‌తో సృష్టించిన చిత్రాలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. ట్రంప్ తననుతాను ఏసుక్రీస్తుగా భావించుకుంటున్నారన్న విమర్శలు సర్వత్రా చెలరేగాయి. ఆగ్రహం పెల్లుబికింది. దీంతో ట్రంప్ భయపడి వెంటనే ఆ పోస్టింగ్‌ను తొలగించారు. తాను కేవలం వైద్యుడిస్థానంలో ఉండి రోగికి స్వస్థత చేకూర్చాను తప్ప తాను దైవదూతస్థానంలో లేనని ట్రంప్ వివరణ ఇచ్చినాగానీ ఆయనపై ఆగ్రహం పెల్లుబికింది. పదకొండు రోజులపాటు ఆఫ్రికా ఖండంలో పర్యటన ప్రారంభించిన పోప్ లియో సోమవారం విమానంలో అల్జీరియాకు వెళుతూ ట్రంప్‌కు తాను భయపడే ప్రశ్నేలేదని మొదటిసారి బాహాటంగా హెచ్చరిక చేశారు. ప్రపంచశాంతికే తాము కట్టుబడి ఉన్నామని ఆయన అన్నారు. ప్రసుతం పోప్ కామెరూన్ దేశంలో పర్యటిస్తున్నప్పటికీ ట్రంప్‌తో వాగ్వాదం ఇంకా ముగిసిపోలేదు. ట్రంప్ దీనిని ఇంకా కొనసాగించడం శోచనీయంగా మారింది.

## రిజర్వేషన్ కుతంత్రం!

(మొదటి పేజీ తరువాయి)

*ఉంటుంది. సభలో వాటి వాటా 38.1శాతం నుంచి 43.1శాతానికి చేరుతుంది. దక్షిణాది రాష్ట్రాలు (తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, పుదుచ్చేరి) ప్రస్తుతమున్న 132 సీట్లనుంచి 176కు మాత్రమే చేరుకుంటాయి – 33 శాతం పెరుగుదల. వాటివాటా 24.3 శాతం నుంచి 20.7 శాతానికి తగ్గుతుంది. తూర్పు రాష్ట్రాల వాటా 14.4శాతం నుంచి 13.7శాతానికి పడిపోతుంది. ఈశాన్య రాష్ట్రాల వాటా 4.4 శాతం నుంచి 3.8శాతానికి తగ్గుతుంది. పశ్చిమ రాష్ట్రాలు, ఉత్తరాదిన ఉన్న హిందీయేతర రాష్ట్రాల వాటాలో మార్పు దాదాపు ఉండదు. తమ ఆరోగ్య మౌలిక వసతులు, విద్యా సౌకర్యాలు, పునరుత్పత్తి రేటును తగ్గించిన మహిళా ఏజన్సీ అభివృద్ధికి దశాబ్దాలు వెచ్చించిన రాష్ట్రాలు ఇప్పుడు ప్రజాస్వామిక అధికారంలో తమ వాటా తగ్గుదలను ఎదుర్కొంటున్నాయి. కాగా ఈ సూచికల్లో వెనుకబడిన రాష్ట్రాలు అత్యధిక సీట్లు లబ్ధిపొందుతున్నాయి. సామాజికంగా – ఆర్థికంగా పురోభివృద్ధి సాధించిన రాష్ట్రాల ద్రవ్య ఫెడరలిజం ఇప్పటికే బలహీనపడింది. ఇక ఇప్పుడు క్షీణించే రాజకీయ ప్రాతినిధ్యం ఆ అసంతృప్తిని ఇబ్బడుముబ్బడు చేస్తుంది.*

*ప్రజల మధ్య ఏ మాత్రం చర్చకు పెట్టకుండా, రెండు కీలకమైన రాష్ట్రాల్లో ఓటర్లు పోలింగ్‌కు వెళ్లే కొద్ది రోజుల ముందు ఈ శాసనాన్ని హడావుడిగా పార్లమెంటు ఆమోదం కోసం తోసుకురావటం–ఆ ఎంచుకున్న సమయం మరింతగా అనుమానాలకు హేతువవుతున్నది. రొటేషన్ ప్రాతిపదికపై నియోజకవర్గాలను రూపొందించటం ద్వారా, ప్రస్తుతమున్న 543 సీట్ల లోక్‌సభ లోపటే మహిళా రిజర్వేషన్ ఎందుకు అమలు జరపకూడదో కారణం కనిపించదు. 106 వ రాజ్యాంగ సవరణ ఆమోదం పొందిన తదుపరి ప్రతిపక్షం ఈ డిమాండ్ చేసింది. భారత యూనియన్ ఫెడరల్ పునాదులనే దెబ్బ కొడుతున్న శాసనాన్ని భిన్నాభిప్రాయానికి విలువ ఇవ్వకుండా సంఖ్యాబలంతో ఆమోదించుకోజూస్తున్న ప్రభుత్వ చర్యను, లోక్‌సభలో దామాషా ప్రాతినిధ్యం కోల్పోతున్న రాష్ట్రాల ఎంపిలు ప్రతిఘటించాలి. ఈ సవరణ ఆమోదం పొందటాన్ని అనుమతిస్తే రాగల పర్యవసానాలు అత్యంత తీవ్రమైనవి, ఊహించటమే కష్టం.* *(15.4.2026 )*

## వ్యతిరేకంగా ఓటేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పలు భాగస్వామ్య పార్టీల నాయకులు బుధవారం ఢిల్లీలోని ఖర్గే నివాసంలో సమావేశమయ్యారు. 'మేమందరం మహిళా రిజర్వేషన్ బిల్లుకు అనుకూలంగానే ఉన్నాము, కానీ దానిని తీసుకువస్తున్న విధానంపై మాకు అభ్యంతరాలు ఉన్నాయి. ఇది రాజకీయ ప్రేరేపితం. కేవలం ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కి, అణచివేయడానికే ప్రభుత్వం ఇలా చేస్తోంది' అని ఖర్గే మండిపడ్డారు. తాము మహిళా రిజర్వేషన్‌కు నిరంతరం మద్దతు ఇస్తున్నామని, గతంలో ఆమోదించిన సవరణను అమలు చేయాలని పట్టుబడుతున్నామన్నారు. వారు (బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం) నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కుతంత్రాలు పన్నుతున్నారని, అందువల్ల, ఈ బిల్లును వ్యతిరేకించాలని అన్ని పార్టీలు ఏకతాటిపైకి వచ్చి నిర్ణయం తీసుకున్నట్లు సమావేశం అనంతరం ఖర్గే వెల్లడించారు. డీలిమిటేషన్ కమిషన్ పనిచేస్తున్న తీరు చూస్తుంటే అది అధికార పార్టీకి మెజారిటీ సాధించేందుకు ఒక సాధనంగా మారిందన్నది స్పష్టమవుతోందని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్ అన్నారు. తాము డీలిమిటేషన్ చర్యను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలి, కానీ నియోజకవర్గాల పునర్విభజనకు పూర్తిగా వ్యతిరేకమన్నారు. ఖర్గే, రాహుల్ గాంధీతో పాటు, ఈ సమావేశానికి హాజరైన ఇతర నాయకులలో డిఎంకెకు చెందిన టి.ఆర్. బాలు, ఆర్‌జెడికి చెందిన తేజస్వి యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు సాగరిక ఘోష్, శివసేన (యుబిటి) నాయకులు సంజయ్ రౌత్, అరవింద్ సావంత్, ఎన్‌సిపి ఎస్‌సిపికి చెందిన సుప్రియ సూలే ఉన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ వర్చువల్‌గా పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కెసి వేణుగోపాల్, రమేష్‌లతో పాటు, సిపిఐ జాతీయ కార్యదరి అన్నీ రాజా, సిపిఐ(ఎం)కు చెందిన నీలోత్పల్ బసు, ఆప్ నాయకుడు సంజయ్ సింగ్, స్వతంత్ర ఎంపి కపిల్ సిబల్, ఐయుఎంఎల్‌కు చెందిన ఇ.టి. మహమ్మద్ బషీర్, ఆర్‌ఎస్‌పికి చెందిన ఎన్.కె. ప్రేమచంద్రన్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ నెల 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో, సాధారణంగా నారీ శక్తి వందన అధినియమ్‌కు సవరణలపై చర్చించనున్నారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను తప్పనిసరి చేస్తూ, మహిళా రిజర్వేషన్ చట్టంగా పిలువబడేది 2029లో అమలులోకి రానుంది.

## నియోజకవర్గాల పునర్విభజన బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

పెంచుతున్నారనే విషయాన్ని బిల్లులో కేంద్రం స్పష్టంగా చెప్పలేదు. పార్లమెంటులో చర్చ సందర్భంగా ప్రభుత్వం చెప్పే అవకాశం ఉంది. అప్పుడు అన్ని రాష్ట్రాల్లో స్థానాలను 50 శాతం పెంచుతామని చెబితే ఏయే రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు ఎన్ని పెరుగుతాయన్న దానిపై స్పష్టత వస్తుంది. ఆ రాష్ట్రాలకు వచ్చిన సీట్లను అంతర్గతంగా పునర్విభజించుకోవడానికి 2011 జనాభా లెక్కలు పనికొస్తాయి. అలా కాకుండా దేశం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని 2011 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన చేపట్టాలని నిర్ణయిస్తే డీలిమిటేషన్ కమిషన్ నివేదిక ఇచ్చే వరకూ ఏ రాష్ట్రంలో ఎన్ని సీట్లు పెరుగుతాయన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పునర్విభజన కోసం సుప్రీంకోర్టు ప్రస్తుత లేదా మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కానుంది. బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన తర్వాత కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి కమిషన్ అమల్లోకి వస్తుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత లేదా మాజీ న్యాయమూర్తిని కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ లేదా ఆయన ప్రతినిధి ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉంటారు. రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు కూడా ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులవుతారు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కమిషన్‌కు సహాయ పడటానికి ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని నియమిస్తారు. ఇందులో ఐదుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలుంటారు. లోక్‌సభ సభ్యులను లోక్‌సభ స్పీకర్, ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేస్తారు. ఈ కమిషన్ దేశవ్యాప్తంగా ఉన్న పార్లమెంటు, అసెంబ్లీలతోపాటు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని అసెంబ్లీ స్థానాల పునర్విభజననూ చేపడుతుంది. అందుబాటులో ఉన్న జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఎన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు ఉండాలన్నది డిలిమిటేషన్ కమిషన్ నిర్ణయిస్తుంది. రాష్ట్రాల వారీగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను విభజిస్తుంది.

## ముసుగు కావొద్దు : సిపిఐ

(మొదటి పేజీ తరువాయి)

ముసుగులో, జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజనపై స్పష్టత లేకుండా లోక్‌సభ సీట్లను పెంచాలని ప్రతిపాదిస్తూ, బిజెపి ప్రభుత్వం సమాఖ్య వ్యతిరేక ఎజెండాను ముందుకు తీసుకువెళ్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. ఇది దక్షిణ, చిన్న ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల ప్రయోజనాలకు ముప్పు కలిగిస్తూ, అర్థవంతమైన సంప్రదింపులను పక్కన పెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాఖ్యవాదాన్ని, ప్రజాస్వామ్య సమతుల్యతను దెబ్బతీయడానికి మహిళా రిజర్వేషన్ ఒక ముసుగుగా మారకూడదని అన్నీ రాజా అన్నారు. నిజమైన సాధికారత అనేది రాజకీయ ప్రయోజనాలపై కాకుండా, పారదర్శకత, సంప్రదింపులు, రాజ్యాంగ సమగ్రతపై ఆధారపడి ఉండాలని ఆమె స్పష్టం చేశారు.

## ఫెడరేషన్ చైర్మన్‌ల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ చర్చించారు. దాదాపు నాలుగున్నర గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో గత రెండేళ్లుగా ప్రభుత్వంలో, పార్టీలో పెండింగ్‌లో ఉన్న పదవుల గురించి చర్చించి వాటిపై ఒక కొలిక్కి వచ్చారు. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్స్, కార్యదర్శులు, పార్టీలోని ఇతర సంస్థాగత పదవులపై కూడా వారు సమగ్రంగా చర్చించారు. పార్టీ మండల కమిటీలు, బిఎల్‌ఎలపై భర్తీపై వారు ఆరాతీశారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చేపట్టాల్సిన వ్యూహంపై కూడా నాయకులు చర్చలు జరిపారు. ఇదిలా ఉండగా ప్రభుత్వంలోని, పార్టీలోని పదవులను భర్తీ చేయడం ద్వారా వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేయడం ద్వారా తిరిగి అధికారంలోకి రావడానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఒక కార్యాచరణ కార్యక్రమాన్ని చేపట్టాలని సిఎం, మహేష్‌కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్ ఖరారు చేసినట్లు సమాచారం. నామినేటెడ్ పదవులను, పార్టీ పదవులను ఆశిస్తున్న కాంగ్రెస్ నేతలు కొంత కాలంగా అసంతృప్తిగా ఉన్నారని ఇటవల చర్చ జరుగుతున్న నేపథ్యంలో వాటికి భర్తీకి నిర్ణయం తీసుకోవడం పట్ల నాయకులలో హర్షం వ్యక్తమౌతున్నది.

# ముగింపు ముంగిట్లో యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

శాశ్వత శాంతి ఒప్పందంపైనే దృష్టి సారించాలనుకుంటున్నామని కీలక ప్రకటన చేశారు. భవిష్యత్తులో దాడులు జరగకుండా శాశ్వత ప్రాతిపదికపై ఒక హామీ ఉండాలని ఇరాన్ తన పది అంశాల ప్రణాళికలో ప్రతిపాదించిన మేరకే ట్రంప్ ప్రకటన తీరు కనిపించడం విశేషం. కానీ ఇరాన్ వద్ద అణ్వాయుధం,అణుపదార్థం ఉండకూడదన్న మరో విషయం చర్చలకు ప్రధాన ఆటంకంగా ఉంది. ఈ తరుణంలో ఐఎఇఎ (అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ) అధిపతి రాఫెల్ మారియానో గ్రోస్సీ ఒక ప్రకటన చేస్తూ, అణుశుద్ధిపై నిషేధం అనేది రాజకీయ నిర్ణయమని,శాంతియుత ప్రయోజనాల కోసం అణు కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇరాన్ ఆసక్తితో ఉందని వ్యాఖ్యానించారు.

కాగా అమెరికా–ఇరాన్ మధ్య రాబోయే రెండు రోజుల్లో మళ్ళీ రెండో విడత చర్చలు తిరిగి ప్రారంభమవుతాయని ట్రంప్ చెప్పారు. ఇరాన్‌లో తాము సరైన వ్యక్తితో సంబంధాలు కొనసాగిస్తున్నామని, వారు చర్చలు కోరుకుంటున్నారని పాత పాట అందుకున్నారు. రెండు దేశాలమధ్య మరిన్ని శాంతి అవకాశాల గురించి మాట్లాడుతూ,''రెండు రోజుల్లో ఇస్లామాబాద్‌లో ఏదో ఒకటి జరగవచ్చు'' అన్నారు. చమురు సరఫరాకోసం 30 రోజులపాటు ఇచ్చిన ఆంక్షల విరమణను పునరుద్ధరించే ఉద్దేశం లేదని కూడా స్పష్టం చేశారు. దీనిపై ఇరాన్ దౌత్యవర్గాలు ప్రభుత్వ వార్తాసంస్థ ఐఆర్‌ఎన్‌ఎ వద్ద స్పందిస్తూ, చర్చలకు సంబంధించి మాకు ఎలాంటి సమాచారం లేదని పేర్కొన్నారు. మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ ద్వారా టెహ్రాన్‌కు సందేహాల మార్పిడి జరిగినప్పటికీ ఎక్కడా ధృవీకరణ లేదని ఐఆర్‌ఎన్‌ఎ తెలిపింది. ట్రంప్ తాజా ప్రకటనలపై ఇరాన్ స్పందించినట్లు కనిపించడంలేదు. ఏప్రిల్ ఎనిమిదో తేదీన ట్రంప్ ఇరాన్‌లో కాల్పుల విరఎలమణ ప్రకటన చేశారు. ఈ కాల్పుల విరమణ ఏప్రిల్ 22వ తేదీన ముగిసిపోతుంది. ఈ లోపే ఎలాగో అలా రెండో విడత చర్చలు నిర్వహించేందుకు అమెరికా–ఇరాన్ మధ్య పాకిస్థాన్ తీవ్ర ఒత్తిడి చేయడం ప్రారంభించింది.

**సఫలమవుతున్న మధ్యవర్తుల ప్రయత్నాలు!**

ఇరాన్‌లో యుద్ధ నష్టం 270 బిలియన్ డాలర్లు

పాకిస్థాన్‌తోపాటు టర్కీ,ఈజిప్టు దేశాల మధ్యవర్తులు యుద్ధ పరిష్కారానికి చేస్తున్న ప్రయత్నాలు ఎంతో సానుకూలంగా ఉన్నాయని ఈజిప్టు రాజధాని కైరో నుండి బుధవారం వార్తలు అందాయి. రెండో విడత చర్చల దిశగా వారి ప్రయత్నాలు ఫలిస్తున్న సంకేతాలు వచ్చాయి. కాల్పుల విరమణను ఇంకా పొడిగించేందుకు మధ్యవర్తులు ప్రయత్నం చేస్తున్నారు. ఏప్రిల్ 22వ తేదీతో కాల్పుల విరమణ ఒప్పందం ముగుస్తుంది. అమరికా గనుక దిగ్బంధనాన్ని నిలిపివేయకపోతే ఈ ప్రాంతంలో వాణిజ్యాన్ని స్తంభింపజేస్తామని ఇరాన్ మిలిటరీలో సీనియర్ అధికారి ఒకరు హెచ్చరించారు. దిగ్బంధనవల్ల, ఇరాన్ బెదిరింపులవల్ల పరిస్థితులు మళ్ళీ చెల్లాచెదురైనప్పటికీ, మరింత ఎక్కువగా దౌత్య కార్యకలాపాలు నిర్వహించడానికి వైరి పక్షాలు రెండూ సూత్రప్రాయంగా అంగీకరించాయని, చర్చలకోసం దౌత్యప్రక్రియ పురోగతిలో ఉందని ప్రాంతీయ అధికారులు అసోసియేటెడ్ ప్రెస్‌కు చెప్పారు. ఐతే మధ్యవర్తులు మాత్రం చర్చల్లో సమస్యాత్మకంగా ఉన్న మూడు అంశాలపైనే ఇరు దేశాలపై ఒత్తిడి పెంచారు. ఇరాన్ అణు కార్యక్రమం, హోర్ముజ్ జలసంధి,ఇరాన్‌లో జరిగిన నష్టానికి పరిహారం చెల్లించడం అనే అంశాలనే మధ్యవర్తులు ఆలోచిస్తున్నారు. ఫిబ్రవరి 28 నుండి జరిగిన యుద్ధంవల్ల ఇప్పటివరకూ 270 బిలియన్ డాలర్ల మేరకు నష్టం వాటిల్లిందని ఇరాన్ ప్రాథమికంగా అంచనావేసింది. ఈ నష్టపరిహారం చెల్లించాలని కూడా ఇరాన్ తన పది అంశాల ప్రణాళికలో ప్రధానంగా డిమాండ్ చేస్తోంది.

**పాక్ ప్రధానమంత్రి గల్ఫ్‌దేశాల పర్యటన**

ఇస్లామాబాద్‌లో రాబోయే రెండు రోజుల్లో ఏదో జరుగుతుందని ట్రంప్ ఒకవైపు ప్రకటన చేయగా, పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ మరోవైపు నాకలుగు రోజులపాటు గల్ఫ్ దేశాల పర్యటనకు బయలుదేరుతున్నారు. సౌదీఅరేబియా, టర్కీ, ఖతార్ దేశాలలో ఆయన పర్యటిస్తారని పాకిస్థాన్ విదేశీమంత్రిత్వశాఖ బుధవారం ప్రకటించింది. ఇస్లామాబాద్‌లో రెండో విడత అమెరికా–ఇరాన్ చర్చలకు సన్నాహాలు జరుగుతున్న తరుణంలో ఆయన గల్ఫ్ దేశాల పర్యటన ప్రారంభించారు. ద్వైపాక్షిక సంబంధాల పూర్వరంగంలోనే ఈ పర్యటన జరుపుతున్నారని తెలిపింది. టర్కీలో జరిగే అంటాల్యా దౌత్యవేదిక సమావేశంలో ఆయన పాల్గొంటారు. టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యప్ ఎర్దొగాన్ ఇతర నాయకులతో సంప్రదింపులు జరుపుతారు.

**బయటపడే మార్గం లేకుండా యుద్ధానికి వెళ్ళిన ట్రంప్**

ఎలా బయటపడాలనే మార్గాన్ని నిర్దేశించుకోకుండానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై యుద్ధానికి వెళ్ళారని బ్రిటన్ ఛాన్సలర్ రాచెల్ రీవ్ అన్నారు. ట్రంప్ అనుసరించిన తీరు తనకు తీవ్ర ఆవేదనను, ఆగ్రహాన్ని కలిగించిందని అమెరికా పర్యటనకు వెళ్ళేముందుగా బ్రిటన్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె విమర్శించారు. బుధవారం మధ్యాహ్నం ఆమె వాషింగ్టన్‌లో అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్‌తో సమావేశమయ్యారు. దీనిపై ఇతర మీడియా విశ్లేషకులు కూడా స్పందిస్తూ, బ్రిటన్‌లో చాలామంది ప్రజల మనసులో ఉన్న అభిప్రాయాలనే రాచెల్ రీవ్ వ్యక్తం చేశారని వ్యాఖ్యానించారు. ''ఇది మన యుద్ధం కాదు, మనం ఎంచుకున్న యుద్ధంకాదు, ఐనాగానీ ఈ యుద్ధ ప్రభావం మన ఆర్థిక వ్యవస్థమీద పడుతోంది'' అని యూరోపియన్ యూనియన్ దేశాలు ప్రధానాభిప్రాయంతో ఉన్నాయి. దీనిపై అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థకూడా స్పందించింది. పశ్చిమాసియాలో జరిగే సంఘర్షణ ఏ ఇతర అభివృద్ధి చెందిన దేశం కంటే ఎక్కువగా బ్రిటన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందని ఐ.ఎం.ఎఫ్ వ్యాఖ్యానించిన తర్వాత రాచెల్ రీవ్ ఈ విమర్శలు చేశారు.

**ఇరాన్ ఓడరేవుల్ని స్తంభింపజేశాం యుఎస్ సెంట్రల్ కమాండ్**

కాగా హోర్ముజ్ జలసంధి ద్వారా ఇరాన్ ఓడరేవుల నుండి నౌకలు రాకపోకలు చేయకుండా చాలా పటిష్టంగా దిగ్బంధన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని కూడా ట్రంప్ తన ఇంటర్వ్యూలో చెప్పారు. అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా ఇదే విషయాన్ని ధృవీకరించింది. దిగ్బంధనాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ఇరాన్ ఓడరేవుల్లో 10 వేలమంది ఉభయచర నైపుణ్యంగల సైనికులు,సాధారణ సైనికులను మోహరించినట్లు ప్రకటించింది. గడచిన 36 గంటల్లో ఇరాన్ ఓడరేవుల నుండి ఇతర దేశాలకు వెళ్ళే నౌకల కార్యకలాపాలను స్తంభింపజేశామని తెలిపింది. అనుమతి లేకుండా జలాల్లోకి ప్రవేశించిన నౌకలను అడ్డుకుంటున్నామని పేర్కొంది. అదేవిధంగా ఇరాన్‌తో ఎలాంటి సంబంధాలు లేకుండా రాకపోకలు చేసే నౌకలను వదిలిపెట్టేశామని తెలియజేసింది. కానీ ఇరాన్ ప్రాంతీయ పత్రికల కథనాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో 14 అమెరికా యుద్ధ నౌకలు దిగ్బంధన చర్యలను పర్యవేక్షిస్తున్నప్పటికీ కూడా దిగ్బంధనం సరిగ్గా అమలు కాలేదు. మొదటి 24 గంటల్లో చైనా నౌక సహా ఇరాన్ నౌకలు స్వేచ్ఛగా వెళ్ళాయి ఆంక్షలు విధించిన నౌకలు కూడా ఉన్నాయి. కొన్ని నౌకలు తమ నిజమైన ఆచూకీ తెలియకుండా ''స్ఫూఫింగ్'' పద్ధతిలో ట్రాన్స్‌పాండర్ల ద్వారా అమెరికా సైన్యాన్ని తప్పుతోవ పట్టించి వెళ్ళాయి. ఇతర దేశాలకు చెందిన మరో మూడు నౌకలు కూడా జలసంధిని దాటి వెళ్ళినట్లు అంతర్జాతీయ మీడియా ప్రకటించింది. మరోవైపు ఇరాన్ సైనిక విభాగం ఐఆర్‌జిసి ఒక ప్రకటన చేస్తూ, హోర్ముజ్ జలసంధి పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందని 8,000 కి.మీ ప్రాంతంలో బ్లాకేడ్ వల్ల తమ ఎగుమతులకు ఎలాంటి నష్టం కలగలేదని పేర్కొంది.కానీ గల్ఫ్ మెహర్‌న్యూస్ సమాచారం ప్రకారం, దిగ్బంధనం నేపథ్యంలో హోర్ముజ్‌లో అంతరాయాలను అధిగమించడానికి, ఇరాన్ ప్రత్యామ్నాయ ఓడరేవులు, నౌకా మార్గాలను అన్వేషిస్తోంది. హోర్ముజ్ జలసంధి దిగ్బంధనం ప్రమాదకరం, ఈ చర్య బాధ్యతారాహిత్యమని చైనా విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధి గుయో జియాకున్ విమర్శించారు. ఈ దిగ్బంధనం చట్ట విరుద్ధమని ఇరాన్ విమర్శించగా, స్వేచ్ఛగా నౌకల రాకపోకలు సాగాలని, చర్చలు ముందుకు సాగాలని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి గుటెర్రెస్ కోరారు. ఈ యుద్ధంలో 3,375 మంది ఇరాన్ ప్రజలు మరణించారు. వేలాదిమంది గాయపడ్డారు. లెబనాన్‌లో 2,100 మంది మరణించగా, ఇజ్రాయెల్‌లో 23 మంది మరణించారు. గల్ఫ్ అరబ్ దేశాల్లో 12 మంది పైగా మరణించగా, 13 మంది అమెరికా సైనికులు పశ్చిమాసియా యుద్ధంలో మరణించారు. యుద్ధం ఇప్పటికి ఏడువారాలకు చేరుకుంది. మార్కెట్లు తీవ్రంగా నష్టపోగా, నౌకల రాకపోకలు స్తంభించాయి.

# రాష్ట్ర వ్యాప్తంగా అదనంగా 14 వేల అదనపు స్పెషాలిటీ పడకల ఏర్పాటు

- జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం ప్రారంభం
- సత్తుపల్లిలో ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని ప్రారంభించిన డిప్యూటీ సిఎం, మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** విద్య, వైద్య రంగాలలో భారీ పెట్టుబడులతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లతో కలిసి సత్తుపల్లిలో రూ.34 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన వైద్య విధాన పరిషత్ 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సత్తుపల్లి పట్టణంలో వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించడంతో పాటు నేడు ఇదే నియోజకవర్గంలో ఒక 50 పడకల ఆసుపత్రి, మరో 30 పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవం, విద్యుత్ శాఖకు సంబంధించి పలు విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణ పనులకు శంకుస్థాపన, ఎకో టూరిజం ప్రాంతాన్ని పరిశీలన చేయడం జరిగిందని అన్నారు. నేడు ప్రారంభమైన ఆస్పత్రులు ప్రజల పట్ల ప్రజా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అని డిప్యూటీ సిఎం తెలిపారు. విద్య, వైద్య రంగాలపై అధికంగా పెట్టుబడి పెడుతూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు 14 వేల అదనపు పడకలు అందుబాటులోకి తీసుకొని వచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో పేద ప్రజలు కూడా విద్య అందుకోవాలని లక్ష్యంతో ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని అన్నారు. డిజిటల్ విద్యా, క్రీడలు, కల్చరల్ యాక్టివిటీస్ అందుబాటులో ఉండేలా ఆ స్కూల్స్ నిర్మాణం అవుతున్నాయని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని డిప్యూటీ సిఎం తెలిపారు. ప్రస్తుతం ఉన్న రెసిడెన్షియల్ స్కూల్స్‌లో పిల్లలకు మంచి నాణ్యమైన ఆహారం అందించేందుకు 40 శాతం డైట్ చార్జెస్, 200 శాతం కాస్మొటిక్ చార్జీలు పెంచడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 20 లక్షలకు పైగా విద్యార్థుల కోసం రాబోయే జూన్ 2 నుంచి అల్పాహార పథకం ప్రారంభిస్తామని తెలిపారు. నైపుణ్య విద్య ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లను మంజూరు చేసి యువతకు ఉపాధి లభించేలా అవసరమైన నైపుణ్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. హైదరాబాద్‌లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి అడ్వాన్స్ సెంటర్లను దానికి అనుబంధంగా చేయడం చేస్తున్నామని అన్నారు. ఎటిసి సెంటర్లలో వివిధ కోర్సులు చేసే విద్యార్థులకు ప్రతినెల రూ.2 వేల స్కాలర్‌షిప్ అందిస్తుందని అన్నారు. ఖమ్మం జిల్లా వ్యవసాయ ఆధారితమైన జిల్లా అని, ఇక్కడ రైతుల కోసం గత కాంగ్రెస్ హయాంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మించి ఆయకట్టు తీసుకొని వచ్చామని, నేడు మన ఇందిరమ్మ ప్రభుత్వం పెద్ద ఎత్తున నీటి వసతి కల్పించడం కోసం అనేక ప్రాజెక్టులు చేపట్టిందని, ప్రస్తుతం జిల్లాలో 3,40,000 ఎకరాలకు ఆయకట్టు ఉంటే, అదనంగా మరో 3 లక్షల 16 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు నీరు అందించేందుకు ప్రభుత్వం రూ. 2500 కోట్లు విడుదల చేశామన్నారు. మన రాష్ట్రంలో అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పేదవాడికి వైద్యానికి, విద్యకు ఎటువంటి లోటు రాకూడదనీ, ధనికులకు ఎటువంటి వైద్యం, విద్య అందుతున్నాయో, అటువంటి విద్య, వైద్యం పేదలకు అందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా పేదవాడే ప్రభుత్వానికి లోకమని భావించి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలోకి వచ్చిన 48 గంటల వ్యవధిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో గత ప్రభుత్వం మధ్యలో వదిలిపెట్టిన మూడు ఆసుపత్రులను వేగంగా పూర్తి చేసి నేడు ప్రారంభించుకుంటున్నామని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 200 కోట్లు ఖర్చు చేస్తూ దాదాపు 25 ఎకరాల విస్తీర్ణంలో 2500 మంది వివిధ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఇండియా సమీకృత గురుకులాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు కమీషన్లకు కక్కుర్తి పడి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు తప్ప పేదలకు ఇండ్లు కట్టలేదని మంత్రి విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ... రూ. 64 కోట్ల వ్యయంతో సత్తుపల్లి నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు నేడు ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు.

సత్తుపల్లి, అశ్వారావు పేట, సమీపంలోని ప్రాంత ప్రజలకు ఇక్కడి 100 పడకల ఏరియా ఆసుపత్రి ఉపయోగపడుతుందని అన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ.. ఒకే రోజు 3 ఆసుపత్రులను సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వాలు నామమాత్రపు నిధులు కేటాయించి నిర్మాణాలను మధ్యలోనే వదిలేస్తే, ప్రజా ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి అధునాతన వసతులతో ఆసుపత్రులను పూర్తి చేసి ప్రారంభించింది అని అన్నారు. సత్తుపల్లి ఆసుపత్రి వైద్యుల ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామని, వివిధ ప్రత్యేక వైద్యులు కూడా సత్తుపల్లి ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారని, అత్యవసర చికిత్సలు ఇక నుంచి సత్తుపల్లి నుంచే అందుబాటులో ఉంటాయని, ఈ ఆసుపత్రి ప్రారంభించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్, తహశీల్దార్, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సిఆర్ ఫౌండేషన్‌లో ఘనంగా కంకణాల వసుమతి 4వ వర్ధంతి

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లో సిఆర్ ఫౌండేషన్ మాజీ జనరల్ బాడీ, మహిళా సంక్షేమ కేంద్రం కమిటీ సభ్యురాలు, సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు కంకణాల నారాయణ సతీమణి కీ.శే. కంకణాల వసుమతి 4వ వర్థంతి సిఆర్ ఫౌండేషన్ మహిళా సంక్షేమ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పన, సభ్యులు వి.లలిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు విచ్చేసి వసుమతి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తదుపరి వక్తలు మాట్లాడుతూ వసుమతి బ్యాంకు ఉద్యోగినిగా పనిచేస్తు పదవి విరమణ తదుపరి సామాజిక సేవ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొంటూ నారాయణ చేస్తున్న ఏన్నో విషయాలలో సహకరిస్తూ తను చేస్తున్న ప్రజా సేవకు అండగా నిలిచి తనతో పాటు ఏన్నో సామజిక సేవ కార్యక్రమలలో పాల్గొంటూ తుది శ్వాస వరకు ప్రజా సేవకే అంకితం చేశారని తెలిపారు. తుదిశ్వస వరకు ప్రజా సేవలో గడిపిన వసుమతికి సిఆర్ ఫౌండేషన్ సభ్యులు, తదితరులు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కంభంపాటి అజయ్ కుమార్, వృద్ధాశ్రమం డైరెక్టర్, కోశాధికారి వి. చెన్నకేశవ రావు, సిఆర్ పాలిక్లినిక్ ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డా. కె. రజనీ, సిఇఓడి శ్రీనివాసరావు, సిఓఓ శ్రీమతి విజయలక్ష్మి, వృద్ధాశ్రమ సలహా కమిటీ సభ్యులు మల్లంపాటి వెంకటేశ్వరరావు, వి. సాంబశివరావు, అరుణకుమారి, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అసమానతలు లేని సమాజం కమ్యూనిజం ద్వారానే సాధ్యం

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి, ఇ.టి. నరసింహ్మా**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అసమానతలు లేని సమాజం కమ్యూనిజం ద్వారానే సాధ్యమని, ఈ లక్ష్యా సాధనలో ప్రజలు భాగస్వామ్యం కావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిలు తక్కలపల్లి శ్రీనివాస రావు, ఇటి.నరసింహ్మా పిలుపునిచ్చారు. సమాన హక్కులు, సమాన అవకాశాలు ప్రతి మనిషికీ లభించాలంటే ప్రస్తుత పాలనా విధానాల్లో మార్పులు అవసరమన్నారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పి ఎస్) రాష్ట్ర '2వ మహాసభల' లోగోను సిపిఐ రాష్ట్ర కార్యాలయంలోని రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో వారు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తక్కలపల్లి శ్రీనివాసరావు, ఇటి నరసింహా మాట్లాడుతూ దళితులపై ఇంకా అన్యాయాలు, వివక్ష కొనసాగుతున్నాయని, వీటిని అరికట్టడానికి కేవలం చట్టాలు సరిపోవని, సామాజిక చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో దళిత హక్కుల కోసం పోరాడుతున్న డిహెచ్‌పి ఎస్ వంటి సంస్థల పాత్ర ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. భూమి, విద్య, ఉపాధి రంగాల్లో సమానత్వం లేకుండా నిజమైన స్వేచ్ఛ సాధ్యం కాదని, దళితులకు రాజ్యాంగ బద్ధ హక్కులు ఉన్నప్పటికీ, అవి పూర్తిగా అమలు కావడం లేదని, అందుకే ప్రజాస్వామ్య పోరాటాలతో పాటు వర్గపోరాటం కూడా అవసరం అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు ఆరుట్ల రాజ్ కుమార్, సహాయ కార్యదర్శిలు జేరిపోతుల కుమార్, వై ఉషా శ్రీ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి టి కొమురెల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు నాయకులపై కేసులు కొట్టివేసిన సివిల్ కోర్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి నేదునూరి జ్యోతి, ఎఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి రావి శివ రామకృష్ణ, ఎఐఎస్ఎఫ్ యూనివర్సిటీల ఇన్‌చార్జి రెహమాన్‌లపైన ఆరేళ్ల క్రితం నమోదైన కుట్ర కేసులను సికింద్రాబాద్ సివిల్ కోర్ట్ బుధవారం కొట్టివేస్తూ తీర్పు వెల్లడించింది. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఆరేళ్ల క్రితం హైదరాబాద్ బేగంపేటలోని 'అమెరికన్ రాయబార' కార్యాలయ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న నేదునూరి జ్యోతి, రావి శివ రామకృష్ణ, రెహమాన్‌పైన ఇండియన్ ఫీనల్ కోడ్ 1860,120(బి), 341,186, 290,353, 506,143, 147 ఆర్, డబ్ల్యు 149, 109,120బి కుట్ర కేసును నమోదు చేశారు. ఆరేళ్ల పాటు సాగిన విచారణ అనంతరం ఈ కేసును సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు కొట్టివేస్తూ తుది తీర్పును వెల్లడించింది. కాగా ఈ కేసును వాదించిన సీనియర్ న్యాయవాది గుర్రం రాజశేఖర్ రెడ్డికి నేదునూరి జ్యోతి, రావి శివ రామకృష్ణ, రెహమాన్ కృతజ్ఞతలు తెలిపారు.

## డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

**జనాభా ఆధారంగా సీట్ల పెంపు నిర్ణయం పునరాలోచన చేయాలి : గుత్తా**



**ప్రజాపక్షం/నల్లగొండ:** జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ అమలు చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నల్లగొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియాతో ఆయన చిట్ చాట్ చేశారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో ఉన్న స్థానాలను 50 శాతం పెంచేలా కేంద్రం ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు. అయితే సీట్ల పెంపులో 50 శాతం జనా భా, 50 శాతం జీఎస్టీ ప్రాతిపదికను అనుసరించాలని పలు రాష్ట్రాలు సూచిస్తున్నాయని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లుల ను వేర్వేరుగా ప్రవేశపెట్టాలని రాష్ట్రాలు కోరుతున్నాయని తెలిపారు. జమి లీ ఎన్నికలు అమలు చేస్తే 18 రాష్ట్రాలు ఒకేసారి, మిగిలిన రాష్ట్రాలు మరోసారి ఎన్నికలకు వెళ్లే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 20 లక్షల మంది కూలీలు వచ్చి ఉపాధి పొందుతున్నారని, రాజకీయాల్లో డబ్బు ప్రభావాన్ని నియంత్రించకపోతే సామాన్యులకు పోటీ చేసే అవకాశం తగ్గిపోతుందన్నారు. ధాన్యం కొ నుగోలు విషయంలో ప్రస్తుతం సమస్యలు పరిష్కారమయ్యాయని, సన్నధా న్యం సేకరణలో ఎటువంటి ఇబ్బందులు లేవని తెలిపారు. సిఎంఆర్ ధా న్యం సేకరణపై పూర్తి స్థాయి నియంత్రణ అవసరమని, మిల్లులను మూసివేసే పరిస్థితి రాకూడదన్నారు. మిల్లులు బంద్ అయితే ధాన్యం కొనుగోలు వ్యవస్థ దెబ్బతింటుందని హెచ్చరించారు. కేంద్రం 20 శాతం బాయిల్డ్ రైస్, 80 శాతం రా‌రైస్ ఇవ్వాలని కోరుతున్నప్పటికీ, మిల్లర్లు బాయిల్డ్ రైస్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అలాగే సాగునీటి అంశంపై మాట్లాడు తూ, ఏఎమ్మార్పీ ద్వారా 4000 క్యూసెక్కుల నీరు ప్రవహించాల్సి ఉండగా ప్రస్తుతం 2400 క్యూసెక్కులకు మించి నీరు అందడం లేదన్నారు.కాలువల విస్తరణతో రైతులకు మేలు జరుగుతుందని,లైనింగ్‌కు ముందే విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు.

## 20న మేడిగడ్డకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**కాటారం మండలం నస్తూరుపల్లిలో బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన**





**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్ట్ మేడిగడ్డ పర్యటనకు ఈ నెల 20న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.ఈ నేపథ్యంలో నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్‌పి సిరిశెట్టి సంకీర్త్ బుధవారం పరిశీలించారు. సిఎం బహిరంగ సభ నిర్వహణకు అనువుగా ఉన్న కాటారం మండలం నస్తూర్ పల్లిలో సభా వేదిక, పార్కింగ్ సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు మౌలిక సదుపాయాలను అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 20న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడిగడ్డకు రానున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటన విజయవంతం చేయాలన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ నాగరాజు, ఎంపిడిఓ బాబు, కాటారం డిఎస్‌పి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సిఎం పర్యటన విజయవంతం చేయాలి : మంత్రి శ్రీధర్ బాబు

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 20వ జిల్లాలోని మేడిగడ్డ పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర ఐటి, ఇండస్ట్రియల్ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడలోని రాష్ట్ర ఐటి పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు నివాసంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్‌పి సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి మేడిగడ్డకు చేరుకుని ప్రాజెక్టును పరిశీలిస్తారని, అనంతరం సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించనునట్లు తెలిపారు. తరువాత కాటారం మండలం నస్తూర్ పల్లిలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని వివరించారు.

రైతు భరోసా మూడో విడత నిధులు, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల ను అందజేయనున్నారని, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అ న్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచే సి, పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రత, రవాణా, హెలిప్యాడ్, పారిశుద్ధం, తాగునీరు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాశ్ రెడ్డి, ఉపాధి హామీ పథకం రాష్ట్ర సభ్యులు దం డు రమేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబా బు, మహాదేవ పూర్ పిఎ సిఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టాంకామ్ సహకారంతో.. జర్మనీలో ఉద్యోగ అవకాశాలు

**మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**



**ప్రజాపక్షం/మంచిర్యాల :** రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను తీర్చడానికి ఇప్పటికే 70 వేలకుపైగా నిరుద్యోగులకు ఉద్యోగ అ వకాశాలు కల్పించిందని ఇదే బాటలో మరింత మందికి టాంకామ్ సంస్థ సహకారంతో జర్మనీలో ఉద్యోగ అవకాశాలకు ముందడుగు వే స్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కార్మాగా ర గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రకటించారు. బుధవారం మంచిర్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, టాంకామ్ ద్వారా విదేశాలలో ఉద్యోగ అవకాశాలపై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ను వివరించారు. జర్మనీ వంటి దేశాలలో భారీగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, తెలంగాణ యువత ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జర్మనీలో ప్రతి సంవత్సరం సుమారు ఐదు లక్షల ఉద్యోగాలు అవసరం ఉందని అందుకు అనుగుణంగా ప్రతి ఏడాది 90 వేల వీసాలు జారీ చేసేందుకు ఆదేశం ముందుకు వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఎటిసిల ద్వారా 25 వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నామని ఇందుకోసం ప్రభు త్వం నాలుగు వేల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. టాంకామ్ ద్వారా నాలు గు నెలల్లోనే జర్మనీ భాష శిక్షణ అందిస్తామని ప్రైవేటు ఏజెన్సీల మోసాలకు గురికాకుండా యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విదేశాలలో భారతీయులకు మంచి పేరు ఉందని అక్కడి చట్టాలను గౌరవిస్తు కష్టపడి పని చేస్తారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హా మీ ఇచ్చిందని ఇప్పటికే 70 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కిందన్నారు. స్థానిక నిరుద్యోగ యువత టాం కామ్ అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. తెలంగాణ గిగ్ వర్కర్స్ యాక్ట్ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మంత్రి వివరించారు.

## విద్యుత్ ఆర్టిజెన్స్ సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింప చేయాలి

**కార్మిక సంఘాల డిమాండ్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా గత ఎనిమిది రోజులుగా విద్యుత్ ఆర్టిజన్స్ సమ్మెను నిర్వహిస్తున్న కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడం తీవ్ర అన్యాయమని కార్మిక సంఘాలు విమర్శించాయి. కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వం ఎం.నరసింహ, నారాటి ప్రసాద్ (ఎఐటియుసి), విజయ్ కుమార్, చంద్రశేఖర్ (ఐఎన్‌టియుసి), ఎస్. వీరయ్య, వంగూరి రాములు (సిఐటియు), కె.సూర్యం (టియుసిఐ), ఎం.శ్రీనివాస్(ఐఎఫ్‌టియు)ల ఆధ్వర్యంలో బుధవారం లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అనంతరం లేబర్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేయుచున్న ఆర్టిజన్స్, ఆన్ మ్యాన్, పీస్ రేట్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులకు సమ్మె నోటీసు అందజేసి, తమని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ గత ఎనిమిది రోజులుగా నిరవధిక సమ్మె కొనసాగుతుండగా అధికారులు సమ్మెను పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేయకపోగా, కార్మికులను బెదిరించే పద్ధతులను అవలంబించడం అన్‌ఫేర్ లేబర్ ప్రాక్టీస్ అని విమర్శించారు. దాదాపు 20 వేల మంది విద్యుత్ ఆర్టిజెన్స్ రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలో కొనసాగుతున్నారని, సమ్మె ద్వారా రాష్ట్ర ప్రజానీకానికి విద్యుత్ సరఫరాలో అన్యాయం జరిగితే దానికి రాష్ట్ర ప్రభుత్వాధికారులు, విద్యుత్ సంస్థల అధికారులు మాత్రమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆర్టిజెన్సును విలీనం చేస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు అయిపోయినప్పటికీ నేటికీ కూడా ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుం డా సమ్మె చేస్తున్న కార్మికులను అణచివేయడానికి ప్రయత్నించడం సమంజసం కాదని పేర్కొన్నారు. తక్షణం విద్యుత్ సంస్థల యాజమాన్యం కార్మిక నాయకులతో చర్చించి వారి సమస్యలను పరిష్కారం చేసి సమ్మెను విరమింప చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ కార్మికుల సమ్మెకు మద్దతుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారగోని ప్రవీణ్ కుమార్, సిఐటియు నాయకులు భూపాల్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత

**ప్రజల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం : ఎఐవైఎఫ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న మందుల కొరతను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా, పేద ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆగ్రహం వ్యక్తం చేసింది. పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఆధారపడే ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా బలహీనపరుస్తూ, కార్పొరేట్ ఆసుపత్రులకు లాభాలు చేకూర్చే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించింది. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సంచాలకులు బి.రవీంద్ర నాయక్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరతపై హై లెవల్ జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని, అన్ని ప్రాథమిక, ప్రాణరక్షక మందులను తక్షణమే ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సాధారణ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులకు అత్యవసరమైన ప్రాథమిక మందులు కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో లేకపోవడం అత్యంత దారుణమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు ప్రిస్క్రిప్షన్ ఇచ్చినా, మందులు లేకపోవడంతో రోగులు ప్రైవేట్ మెడికల్ షాపుల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని, ఇది పేదలపై ఆర్థిక దాడి చేయడమేనని అన్నారు. ప్రభుత్వ ఆరోగ్య రంగానికి భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రచారం చేసుకుంటూ, కింది స్థాయి వాస్తవాలను పూర్తిగా విస్మరిస్తోందని మండిపడ్డారు. మందుల కొనుగోలు, సరఫరా వ్యవస్థలో అవినీతి, మధ్యవర్తుల దోపిడి వల్లనే మందులు అందడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నేర్లకంటి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన హుజురాబాద్ ఎఇ



**ప్రజాపక్షం / హుజురాబాద్ :** కాంట్రాక్టు పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించేందుకు లంచం డిమాండ్ చేసిన ఓ ప్రభుత్వ అధికారి ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పురపాలక సంఘంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పని చేస్తున్న నుసుం సుధాకర్ రెడ్డి బుధవారం రూ.50వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేసారు. హుజురాబాద్ మున్సిపల్ పరిధిలో ఒక కాంట్రాక్టర్ నీటి కాలువ పనులను పూర్తి చేశారు. ఈ పనులకు సంబంధించిన తుది బిల్లును ప్రాసెస్ చేయాలన్నా, మెజర్మెంట్ బుక్‌లో వివరాలు నమోదు చేయాలన్నా తనకు లంచం ఇవ్వాలని ఎఇ సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. దీంతో విసిగిపోయిన బాధితుడు కరీంనగర్ ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి పిర్యాదు మేరకు పథకం ప్రకారం ఎసిబి అధికారులు బుధవారం ఆర్టీసి డిపో చౌరస్తా వద్ద ఎఇ సుధాకర్ రెడ్డి బాధితుడి నుండి 50వేలు నగదు తీసుకుంటుండగా మెరుపు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడి నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపర్చారు.

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: జడ్చర్ల మున్సిపాలిటీ, మహబూబ్‌నగర్ జిల్లా (టిఎస్)**

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన**

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను, SBM 2.0 గ్రాంట్ కింద వివిధ ప్రదేశాలలో "Aspiration Toilets" (ఆశయ మరుగుదొడ్ల) నిర్మాణం నిమిత్తం, రూ. 30.00 లక్షల అంచనా విలువతో కూడిన 01 పనికి సంబంధించి, "ఇ"-ప్రొక్యూర్‌మెంట్ వేదిక ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. బిడ్ పత్రాల డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 13.04.2026, మధ్యాహ్నం 02:30 గంటలకు; బిడ్ పత్రాల డౌన్‌లోడ్ ముగింపు తేదీ: 24.04.2026, మధ్యాహ్నం 02:30 గంటలకు. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అయిన https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు. బిడ్లను ఆహ్వానించు కార్యాలయం: కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ, తెలంగాణ రాష్ట్రం. ఫోన్: 8179333826.

సం/- కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

DIPR R.O. No. : 750-PP/CL/ADVT/2026-27, Date: 15-04-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ :: మల్కాజ్‌గిరి జోన్**

NIT No. 04/EE-1/MKJZ/MMC/2026-27,

పని పేరు: నిర్వహణ పనులు: ఇతరాలు-1, అంచనా విలువ : రూ.20.00 లక్షలు, బిడ్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం / బిడ్ దాఖలుకు ఆఖరి తేదీ & సమయం: 16.04.2026న సా.4.30గం.ల నుండి 20.04.2026న సా.4.30గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9154796465, 7995009098. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-1, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.

DIPR R.O. No. : 747-PP/CL/ADVT/2026-27, Date: 15-04-2026



## నిబంధనల ప్రకారం డిగ్రీ అడ్మిషన్లు

ఎంజియు ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నాణ్యమైన విద్యను అందిస్తూ సమాజానికి మెరుగైన మానవ వనరులను తయారు చేయడం విద్యాసంస్థల ప్రధాన బాధ్యత అని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం (ఎంజియు) ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పేర్కొన్నారు.ఎంజియు పరిధిలోని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఆడిట్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం విశ్వవిద్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈసమావేశంలో డిగ్రీ అడ్మిషన్లు, కోర్సుల నిర్వహణ, అమలు విధానాలపై విస్తృతంగా చర్చించారు.ఈసందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ డిగ్రీ అడ్మిషన్లు తప్పనిసరిగా దోస్త్ నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.కోర్సుల్లో 25 శాతం కంటే తక్కువగా విద్యార్థులు ఉన్నట్లయితే,ఆ కోర్సును రద్దు చేసి విద్యార్థులను ఇతర కోర్సులు లేదా కళాశాలలకు మార్చే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే ప్రతి కళాశాలలో అడ్మిషన్ ప్రక్రియను సమీక్షిస్తూ, విద్యార్థుల సంఖ్యను విభాగాల వారీగా పరిశీలించి తగిన సూచనలు చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ వై.ప్రశాంతి,డాక్టర్ జయంతి,సమరీన్ కాజ్మీతో పాటు వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

## మంచి నీటి కొరత రావొద్దు

దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/చందంపేట:** చందంపేట మండలం ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనపై మండల అధికారులు ,ప్రజా ప్రతినిధులతో కలిసి దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ గ్రామ పంచాయితీ ఆదాయం , బడ్జెట్‌కు అనుగుణంగా గ్రామాలలో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో పని చేయాలని అధికారులకు సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చి 6 నుండి 99 రోజుల పాటు, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అన్ని శాఖల సమన్వయంతో ఒక ఉద్యమంలో కార్యక్రమం ఉద్యమంలా సాగుతుందని గ్రామాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయాలని తెలిపారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిని వెంటనే తొలగిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపిడివో లక్ష్మి , వెంకటయ్య, గోవిందు, బద్యనాయక్, సాధిక్, జలందర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్:** ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోకుండా నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రొఫసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కట్టుబడి ఉన్నారని,నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్,మండల విద్యాధికారి మేకల నాగయ్య,పాఠశాల ప్రదానోప్యాయులు రాములు,నాయకులు లింగాల వెంకన్న,పన్నాల రాఘవరెడ్డి,స్థానిక కౌన్సిలర్లు,ఉపాధ్యాయులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మున్సిపల్ కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు ఎన్నికల నోటిఫికేషన్‌ను మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ బుధవారం జారీ చేశారు. గ్రేడ్1 మున్సిపాలిటీ అయిన మిర్యాలగూడలో నలుగురు సభ్యులు మైనార్టీల నుంచి ఒక మహిళ, ఒక జనరల్, ఇద్దరు మున్సిపల్ పాలనలో అనుభవమున్న, మాజీ కౌన్సిలర్ల కోటా కింద ఒకరు జనరల్, ఒక మహిళను ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. నలుగురు సభ్యుల ఎన్నికకు ఈనెల 21న సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని, గడువు తరువాత దరఖాస్తులు స్వీకరించరని అన్నారు. దరఖాస్తుదారులు దరఖాస్తుతో అనుభవ ధృవీకరణ పత్రం, ఓటర్ ఐడి, ఆధార్ జీరాక్స్ ప్రతులు, మూడు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, మైనార్టీ ధృవీకరణ పత్రం జతపరచాలన్నారు. 21 నుంచి 24వరకు కార్యాలయంలో పరిశీలన, 24న సాయంత్రం దరఖాస్తుదారుల తుది జాబితా ప్రకటిస్తామన్నారు. 27న కోఆప్షన్ సభ్యులను ఎన్నుకునేందు కు ప్రత్యే క సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికైన కోఆప్షన్ సభ్యుల ఎన్నిక వివరాలు సమావేశం అనంతరం నోటీసు బోర్డుపైన, వెబ్‌సైట్‌లో పెడ్తామన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షన్ 2026లో భాగస్వాములవ్వాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షన్ 2026లో సూర్యాపేట పట్టణ ప్రజలు భాగస్వాములై సూర్యాపేట పట్టణాన్ని మరొక్క సారి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుటకు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాదీ అన్నారు. బుధవారం పట్టణంలోని సద్దుల చెరువు కట్టపై వాకర్స్‌తో ఏర్పాటు చేసిన స్వచ్ఛ సర్వేక్షన్ అవేర్‌నెస్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రజలు తమ ఇండ్లలోని తడి, పొడి, హానికరమైన చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. ప్రజలు తమ ఇండ్లలోని తడి పొడి, హానికరమైన చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. మురికి కాలువలలో చెత్త చెదారం చేయవద్దని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రముగా ఉంచుకోవాలన్నారు. మున్సిపల్ కమీషనర్ సిహెచ్ హన్మంత రెడ్డి మాట్లాడుతూ 2026లో సూర్యాపేటను జాతీయస్థాయిలో ముందు ఉంచుటకు ప్రజలు సహకారం, సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ యండి షఫీ ఉల్లా, కౌన్సిలర్ కుమ్మరికుంట్ల వేణు, గునగంటి హేమసతీష్ పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే...

# ప్రమాదాల నివారణ

మంత్రి అడ్లూరి లక్ష్మణ్

అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలి

డిజిపి బి.శివధర్ రెడ్డి సూచనలు



**ప్రజాపక్షం/నకిరేకల్:** ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించడం ద్వారా ప్రాణాపాయ ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం నకిరేకల్ మినీ స్టేడియంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పోలీసు శాఖ, రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రహదారులపై అతివేగాన్ని నియంత్రించేందుకు పెట్రోలింగ్ పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నకిరేకల్ నియోజకవర్గంలోని 40 గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో హెల్మెట్ వినియోగాన్ని ప్రోత్సహిస్తూ తీసుకున్న తీర్మానాలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు.ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అండర్‌పాస్‌ల అవసరాలపై నివేదిక అందిస్తే, వాటి నిర్మాణానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**అప్రమత్తతతో డ్రైవింగ్ చేయాలి: డీజీపీ శివధర్ రెడ్డి**

డీజీపీ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ, డ్రైవింగ్ సమయంలో వాహనదారులు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రహదారులపై ఎడమ వైపున ప్రయాణించాలి, కుడి వైపునుంచే ఓవర్‌టేక్ చేయాలని చెప్పారు. రాత్రి వేళలో ఎదురుగా వస్తున్న వాహనాలకు లైట్ ఫోకస్ తగ్గించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. నల్లగొండ జిల్లాలో ప్రతి సంవత్సరం సుమారు 24 హత్యలు చోటుచేసుకుంటే, 327 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని, సూర్యాపేట జిల్లాలో 20 హత్యలతో పోలిస్తే 230 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ,తుంగతుర్తి ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, మందుల సామెల్,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మదర్ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి,నల్లగొండ జిల్లా కలెక్టర్ బడుగుల చంద్రశేఖర్, డీఐజీ చౌహాన్,నల్లగొండ, సూర్యాపేట ఎస్పిలు శరత్ చంద్ర పవర్,నరసింహా,అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి,అదనపు ఎస్పి రమేష్,డిఎస్పి శివరాం రెడ్డి, డిటీసీ వాణి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాస్ నేత, కాంగ్రెస్ నేత సర్వోత్తమ్ రెడ్డి,నకిరేకల్, చిట్యాల మున్సిపల్ చైర్మన్లు రజిత శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ప్రజల్లో చైతన్యం పెరిగితేనే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**



రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన,చైతన్యం అత్యంత అవసరమని నల్లగొండ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,అది ప్రాణాలను కాపాడే రక్షణ కవచంలాంటిదని తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అనేక అమాయక ప్రాణాలు బలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రతపై పాఠశాలలు, కళాశాలలు,స్వచ్ఛంద సంస్థలు కలిసి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.



## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ(నార్కట్ పల్లి):** జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.బుధవారం కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి కొనుగోలు ప్రక్రియను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపాలని,లారీలను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడైనా మిల్లుల సామర్థం సరిపోకపోతే అదనపు మిల్లులను ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అంతరాయం రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.వ్యవసాయ అధికారి సర్టిఫికెట్ ఇచ్చే వరకు లోడింగ్ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ వరి పంట పరిస్థితులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. తెగుళ్ల గురించి ప్రశ్నించగా,ఒక రైతు పంటపై పురుగుమందులు పిచికారీ చేసినప్పటికీ చివరి దశలో దోమ కాటు కారణంగా నష్టం వాటిల్లిందని వివరించారు. మరో రైతు నాలుగు ఎకరాలు కౌలు తీసుకుని,రెండు ఎకరాలు స్వంతంగా కలిపి మొత్తం ఆరు ఎకరాల్లో వరిసాగు చేశానని తెలిపారు. అనంతరం మండలంలోని జివ్విగూడెం గ్రామం లో ఉన్న శివ సాయి వినాయక రైస్ మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లులో ధాన్యం ,గన్నీ బ్యా గుల నిల్వ గదులు, బియ్యం నాణ్యత పరిశీలించారు.

## ప్రయాణ సమయంలో రోడ్డు నియమాలు పాటిద్దాం

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రయాణ సమయంలో తల్లిదండ్రులు రోడ్డు నియమాలు పాటించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తల్లిదండ్రులకు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీస్‌ల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం 3వ రోజు సూర్యాపేట పట్టణంలో గల సిటి టాలెంట్ హైస్కూల్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆయన, జిల్లా ఎస్పి కె. నరసింహతో కలిసి హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదుగాలని ఆకాంక్షించారు. రోడ్లపై ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, రోడ్లపై నిర్లక్ష్యం జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ వినియోగం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఎవరైనా తప్పుడు మార్గాలు సూచించిన తప్పుడు పనులకు ప్రోత్సహించిన వాటిని ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులతోపాటు వాహనాలపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు. జిల్లా ఎస్పి కె. నరసింహ మాట్లాడుతూ రోడ్లపై తల్లిదండ్రులు అజాగ్రత్తగా ఉండడం వల్ల చాలా మంది పిల్లలు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారని తెలిపారు. అనంతరం రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్మెట్స్ పంపిణీ చేశారు. అంతకుముందు రహదారి వినియోగంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాల గురించి రవాణా శాఖ అధికారి జయప్రకాష్ రెడ్డి, సూర్యాపేట డిఎస్పి ప్రసన్న కుమార్, పట్టణ సిఐ వెంకటయ్య విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణయ్య, విద్యాసంస్థల కరస్పాండెంట్ ప్రకాష్, ప్రిన్సిపాల్ మురళీధర్, పోలీస్, ఆర్‌టిఓ అధికారులు పాల్గొన్నారు.



## చండూరు మున్సిపాలిటీలో కో- ఆప్షన్ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం

**ప్రజాపక్షం/చండూరు :** చండూరు మున్సిపాలిటీలో బుధవారం కో ఆప్షన్ సభ్యులు ఎన్నిక ప్రక్రియ మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా ,ప్రభుత్వ నియమ ,నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం జరిగింది. చండూరు మున్సిపల్ పట్టణానికి చెందిన మోగుదాల సత్తమ్మ, కల్లెట్ల చంద్రకళ , మైనార్టీ వర్గాల నుండి షేక్ ఖలీల్ , మహమ్మద్ సలీమా కో ఆప్షన్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో చండూరు మున్సిపాలిటీకి కోఆప్షన్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక చేసినందుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి , మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులుకు , వైస్ చైర్మన్ భూతరాజు దశరథ , కౌన్సిల్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ మల్లేశం , చైర్మన్ కోడి శ్రీనివాసులు , వైస్ చైర్మన్ భూతరాజు దశరథ , కౌన్సిలర్లు బుషిపాక వాసు, జెల్ల ధనమ్మశ్రీనివాస్ , కోడి సుష్మావెంకన్న, కలిమికొండ పారిజాతజనార్ధన్ , కటకం రమేష్ పాల్గొన్నారు.

## గర్భిణుల ఆరోగ్య, శిశు అభివృద్ధికి పోషకాహారం కీలకం

**ప్రజాపక్షం/ఆలేరు :** మహిళలు, శిశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆలేరు కార్యాలయంలో గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు ఘనంగా నిర్వహించారు. గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పిస్తూ, పోషకాహార ప్రాముఖ్యతను వివరించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆలేరు మున్సిపల్ చైర్మన్ బిజినె బాలమణి మాట్లాడుతూ గర్భిణీ సమయంలో సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా శిశువు ఆరోగ్యవంతంగా పుట్టడమే కాకుండా, మెదడు అభివృద్ధి కూడా మెరుగ్గా జరుగుతుందని తెలిపారు. శిశువు అభివృద్ధిలో తొలి వేయి రోజులు అత్యంత కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో రెండవ వార్డు కౌన్సిలర్ మరియమ్మ, ఎంపీడీఓ సత్య ఆంజనేయ ప్రసాద్, తహసిల్దార్ ఆంజనేయులు, ఏపీఎం సత్యనారాయణ, సీడీపీఓ స్వరాజ్యం, సూపర్వైజర్లు ఆండాలు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు


**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. బుధవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యులు , సిబ్బంది ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని రిజిస్టర్లను చెక్ చేశారు. డాక్టర్లు, సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ప్రతిరోజు ఓపికి ఎంత మంది వస్తున్నారని ఓపి రిజిస్టర్‌ను పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఆసుపత్రి ఆవరణలో తిరుగుతూ పేషంట్ల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన చికిత్సలు అందిస్తున్నారా అని ఆసుపత్రికి వచ్చిన పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు డాక్టర్లు, సిబ్బంది మంచిగా చూస్తున్నారా అని ఆరా తీశారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను ప్రతిరోజు శుభ్ర పరచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐకి అండగా నిలవండి

**ప్రజాపక్షం/దేవరకొండ :** సిపిఐ ఇంటింటికి కార్యక్రమలో భాగంగా బుధవారం దేవరకొండ మండలం పడమటిపల్లి , ఎల్లారెడ్డిబావి గ్రామాలలో తిరిగి ఉద్యమాల నిధి సేకరణతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజల పార్టీ అని పేద ప్రజల హక్కుల కోసం ఈ దేశ సమగ్రత కోసం కమ్యూనిస్టు పార్టీ పాటు పడిందని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 1925లో పుట్టి వంద సంవత్సరాలలో ప్రజల కోసం అట్టడుగు వర్గాల కోసం పోరాటాల పార్టీగా నిలిచిందని మార్క్సిజం, లేనినిజం ఆలోచనలకు అనుగుణంగా వాటి అమలు కోసం నిరంతరం నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పల్లా రంగారెడ్డి, మాజీ సర్పంచ్ కిన్నెర యాదయ్య, నాయకులు గోవర్ధన్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/చండూరు:** పేద వర్గాల సంక్షేమమే లక్ష్యంగా నిత్యం ఉద్యమాలు నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కి విరివిగా విరాళాలు అందజేసి భవిష్యత్తు పోరాటాలకు మరింత అండగా నిలవాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం చండూరు లో ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా ఆయన పార్టీ నాయకులతో కలిసి ప్రజల నుండి నిధి విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. చండూరు మున్సిపాలిటీలో ఉన్న సమస్యలను ప్రజలు పార్టీ నాయకుల దృష్టికి తీసుకొస్తున్న తరుణంలో సమస్యల పరిష్కారం కోసమే సిపిఐ ఇంటింటి కార్యక్రమం నిర్వహిస్తుందని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , సిపిఐ జిల్లా సమితి సభ్యులు తిప్పర్తి రాములు , మండల పార్టీ కార్యవర్గ సభ్యులు దోటి వెంకన్న , బండమీది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## కేంద్రం ఒబిసి వర్గాలపై తీవ్ర అన్యాయం

16న ఢిల్లీలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలి

వి.హనుమంతరావు పిలుపు

జనగణనలో కుల గణన తప్పనిసరి చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ:** కేంద్ర ప్రభుత్వం ఓబీసీ వర్గాలపై తీవ్రమైన అన్యాయం చేస్తోందని మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు ఘాటుగా విమర్శించారు. జనగణనలో కుల గణనను తప్పనిసరిగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న ఢిల్లీలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని యాదవ్ సంఘం భవనంలో డీసీసీ అధ్యక్షులు పున్న కైలాస్ నేత అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న డిలిమిటేషన్ ప్రక్రియ దక్షిణ భారత రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేసే విధంగా ఉందని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా,ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శించారు. డిలిమిటేషన్ వల్ల ఉత్తర భారతదేశంలో పార్లమెంట్ స్థానాలు పెరిగే అవకాశం ఉందని,దీంతో బీజేపీకి రాజకీయ లాభం కలిగేలా కేంద్రం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఇది దేశ సమతుల్యతను దెబ్బ తీసే చర్య అని అన్నారు.జనగణనలో కుల గణన లేకపోవడం వల్ల ఓబీసీ వర్గాల అసలు జనాభా గణాంకాలు వెలుగులోకి రావడం లేదని,దాంతో వారికి బడ్జెట్‌లో తగిన నిధులు,రాజకీయ ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మీనారాయణ,ఎస్‌సి సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు,మాజీ వైస్ ఎంపీపీ పరమేష్,కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాస్,పోకల అశోక్,యువజన కాంగ్రెస్ నాయకులు వేముల గోపీనాథ్,ఎస్‌సి,ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు కొంపెల్లి బిక్షపతి,విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ఏర్పుల శ్రవణ్ కుమార్‌పాల్గొన్నారు.



# ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి మహిళలకు ప్రత్యేక కోటా ఉండాలి

**ఇలాంటి నిబంధన లేకుంటే అసలు లక్ష్యం నిర్వీర్యమవుతుంది**
**బిఎస్‌పి అధినేత్రి మాయావతి**



**లక్నో :** లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు ప్రతిపాదిత 33 శాతం రిజర్వేషన్‌లో భాగంగా ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాల మహిళలకు ప్రత్యేక కోటా ఉండాలని బిఎస్‌పి అధినేత్రి మాయావతి పేర్కొన్నారు. అటువంటి నిబంధన లేకపోవడం ఈ చర్య అసలు లక్ష్యాన్ని చాలా వరకు నిర్వీర్యం చేస్తుందని ఆమె అన్నారు. లక్నోలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ల అంశంపై కేంద్రం మూడు రోజుల పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసిందని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి పేర్కొన్నారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే చర్యను తమ పార్టీ స్వాగతిస్తున్నప్పటికీ, ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాల మహిళలకు ప్రత్యేక కోటా లేకపోతే వారు పూర్తి ప్రయోజనం పొందుతారా అనే దానిపై తీవ్ర సందేహాలు ఉన్నాయని ఆమె అన్నారు. అటువంటి నిబంధన లేకపోవడం మహిళా రిజర్వేషన్ల అసలు లక్ష్యాన్ని చాలా వరకు నిర్వీర్యం చేసినట్లే అవుతుందని ఆమె అన్నారు. దేశంలో మహిళా సాధికారత గురించి ఎంతగానో మాట్లాడుతున్నప్పటికీ, సరైన ఉద్దేశం, విధానం, బలమైన రాజకీయ సంకల్పం లేకపోవడం దాని నిజాయితీ అమలుకు ఆటంకం కలిగిస్తోందని మాయావతి అన్నారు. ఫలితంగా, బలహీన వర్గాల మాదిరిగానే మహిళలు కూడా అఘాయిత్యాలు, అన్యాయం, దోపిడీలను ఎదుర్కొంటూనే ఉన్నారని, ఇవి ఆగే సూచనలు కనిపించడం లేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తమ పార్టీ అన్ని వర్గాల మహిళలకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిరంతరం డిమాండ్ చేస్తోందని, అయితే ఏ రాజకీయ పార్టీ కూడా తమ స్వప్రయోజనాలు, అనివార్యతల కారణంగా దానిని అంగీకరించడానికి సుముఖంగా లేదని ఆమె తెలిపారు. మహిళా రిజర్వేషన్‌ను రాజకీయ ప్రయోజనాల కోణంలో కాకుండా, భద్రత, గౌరవం, ఉన్నతి కోణంలో చూడాలని బిఎస్‌పి అధినేత్రి అన్నారు. లేకపోతే భూస్వామ్య, కులతత్వ శక్తులు ఆధిపత్యం కొనసాగించి, మహిళలకు అందాల్సిన ప్రయోజనాలను దూరం చేస్తాయని ఆమె హెచ్చరించారు. బి.ఆర్. అంబేద్కర్ చేసిన సేవలను ప్రస్తావిస్తూ, రాజ్యాంగ నిబంధనలు, హిందూ కోడ్ బిల్లు ద్వారా మహిళలకు సమానత్వం, గౌరవం కల్పించడానికి ఆయన ప్రయత్నించారని, అయితే ఆ బిల్లును అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగార్చి, భాగాలుగా ఆమోదించిందని ఆమె ఆరోపించారు. వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించడం, మహిళల హక్కులను పరిరక్షించడం వంటి అంశాలపై పటిష్టమైన చర్యలు తీసుకోకపోవడంతో దేశపు తొలి న్యాయ శాఖ మంత్రిగా అంబేద్కర్ రాజీనామా చేశారని కూడా ఆమె పేర్కొన్నారు.

# బెంగాల్‌లో తొలి దశ ఎన్నికలకు 2,407 కేంద్ర బలగాలు



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో మొదటి దశ అసెంబ్లీ ఎన్నికలు ఈనెల 23వ తేదీన జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం 2,407 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మోహరించనుంది. వీరిలో అత్యధిక సంఖ్యలో సిబ్బందిని ముర్షిదాబాద్ జిల్లాకు కేటాయించే అవకాశం ఉందని ఒక సీనియర్ అధికారి బుధవారం తెలిపారు. ముర్షిదాబాద్‌లోనే అత్యధికంగా 316 కంపెనీల బలగాలను మోహరించే అవకాశం ఉందని, వీరిలో 240 కంపెనీలు ముర్షిదాబాద్ పోలీస్ జిల్లాలో, 76 కంపెనీలు జంగిపూర్‌లో ఉంటాయని ఆ అధికారి తెలిపారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలు, ఎన్ఆర్‌సి ఆందోళనల సమయంలో జరిగిన అశాంతితో ముడిపడిన ఘర్షణలతో సహా, ఇటీవలి సంవత్సరాలలో ముర్షిదాబాద్ అనేక హింసాత్మక సంఘటనలకు సాక్ష్యంగా నిలిచింది. మొదటి దశలో మొత్తం 2,407 కేంద్ర బలగాల కంపెనీలను మోహరిస్తున్నారు. ఓటర్లు ఎలాంటి భయం లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూసేందుకు, సమగ్ర బలహీనతల అంచనా అనంతరం ఈ కేటాయింపు జరిగింది అని ఇసి అధికారి తెలిపారు. రెండవదశంలో అత్యధికంగా 273 కంపెనీలతో పూర్బ మేదినీపూర్ జిల్లాలో మోహరింపు జరగనుందని, ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి బరిలో ఉన్న రాజకీయంగా కీలకమైన నందిగ్రామ్ స్థానం కారణంగా ఈ జిల్లాపై నిశితంగా దృష్టి సారించామని ఆయన అన్నారు. కమిషన్ ఉత్తర దినాజ్‌పూర్‌ను రెండు పోలీస్ జిల్లాలుగా విభజించిందని, ఇస్లాంపూర్‌కు 61 కంపెనీలు, రాయ్‌గంజ్‌కు 71 కంపెనీలను కేటాయించిందని ఆయన తెలిపారు. ఇతర కీలక మోహరింపులలో, అసన్‌సోల్–దుర్గాపూర్ పోలీస్ కమిషనరేట్‌లో 125 కంపెనీలు, సిలిగురి పోలీస్ కమిషనరేట్‌లో 44 కంపెనీలను మోహరించే అవకాశం ఉంది. ఉత్తర బెంగాల్‌లో డార్జిలింగ్‌లో 61, కాలింపాంగ్‌లో 21, జల్పైగురిలో 92, అలీపుర్‌దువార్‌లో 77 కంపెనీలు ఉండే అవకాశం ఉందని అధికారి తెలిపారు. మొదటి దశలో ముర్షిదాబాద్‌తో పాటు డార్జిలింగ్, కాలింపాంగ్, జల్పైగురి, అలీపుర్దువార్, కూచ్ బెహార్, ఉత్తర దినాజ్‌పూర్, దక్షిణ దినాజ్‌పూర్, మాల్దా వంటి ఉత్తర బెంగాల్‌లోని ఎనిమిది జిల్లాల్లో, అలాగే ఝార్‌గ్రామ్, పురూలియా, బంకురా వంటి పశ్చిమ జిల్లాల్లో పోలింగ్ జరగనుంది. ఈ దశలో పూర్బ, పశ్చిమ మేదినీపూర్, పశ్చిమ బర్ధమాన్, బీర్భూమ్‌లలో కూడా ఎన్నికలు జరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం ఊపందుకుంటున్న తరుణంలో, ఓటర్లలో విశ్వాసం నింపేందుకు అనేక ప్రాంతాల్లో కేంద్ర బలగాలను ఇప్పటికే మోహరించారు, రూట్ మార్చ్‌లు కూడా కొనసాగుతున్నాయి. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, శాంతియుత ఎన్నికలు జరిగేలా చూసేందుకు మేము కట్టుబడి ఉన్నామని, అన్ని నియోజకవర్గాల్లో తగిన భద్రతా ఏర్పాట్లు చేశామని ఆ అధికారి తెలిపారు.

# నా కారును సోదా చేసేందుకు కేంద్ర బలగాలు ప్రయత్నించాయ్

**బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మండిపాటు**



**ఇస్లాంపూర్ :** తాను కోల్‌కతా విమానాశ్రయానికి వెళ్తుండగా కేంద్ర బలగాలు తన కారును సోదా చేయడానికి ప్రయత్నించాయని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. తమ నాయకుల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించిందని టిఎంసి ఆరోపించిన విషయం తెలిసిందే. కాగా, బుధవారం ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలో జరిగిన ఒక ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ, ఎన్నికలు జరగనున్న రాష్ట్రానికి కేంద్ర మంత్రులు డబ్బు తీసుకువస్తున్నారని, తమ పదవులను దుర్వినియోగం చేస్తున్నారని బెనర్జీ ఆరోపించారు. బుధవారం తాను కోల్‌కతా విమానాశ్రయానికి వెళ్తుండగా కేంద్ర బలగాలు తన కారును తనిఖీ చేయడానికి ప్రయత్నించాయని, మీకు దమ్ముంటే, ప్రతిరోజూ నా కారును తనిఖీ చేయండని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నుండి వచ్చిన లక్షిత ఆదేశాల ఆధారంగా, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం నియమించబడిన భద్రతా సిబ్బంది కేవలం తమ నాయకులను, ముఖ్యంగా అభిషేక్ బెనర్జీని మాత్రమే లక్ష్యంగా చేసుకుని వారి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారని టిఎంసి మంగళవారం ఆరోపించింది. ఇతరులను వదిలేస్తూ, కేవలం టిఎంసి నాయకులను మాత్రమే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారని ప్రశ్నించారు. కేంద్ర యంత్రాంగాన్ని పెద్ద ఎత్తున దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ, రాష్ట్ర ఎన్నికల్లో గెలవడానికే బిజెపి మొత్తం ప్రభుత్వాన్ని తీసుకొచ్చిందని బెనర్జీ అన్నారు. కేంద్ర శక్తులు బెంగాల్‌కు ఏమి తీసుకొస్తున్నాయో తనకు తెలుసని ఆమె తెలిపారు. 'కేంద్ర మంత్రులు డబ్బు తీసుకొస్తున్నారు. ఆర్థిక మంత్రి కార్డులు పంచుతున్నారు. ఇసి కఠిన చర్యలు తీసుకోవాలి'అని టిఎంసి అధినేత్రి ఆరోపించారు.

## మణిపూర్‌లో నిరసనకారులు, భద్రతా బలగాలకు మధ్య

# ఘర్షణలు ... నిషేధాజ్ఞలు



**ఇంఫాల్ :** మణిపూర్‌లో మరోసారి ఘర్షణలు చోటు చేసుకున్నాయి. బిష్ణుపూర్ జిల్లాలో నిరసనకారులు భద్రతా దళాలతో ఘర్షణకు దిగారు. దీంతో అధికారులు జిల్లాలో నిషేధాజ్ఞలు విధించారు. ట్రోంగ్లావోబిలో ఇటీవల జరిగిన బాంబు పేలుడులో ఇద్దరు చిన్నారులు మరణించడాన్ని నిరసిస్తూ స్థానికులు ఆందోళన చేపట్టడంతో మంగళవారం థింగుంగే ప్రాంతంలో హింస చెలరేగింది. ఆయుధాలు కలిగి ఉన్నారనే ఆరోపణలతో అనుమానాస్పద వ్యక్తుల కదలికల గురించి ధృవీకరించని నివేదికలు వ్యాపించడంతో ఉద్రిక్తత పెరిగిందని అధికారులు తెలిపారు. థింగుంగే, సమీపంలోని నింగ్‌తౌఖోంగ్‌లో ఘర్షణలు చెలరేగడంతో, మూక చెదరగొట్టడానికి భద్రతా దళాలు బాష్ప వాయువు షెల్స్‌ను ప్రయోగించాయి. ఈ ఘర్షణల్లో 10 మందికి పైగా స్వల్పంగా గాయపడగా, నిరసనకారులు వాహనానికి నిప్పు పెట్టారని అధికారులు తెలిపారు. భద్రతా సిబ్బంది గుర్తింపు, ఉద్దేశ్యంపై దురుద్దేశపూర్వక, ధృవీకరించని వదంతులు వ్యాపించడంతో మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో థింగుంగే సమీపంలో స్థానికులు ఒక భద్రతా బృందాన్ని అడ్డుకున్నారని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. 'ఒక గుంపు గుమిగూడి భద్రతా దళాల వాహనాలను అడ్డగించింది. గుంపులోని కొందరు హింసాత్మకంగా ప్రవర్తించి, భద్రతా సిబ్బందికి చెందిన వాహనాలను ధ్వంసం చేసి, నిప్పు పెట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సిబ్బందిని అదుపులోకి తీసుకునేందుకు కూడా ప్రయత్నాలు జరిగాయి' అని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు, ఆ ప్రాంతానికి అదనపు బలగాలను పంపి, కన్నీటి వాయువుతో సహా అవసరమైనంత తక్కువ బల ప్రయోగం చేసి గుంపును చెదరగొట్టినట్లు చెప్పారు. ఈ హింసాకాండకు సంబంధించి నలుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిప్పు పెట్టడం, చట్టవిరుద్ధంగా గుమిగూడటం, భద్రతా దళాలను అడ్డుకోవడం వంటి వాటిలో పాల్గొన్న ఇతరులను గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు చెప్పారు. శాంతిభద్రతలను కాపాడేందుకు ఆ ప్రాంతంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు వారు తెలిపారు. వదంతులు లేదా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హింస లేదా నిప్పు పెట్టడంలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, జిల్లా మేజిస్ట్రేట్ సాయంత్రం 5 గంటల నుండి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు బిఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధించి, ప్రజల రాకపోకలను నియంత్రించారు.

# 9 పనులు చేస్తామంటూ ప్రతిజ్ఞ తీసుకోవాలి

**ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి**



**మాండ్య :** ప్రజలందరూ 9 పనులు చేస్తామంటూ ప్రతిజ్ఞ తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. నీటి సంరక్షణ, ప్రకృతి వ్యవసాయం నుంచి ఫిట్‌నెస్, సేవ వరకు 9 ప్రతిజ్ఞలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందిన కర్ణాటక, భారత్‌ను సాకారం కోసం 9 పనులు చేయాలన్నారు. కర్ణాటక మాండ్య జిల్లాలో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోదీ, ఆదిచుంచనగిరి మఠంలో గురు భైరవైఖ్య మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ, ఈ మేరకు 9 ప్రతిజ్ఞలు పాటించాలని చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడిన మోదీ, మొదటి వాగ్దానంగా జల సంరక్షణను ప్రస్తావించారు. తర్వాత ప్రతి ఒక్కరూ 3 మొక్కలు నాటాలని సూచించిన ప్రధాని, అందులో ఒకటి తమ మాతృమూర్తి పేరిట నాటాలని కోరారు. బహిరంగ, మతపరమైన ప్రాంతాల్లో పరిశుభ్రత, స్థానిక ఉత్పత్తుల కొనుగోలు, స్థానిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం, చిరుధాన్యాలు తినడం, నూనె వాడకాన్ని తగ్గించడం ద్వారా ఆరోగ్యకరమైన భోజనం చేయడం వంటి ప్రతిజ్ఞలు చేయాలని సూచించారు. యోగా, శారీరక దారుఢ్యం, ప్రకృతికి సేవ చేయడం వంటి అంశాలను కూడా ప్రస్తావించారు.

# టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్

**పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా పల్లాకు మరోసారి ఛాన్స్**



**అమరావతి :** టిడిపిలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంత్రి నారా లోకేశ్ నియమితులయ్యారు. పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను తెలుగుదేశం పార్టీ బుధవారం ప్రకటించింది. విధేయత, కష్టపడే తత్వం, అనుభవాన్ని అధిష్ఠానం లెక్కలోకి తీసుకుంది. పని చేసే వారికే పార్టీలో పెద్దపీట అన్న సంకేతాన్ని పార్టీ ఇచ్చింది. కార్యకర్తే పార్టీకి అధినేత అన్న వినూత్న ఆలోచనలతో పార్టీని తిరుగులేని సైన్యంగా తీర్చిదిద్దుతున్న మంత్రి లోకేశ్‌కు టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలను అప్పగించింది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మరోసారి పల్లా శ్రీనివాస్‌ను నియమించింది. సీనియర్లకు గౌరవం... కొత్త వారికి అవకాశాలు... సామాజిక కోణంలో నూతన కమిటీల కూర్పు జరిగినట్లు తెలుస్తోంది. 29 మందితో పొలిట్ బ్యూరో నియామకాలు జరిగాయి. గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇంఛార్జ్ గుత్తికొండ ధనుంజయ్‌కు పొలిట్ బ్యూరోలో చోటు కల్పిస్తూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. 31 మందితో కూడిన జాతీయ కమిటీలో ముగ్గురు జాతీయ ప్రధాన కార్యదర్శులు కాగా 18 మందిని జాతీయ ఉపాధ్యక్షులుగా, 10 మందిని జాతీయ అధికార ప్రతినిధులుగా నియమించింది. రాష్ట్ర కమిటీలో 185 మంది ఉండగా వీరిలో ఏడుగురు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, 16 మంది రాష్ట్ర ఉపాధ్యక్షులు, 14 మంది రాష్ట్ర అధికార ప్రతినిధులు, 10 మంది రాష్ట్ర జోనల్ కోఆర్డినేటర్లు, 59 మంది రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు, 77 మంది రాష్ట్ర కార్యదర్శులు ఉన్నారు.

# పంజాబ్‌లో ఘోర బస్సు ప్రమాదం

**ఎనిమిది మంది యాత్రికులు మృతి, మరో 19 మందికి గాయాలు**



**ఫతేగఢ్ సాహిబ్ :** పంజాబ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఫతేగఢ్ సాహిబ్‌లో ఆనంద్‌పూర్ సాహిబ్ నుండి భక్తులతో వెళ్తున్న బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందగా, మరో 19 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. బైసాఖీ పండుగ సందర్భంగా రూప్‌నగర్ జిల్లాలోని ఆనంద్‌పూర్ సాహిబ్‌లో పూజలు ముగించుకుని తిరిగి వస్తుండగా, మంగళవారం రాత్రి సుమారు 10 గంటలకు బస్సీ పఠానా ప్రాంతంలోని మొరిండాచున్నీ రహదారిపై హిమ్మత్‌పురా సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఫతేగఢ్ సాహిబ్‌లోని మెయిన్ మజ్రీకి చెందిన భక్తులందరూ ఈ ప్రమాదానికి గురయ్యారు. ప్రాథమికంగా వాహనంలో సాంకేతిక లోపం తలెత్తినట్లు తెలుస్తోందని ఫతేగఢ్ సాహిబ్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శుభం అగర్వాల్ తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 40 మంది ప్రయాణిస్తున్నారు. ఈ ఘటనలో ఒక మహిళతో సహా ఆరుగురు మరణించగా, మరో 21 మంది గాయపడ్డారు. ఆ తర్వాత, చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పిజిఐఎంఇఆర్), మొహాలీ ఫేజ్ 6లోని ఒక ఆసుపత్రిలో మరో ఇద్దరు బాధితులు గాయాలతో మరణించారని ఫతేగఢ్ సాహిబ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాజ్ కుమార్ తెలిపారు. గాయపడిన వారిని ఫతేగఢ్ సాహిబ్, బస్సీ పఠానా, రూప్‌నగర్ జిల్లాలోని మొరిందా ఆసుపత్రులకు తరలించగా, తీవ్రంగా గాయపడిన కొందరిని చండీగఢ్‌లోని పిజిఐఎంఇఆర్‌కు రిఫర్ చేశారు. మిగిలిన ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే, పలువురు స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. మెయిన్ మజ్రీ గ్రామానికి చేరుకోబోతుండగా బస్సు అకస్మాత్తుగా బోల్తా పడిందని గాయపడిన ఒక మహిళ తెలిపింది.

మంగళవారం రాత్రి ఘటనా స్థలానికి చేరుకున్న బస్సీ పఠానా ఎమ్మెల్యే రూపిందర్ సింగ్, భక్తులందరూ మెయిన్ మజ్రీ గ్రామానికి చెందినవారేనని చెప్పారు. భక్తుల మృతి పట్ల పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ విచారం వ్యక్తం చేశారు, ఈ దుఃఖ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అండగా నిలుస్తుందని అన్నారు. పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా వారింగ్, శిరోమణి అకాలీ దళ్ నాయకుడు విక్రమ్ సింగ్ మజీతియా మృతి పట్ల సంతాపం తెలిపారు.


**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**
**FILE NO. ABR.NO. 1000 OF 2021**
BETWEEN :
**Shubhanandini Chit Funds Pvt Ltd., Hanamkonda-Branch** .... Disputant
And
**SRI.NAGANDLA LAXMANRAO & Others** .....Opponents
To,
1. Sri. Nagandla Laxman Rao, S/o, Narasimha Rao, Aged: 36 Years, Occ: Business, R/o: H.No. 15-5-128, B-Block, Chandamama Aprts, Khammam.
2. Sri. Kamma Madhu, S/o. Narsaiah, Age: 39 Yrs, Occ: Business. R/o: H.No.2-47, Chimmapudi, Raghunadhapalem, Khammam.
3. Sri. Ranway Rajesh, S/o, Dhulyaram, Age: 54 Yrs, Occ: X-Ray Dept D.R.A., Telangana Vaidyavidhana Parishad, Dist Hospital, Khammam. R/o: H.No. 8-2-98, BK Bazar, Back side of Municipality, Khammam.
4. Sri. Gudiwada Rajini Neela Kumari, W/o, Koteshwar Rao Age: 49 Years, Occ: Record Asst, Govt Hospital Khammam. R/o: H.No: 15-5-235, Near Amma Chicken Centre, Khanapuram Haveli, Dwarakanagar, Khammam.
5. Sri. Vempati Ramesh, S/o, Basha, Age: 48 Years, Occ: AR Constable, PCNo: 2580, AR Khammam. R/o: Plot.No: 311, Chandamama Aprts, Bypass Road, Back to New Vikas College, Khanapuram Haveli, Khammam.
6. Sri. Veta Rajkumar, S/o, Eliphaz, Age: 49 Years, Occ: Lab Tech-II, MPHC Konijerla, Khammam. R/o: Plot.No: 5-2-2248/J/12, Mustafa nagar, Khammam.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **08-05-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**
**FILE NO. ABR.NO. 68 OF 2021**
BETWEEN :
**Shubhanandini Chit Funds Pvt Ltd., Mahabubabad-Branch** .... Disputant
And
**SRI.BHEEMAGANI YADAGIRI & Others** .....Opponents
To,
1. Sri. Bheemagani. Yadagiri, S/o. Ramaiah, Aged: 51 Years, Occ: Private Employee, R/o: H.No: 3-45/1, Ayodhyapur, Guduru, Warangal -506134.
2. Smt. Bheemagani Lalitha, W/o. Yadagiri, Age: 44 Years, Occ: Private Employee. R/o: H.No: 3-45/1, Ayodhyapur, Guduru, Warangal -506134.
3. Sri. Yara. Raju, S/o. Venkataiah, Age: 39 Years, Occ: Junior Line Men, O/o: OP. TS. NPDCL, Gudur. Emp. Id.. 40005292, R/o: H.No:2-4-887, Chandru Gudem, Gudur, Warangal -506134.
4. Sri. Pujari. Suraiah, S/o. Pullaiah, Age: 52 Years, Occ: Line Men. O/o: AE OP, Gudur, Emp. Id. 40006214., R/o: H.No: 1-56, Ayodhyapur, Gudur. Warangal.-506134.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **08-05-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**
**FILE NO. ABR.NO. 69 OF 2021**
BETWEEN :
**Shubhanandini Chit Funds Pvt Ltd., Mahabubabad-Branch** .... Disputant
And
**SRI.KANTHALA VISHNUVARDHAN REDDY & Others** .....Opponents
To,
1. Sri. Kanthala. Vishnu Vardhan Reddy, S/o. Thirupathi Reddy, Aged: 48 Years, Occ: Divisional Accounts Officer Grade-II, O/o. TDWSP Division, Huzurabad, Karimnagar, Emp Id. 1604469. R/o: H.No: 2-12-391, Vidhya Nagar Colony, Vidyaranyapuri, Hanamkonda, Warangal.-506009.
2. Sri. Kadari. Madhu Kumar, S/o. Sanjeeva, Age: 51 Years, Occ: Techinical Assistant, O/o. I & CADD, IB Division, Mahabubabad, Emp. Id. 2114946, R/o: H.No: 11-23-2125, LB Nagar, Warangal.-506002.
3. Sri. Devunuri. Ashok, S/o. Laxmaiah, Age: 48 Years, Occ: Senior Assistant, O/o. Executive Engineer, Irrigation Division. Mahabubabad. Emp Id. 2114909, R/o: H.No: 2-4-309, Ram Nagar, Hanamkonda, Warangal.-506001.
4. Sri. Erra. Keshava Rao, S/o. Mallaiah, Age: 52 Years, Occ: Line Men, O/o. T.S.N.P.D.C.L, Mahabubabad, Emp Id. 40006020, R/o: H.No: 1-4-76, Shikarkhana Gadda, Mahabubabad, Warangal.-506101.
5. Sri. Jangili. Anil Kumar, S/o. Gopal Rao, Age: 48 Years, Occ: Divisional Accounts Officer, O/o. National Highways, (R&B) Division. Khammam, Emp. Id. 2114378, R/o: H.No: 31-3-746/2, Parimala Colony, Komatipally, Hasanparthi. Warangal.-506370.
6. Sri. Jangili. Venkata Sathyanarayana, S/o. Gopal Rao, Age: 50 Years, Occ: Private Employee, R/o: H.No: 22-8-107, Doctors Colony-2, Balaji Nagar, Warangal.-506007.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **08-05-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**
**FILE NO. ABR.NO. 70 OF 2021**
BETWEEN :
**Shubhanandini Chit Funds Pvt Ltd., Mahabubabad-Branch** .... Disputant
And
**SRI.MANDALA VENKATESHWARLU & Others** .....Opponents
To,
1. Sri. Mandala Venkateshwarlu, S/o. Mallaiah, Aged: 36 Years, Occ: Technical Manager, Tahasildar Office, Narsampet. R/o: H.No: 20-36/3, Gollagudem, Gudur, Mahabubabad.
2. Gaddam Umarani, D/o. Kumaraswamy, Age: 51 Years, Occ: Deputy Tahasildar, Tahasildar Office, Narsampet R/o: H.No: 4-2-265, Kothur, Hanamkonda.
3. Sri. Mandala Ramchandraiah, S/o. Mallaiah, Age: 38 Years, Occ: Businwss R/o: H.No: 20-135/A, Gollagudem, Gudur, Mahabubabad.
4. Sri. Mandala Venkateshwarlu, S/o. Chandraiah, Age: 45 Years, Occ: SGT, MPPS Pilligandla Thanda, Guduru, Mahabubabad. R/o: H.No: 20-37-D-2, Guduru, Mahabubabad.
5. Sri. Jamandla Venkanna, S/o. Anthaiah, Age: 42 Years, Occ: School Asst ZPPS Boys Guduru, Mahabubabad. R/o: H.No: 6-86, Chandra Nagar, Guduru, Mahabubabad.
6. Sri. Guniganti Raju, S/o. Narsaiah, Age: 40 Years, Occ: Mandal Revenue Inspector, Kanapur Mandak, Warangal. R/o: H.No: 4-64, Thogarrai, Duggondi, Warangal.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **08-05-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**
**FILE NO. ABR.NO. 71 OF 2021**
BETWEEN :
**Shubhanandini Chit Funds Pvt Ltd., Mahabubabad-Branch** .... Disputant
And
**SRI.KANDIKONDA VIJAY KUMAR & Others** .....Opponents
To,
1. Sri. Kandikonda. Vijay Kumar, S/o. Sambaiah, Aged: 42 Years, Occ: Bussiness (Contractor), R/o: H.No: 2-27, Yellaiahgudem, Chennaraopet. Warangal -506332.
2. Sri. Elakanti. Chendu, S/o. Vijay Kumar, Age: 31 Years, Occ: Lecturer, O/o: Administrative Officer, Govt, Polytechnic. Warangal. Emp. Id: 2156850, R/o: H.No: 2-235/12, Sneha Nagar. Narsampet. Warangal.-506132.
3. Smt. Surampally Shakunthala, D/o. Narayana, Age: 35 Years, Occ: Secondary Grade Teacher, O/o: Mandal, Educational Officer, M P Gudur. Mdl: Gudur. Warangal. Emp. Id.. 1550653, R/o: H.No: 2-27, Yellaihgudem, Chennaraopet. Warangal.-506332.
4. Sri. Duraboena. Venkateswarlu, S/o. Kommalu, Age: 49 Years, Occ: Assistant Line Men, O/o: Assistant Engineer, TSNPDCL Narsampet (Rural). Emp. Id. 40006231, R/o: H.No: 3-51. Yellaiahgudem, Chennaraopet. Warangal -506332.
5. Sri. Kandikonda. Rajeshwar, S/o. Veeraiah, Age: 49 Years, Occ: Private Employee. R/o: H.No: 9-6-25/C/1, Anjaiah Nagar, Hasmathpet. Old Bowen Pally, Kukatpally. Hyderabad.-500009.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **08-05-2026** for your appearance. On that day you have toappear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**
**FILE NO. ABR.NO. 73 OF 2021**
BETWEEN :
**Shubhanandini Chit Funds Pvt Ltd., Mahabubabad-Branch** .... Disputant
And
**SMT.BHIMAGANI LALITHA & Others** .....Opponents
To,
1. Smt. Bhimagani Lalitha, W/o. Yadagiri, Aged: 43 Years, Occ: Anganwadi Teacher, Gudur, Warangal, R/o: H.No: 2-83, Ayodyapuram, Gudur, Warangal.-506134.
2. Sri. Bhimagani. Yadagiri, S/o. Ramaiah, Age: 50 Years, Occ: Private Employe, LIC Agent, R/o: H.No: 2-83, Ayodyapuram, Gudur, Warangal.-506134.
3. Sri. Bhukya hari, S/o. Panthulayya, Age: 49Years, Occ: LFL HM, MPPS Gandhipuram, Mahabubabad. R/o: H.No: 6-57/6, Chandrugudem, Gudur, Mahabubabad.
4. Sri. Dharamsothu Valu, S/o. Poolu, Age: 41 Years, Occ: SGT, TWAHS, Guduru, Mahabubabad. R/o: H.No: C-7, Vasramthanda, Gajulagattu, Guduru, Mahabubabad.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **08-05-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**
**FILE NO. ABR.NO. 75 OF 2021**
BETWEEN :
**Shubhanandini Chit Funds Pvt Ltd., Mahabubabad-Branch** .... Disputant
And
**SRI.EASAM SWAMY & Others** .....Opponents
To,
1. Sri. Easam. Swamy, S/o. Erraiah, Aged: 54 Years, Occ: Hostel Welfare Officer, Grade-II, O/o. Dist. Tribal Development Officer, Mahabubabad, Emp. Id. 2115618, R/o: H.No:1-01/1, Bathulapalle, Kothagudem, Warangal.-506135.
2. Sri. Vasam. Krishna, S/o. Erraiah, Age: 36 Years, Occ: Teacher, O/o. Govt TWAHS(B), Gudur, Mahabubabad, Emp. Id. 2155847, R/o: H.No: 3-08, Mallampally Road, Vallabnagar, Narsampet, Warangal.-506132.
3. Sri. Erupa. Devendar, S/o. Mallaiah, Age: 31 Years, Occ: PET, O/o. Govt.TWAHSGovt. TWAHS(B), Gudur, Mahabubabad, Emp. Id. 2158390, R/o: H.No: 1-43, Jangavanigudem, Warangal.-506135.
4. Sri. Thursa. Mallaiah, S/o. Balaiah, Age: 53 Years, Occ: SGT O/o. Govt. TWAHS(B), Gudur, Mahabubabad, Emp. Id. 2138531, R/o: H.No: 2-28/3, Mahadevunigudem, Kothagudem, Warangal.-506135.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**08-05-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHUPALPALLY**
**O.S.No. 749 OF 2022**
Between:
1. Elupula Lasumamma
2. Elupula @ Boda Muktheswari

...Plaintiffs
AND
1. Elupula Shailaja
2. Elupula Umamaheshwari
3. The District Collector, Jayashankar Bhupalpally District.
4. The Mandal Tahasildar, Bhupalpally Mandal
5. The SCCL, General Manger, Area JayaShankar Bhupalpally
6. To whomsoever it may concern.

... Defendants
**NOTICE**
To
1.To whomsoever it may concern.
The Plaintiffs herein filed the above O.S No.749 of 2022 against the above Defendant no.1 to 6 for the declare the plaintiffs as the Legal Heirs of the deceased Late Elupula Komuraiah, and Late Elupula Kumaraswamy. Hence you are required to appear before the Hon,ble Court through legal counsel on: **23-06-2026 at 10:30 am.** Failing which the matter will be heard and decided in your absence.
**MANGALAPALLY RAJ KUMAR**
**ADVOCATE**
3-18/1,KHASIMPALLY,
Bhupalapally Jayashankar Dist.
**Cell : 9848708057**

# మారుతున్న యూరప్ గమనం

యూరప్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఆయనకు వందిమాగధుడిగా పేరొందిన హంగేరి ప్రధాన మంత్రి విక్టర్ ఓర్బన్ ఆదివారం జరిగిన ఎన్నికలలో ఘోర ఓటమి పాలయ్యారు. అలాగే ట్రంప్ ఏది చెప్పినా ఓకే అని తలాడించే ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మెలోనీ తమ దేశ ప్రజల ఒత్తిడికి తలొగ్గి స్వరం మారుస్తున్నారు. యూరప్‌లో కొంగొత్త శక్తులుగా ఎదుగుతున్న పచ్చి మిత వాద శక్తులకు ఎదురుగాలి వీస్తోన్న పరిణామాలకివి సంకేతం.

హంగేరీని 16 ఏళ్ళుగా ఏకఛత్రాధిపత్యంగా పాలిస్తున్న విక్టర్ ఓర్బన్ పచ్చి మితవాది. ఆయన యూరప్‌లో ట్రంప్ మనిషిగా ప్రతీతి. ఉక్రేన్, ఇరాన్ యుద్ధాలలో అమెరికా అధ్యక్షుడికి వంతపాడుతూ బలమైన సమర్థకుడిగా నిలిచారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా యూరోపియన్ యూనియన్ తీసుకునే ప్రతి చర్యను బాహాటంగానే వ్యతిరేకించేవాడు. అలాంటి విక్టర్ ఓర్బన్ ఆదివారం జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్ష పీటర్ మాగ్యేర్ నేతృత్వంలోని టీసా (హంగేరీలోని ఒక నది పేరుతో ఏర్పడిన)పార్టీ చేతిలో చిత్తుగా ఓడిపోయారు. విక్టర్ ప్రచారం కోసం పోలింగ్‌కు ముందు రోజు ట్రంప్ అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్‌ను హంగేరికి హుటాహుటిన పంపినా ప్రయోజనం లేకుండాపోయింది. 199 స్థానాలు ఉన్న పార్లమెంటులో టీసా పార్టీకి 138 చోట్ల విజయం లభించింది. విక్టర్ నేతృత్వంలో ఇన ఫైడెస్జ్ పార్టీకి 55 సీట్లే దక్కాయి. మరో అత్యంత పచ్చి మితవాద పార్టీ ఎంఐ హజాంక్ 5 స్థానాలతోనే సరిపెట్టుకోవడం శుభపరిణామం.

హంగేరీ ఫలితాలు ఒక విధంగా యూరప్‌లో ప్రబలుతున్న మితవాద, పచ్చి మితవాద శక్తులకు శరాఘాతం లాంటివి. ట్రంప్ అంతర్జాతీయ మిత వాద ధోరణితో స్ఫూర్తి పొందిన విక్టర్ ఓర్బన్ యూరప్‌లో పచ్చి మితవాద పార్టీలను కూడగట్టి గత ఏడాది సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికలన్నిటిలో మితవాద శక్తుల పరమయ్యే వ్యూహాలపై చర్చ జరిగింది. యూరప్ ఖండంలోని పలు దేశాలలో గత కొంత కాలంగా మితవాద పార్టీలు అధికారంలోకి రావడం, లేదా గట్టి పోటీ ఇవ్వడం జరిగింది. ఇటీవల వాటికి గట్టి పోటీ ఇస్తూ పచ్చి మితవాద పార్టీలూ బయలుదేరాయి. అందుకు బ్రిటన్‌లోని రిఫామ్ పార్టీ, ఫ్రాన్స్‌లో మెరైన్ లీపెన్ నేతృత్వం వహిస్తున్న నేషనల్ ర్యాలీ పార్టీ , జర్మనీలో చెందిన ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (ఎఎఫ్‌డి), స్పెయిన్‌కు చెందిన వాక్స్ పార్టీలు ఉన్నాయి. ఈ పార్టీలన్నీ విక్టర్ నిర్వహించిన మితవాద పార్టీల సమావేశానికి తమ ప్రతినిధులను పంపాయి. గడిచిన రెండు, మూడేళ్ళుగా యూరప్‌లో మితవాద, పచ్చి మితవాద పార్టీల పట్ల ప్రజలు చూపిస్తున్న మొగ్గుకు తాజా హంగేరీ ఎన్నికల ఫలితాల ద్వారా బ్రేక్ పడినట్లు పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. అంతకుముందు డెన్మార్క్ ఎన్నికల్లో సైతం మితవాద పార్టీని అక్కడి ప్రజలు తిరస్కరించారు. ఇది ట్రంప్ అనుంగులకు యూరప్ ప్రజల తిరస్కారంగా చెప్పవచ్చు.

ఇక అదే ఖండంలో మరో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. 2022 నుంచి ట్రంప్‌కు అత్యంత సన్నిహితురాలు, ఆయన విధానాలను విపరీతంగా అభిమానించే ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మోలోనీ క్రమంగా ఆయనకు దూరమవుతున్నారు. ఇటీవల ట్రంప్ వ్యాఖ్యలు, చర్యలకు విరుద్ధంగా ఇటలీ దేశ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జనవరిలో జరిగిన సర్వేలో 63 శాతం ఇటలీ ఓటర్లు అమెరికా పట్ల ప్రతికూల అభిప్రాయాన్ని వెల్లడించారు. ఫలితంగా ప్రజాభిప్రాయానికి ఆమె తలొగ్గక తప్పలేదు. అందుకు ఇటీవల కొన్ని కారణాలు కూడా కలిసొచ్చాయి. అత్యంత ముఖ్యమైన కారణం శరణార్థులు, యుద్ధం విషయంలో పోప్ లియో–16 చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడడం. బహుశా చరిత్రలో రోమన్ క్యాథలిక్కుల మతగురువు పోప్‌పై ఏ అమెరికా అధ్యక్షుడు సాహసించని రీతిలో ట్రంప్ వాచాలత్వాన్ని ప్రదర్శించారు. పైగా తనకు తానుగా ఏసుక్రీస్తులాగా కృత్రిమ మేధతో సృష్టించిన చిత్రాన్ని తన సోషల్ మీడియా వేదికగా ట్రంప్ షేర్ చేయడాన్ని ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు జీర్ణించుకోలేకపోయారు. ఇటలీ ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఎందుకంటే పోప్ నివసించే వాటికన్ సిటీ ఇటలీలో భాగంగా ఉండే స్వతంత్ర్య రాజ్యం. కాబట్టి, పోప్‌పై వ్యాఖ్యలు సమర్థనీయం కావంటూ ట్రంప్ వ్యాఖ్యలను ఖండించాల్సిన అనివార్యత మెలోనీకి ఏర్పడింది. అలాగే ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌ల అకారణ యుద్ధాన్ని కూడా అక్కడి ప్రజలు తప్పుబడుతున్నారు. అదే సమయంలో లెబనాన్‌లో పౌరులపై ఇజ్రాయెల్ బాంబు దాడులను తీవ్రంగా ఖండిస్తున్నారు కూడా. ఈ వ్యవహారంలో ఇజ్రాయెల్ వైఖరిని ఇటలీ తప్పుబట్టింది. ఈ మధ్య లెబనాన్‌లో ఇటలీకి చెందిన శాంతి పరిరక్షణ దళం కాన్వాయ్‌పై ఇజ్రాయెల్ కాల్పులకు బరితెగించటాన్ని ఇటలీ జీర్ణించుకోలేకపోయింది. ఫలితంగా ఇజ్రాయెల్‌తో ఇటలీ గతంలో కుదుర్చుకున్న రక్షణ ఒప్పందాన్ని నిలిపివేసింది. ఈ ఒప్పందం ఇరు దేశాలు సైనిక పరికరాలు, సాంకేతిక పరిశోధనల పరస్పర మార్పిడికి అనుమతిస్తుంది. ఇజ్రాయెల్‌కు అమెరికా, జర్మనీ తరువాత మూడవ అతిపెద్ద ఆయుధ ఎగుమతి దేశం ఇటలీ. తాజాగా ఆ దేశంతో ఒప్పందానికి తిలోదకాలిచ్చింది. 'ఇటలీ యుద్ధాన్ని తిరస్కరిస్తుంది – అని మన రాజ్యాంగం స్పష్టం చేస్తుంది' అని పార్లమెంటులో మెలోనీ ప్రకటించారు.

ఇప్పటికే ఇరాన్‌పై యుద్ధాన్ని యూరప్ దేశాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తొలినాళ్ళలోనే స్పెయిన్ ప్రధాన మంత్రి పెడ్రో శాంచెజ్ యుద్ధాన్ని అత్యంత కఠిన పదజాలంతో ఖండించారు. ఆ తరువాత ఇది మా యుద్ధం కాదని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెగేసి చెప్పేశారు. యుద్ధంతో ప్రపంచ శాంతికి ముప్పువాటిల్లుతుందని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మ్యాక్రాన్ బహిరంగంగానే అమెరికాను హెచ్చరించారు. మొదటి రెండు ప్రపంచ యుద్ధాలలో ఈ రెండు దేశాలు, అమెరికా ఒకే పక్షం(అలయెన్స్ పవర్స్)గా కలిసే యుద్ధాలు చేసిన చరిత్ర. అలాంటిది ఇప్పుడు అమెరికాకు అవి దూరం జరగడం విస్మరించరాని వాస్తవం.

ఆది నుంచి అమెరికాకు మిత్రులుగా ఉంటున్న యూరప్ అభివృద్ధి చెందిన దేశాలు ఒక్కొక్కటి దూరమవుతుండగా, ట్రంప్‌కు బలమైన మద్దతుదారులుగా ఉన్న దేశాధినేతలు ఎన్నికల్లో ఓడిపోవడం, లేదా ప్రజాభిప్రాయానికి తలొగ్గి అమెరికాకు దూరం జరగడం వంటి పరిణామాలు తాజాగా సంభవిస్తున్నాయి. మరోవైపు సొంత దేశం అమెరికాలో సైతం ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ యుద్ధోన్మాద చర్యలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలు వీధుల్లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఎవరికీ ఇష్టంలేని యుద్ధంలోకి అందరిని లాగేందుకు సకల ప్రయత్నాలు చేస్తున్న ట్రంప్ ఆత్మావలోకనం చేసుకొని వాస్తవప్రపంచంలోకి వస్తే మానవాళికి మంచిది. లేదంటే హిట్లర్, ముస్సోలిని వంటి భయంకర నియంతలకే గుణపాఠం చెప్పిన చరిత్ర ఈ పృథ్వి సొంతమని మరవరాదు!



## నియోజకవర్గాల పునర్విభజన 'కుటిల కుట్ర'

**మహిళా రిజర్వేషన్ల ముసుగులో నియోజకవర్గాల పునర్విభజనకు మోదీ ప్రభుత్వం కుటిల పన్నాగాన్ని అమలు చేస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా లక్ష్యంగా ప్రభుత్వం మహిళా రిజర్వేషన్‌ను సాకుగా వాడుకుంటోంది. నియోజకవర్గాల పునర్విభజన అనేది వారి కుటిల అజెండా. మహిళలు, వారి ఒక సాకు'. అధికారంలో ఉన్న ప్రభుత్వం 'మహిళల గురించి ఎప్పడూ అస్సలు పట్టించుకోలేదు'. రాజ్యాంగాన్ని, పార్లమెంటును, ఈ గొప్ప దేశంలోని మహిళలను అపహాస్యం చేస్తున్నారు'. తాము మహిళా రిజర్వేషన్‌కు నిరంతరం మద్దతు ఇస్తున్నప్పటికీ, ప్రస్తుత విధానానికి నియోజకవర్గాల పునర్విభజనతో ఉన్న సంబంధంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఇది రాజకీయ ప్రాతినిధ్య సమతుల్యతను దెబ్బతీస్తుంది, రాజకీయ ప్రాతినిధ్య సమతుల్యతను దెబ్బతీస్తుంది**

– కాంగ్రెస్ నాయకుడు డెరెక్ ఓబ్రియన్



## తెలుగు జానపదం.. బిరుదురాజు రామరాజు

బిరుదు రాజు రామరాజు హై స్కూల్ విద్యార్థిగా ఉన్న నాటి నుండి, 'భారతి' మొదలైన పత్రికలలో మానవల్లి, వేటూరి, నిడదవోలు, మల్లంపల్లి, వంటి పరిశోధకుల వ్యాసాలు, వారు సంపాదించిన గ్రంథములు, పీఠికలు చదివాడు. వారిలాగే సాహిత్య లోకానికి తెలియని క్రొత్త విషయాలు తాను కూడా చెప్పాలని నిశ్చయంతో పరిశోధన రంగంలో అడుగు పెట్టాడు. జానపద విజ్ఞానంలో విశ్వవిద్యాలయాల పరిశోధనల్లో దక్షిణ దేశభాషలన్నింటిలోనూ, బిరుదు రాజు రామరాజు యొక్క 'తెలుగు జానపద గేయ సాహిత్యం' మొదటి సిద్ధాంత గ్రంథం అయింది. జానపద గేయ రంగంలో అనేక జానపద గేయాలు, సంకలనాలు బిరుదురాజు రామరాజు ప్రకటించాడు. తెలుగులో, ఇంగ్లీషులో, జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పరిశోధనాత్మక పత్రాలు, రామరాజు చదివాడు. ఇంగ్లీషులో 'ఫోక్ ఫోక్ ఆఫ్ ఏ పి.'ఫోక్ లోరు ఆఫ్ ఏ పి. సౌత్ ఇండియన్ ఫోక్ సాంగ్స్, గ్లింప్సెస్ ఇన్ టూ, తెలుగు ఫ్లోక్ లోర్,అనే గ్రంథాలు బిరుదు రాజు ప్రకటించాడు. బిరుదు రాజు తెలంగాణ అంతా తిరిగి వందల కొద్ది తెలుగు, సంస్కృతంలో ఉన్న తాళపత్ర గ్రంథాలు, పదులకొద్దీ, శిలా శాసనాలను, సేకరించాడు. అచ్చు కాకుండా పడి ఉన్న తెలుగు, సంస్కృత కావ్యాలను దాదాపుగా నూరింటిని సాహిత్య ప్రపంచానికి తెలియజేశాడు.

**పరిష్కరించిన, గ్రంథాలు:** సంస్కృతంలో కాళహస్తి కవి రచించిన 'వసు చరిత్రం' మధురవాణి రచించిన రామాయణ సార తిలకం, వెల్లలా ఉమామహేశ్వర్లు 'శృంగార శేఖర బాణం' శ్రీకృష్ణదేవరాయల జాంబవతి పరిణయ నాటకం, మొదటిసారిగా పరిష్కరించిన బిరుదు రాజు అనంత రామయ్య, సీతా విజయ చంపు వంటి సంస్కృత కృతులను బిరుదు రాజు రామరాజు పరిష్కరించాడు.

**తెలుగు గ్రంథాల పరిష్కరణ :–** తెలుగులో బొద్దు చర్ల చీన తిమ్మ కవి 'ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధం' చింతపల్లి ఛాయాపతి రాఘవాభ్యుదయం, వెంకటాద్రి నాయకుని సకల జీవసంజీవనం, పాల్కురికి సోమనాథుని, పండిత రాద్యోదాదహర ణం, అనే కావ్యాలను మొదటగా సేకరించి ప్రకటించారు. బిరుదు రాజు రామరాజు, 'ఉర్దూ తెలుగు నిఘంటువు'ను కూర్చారు. ఇంగ్లీష్ హిందీల నుండి నాలుగు గ్రంథాలు అనువదించాడు. బిరుదు రాజు పర్యవేక్షణలో 38 మంది ఎంఫిల్, పిహెచ్‌డిలు సంపాదించారు. తెలుగు జానపద విజ్ఞాన రంగంలో విశేషమైన కృషి చేసిన వ్యక్తి ఆచార్య బిరుదు రాజు రామరాజు, పరిశోధకుడిగా, పండితుడిగా, ఆచార్యుడిగా, జాతీయ వక్తగా ప్రసిద్ధి పొందిన ఈయన వరంగల్ జిల్లా దేవనూరు గ్రామంలో 1925 ఏప్రిల్ 16న జన్మించాడు. దేవునూరు, మడికొండ, హనుమకొండలో ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్యతోపాటు ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. తరువాత హైదరాబాద్ నిజాం కళాశాలలో ఇంగ్లీష్ మీడియంలో బిఏ పూర్తి చేశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ తెలుగు, ఖండవల్లి లక్ష్మీ రంజనం పర్యవేక్షణలో పిహెచ్‌డి పూర్తి చేశాడు. 1973 నుంచి 1983 వరకు తెలుగు శాఖ అధ్యక్షులుగా కొనసాగాడు.1967 నుంచి 1974 వరకు వరంగల్ స్నాత కోత్తర కేంద్రంలో పనిచేసిన బిరుదురాజు రామరాజు 1983లో పదవీ విరమణ పొందాడు.

**(ఏప్రిల్ 16 బిరుదు రాజు రామరాజు 101వ జయంతి సందర్భంగా)**

దేవులపల్లి రమేశ్, 9963701294

# అక్షరం అమ్మకానికి ఉందా?

# జాతీయ విద్యా విధానంలోని మర్మాలివే!



డా.సూర్యదేవర రామకృష్ణ
9490754169

విద్య అనేది కేవలం అక్షరజ్ఞానం కాదు.అది ఒక మనిషిని సామాజిక స్పృహ కలిగిన పౌరుడిగా తీర్చిదిద్దే అద్భుత ప్రక్రియ. భారత రాజ్యాంగం ప్రకారం విద్య ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. అయితే, 2020లో ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం (NEP) ఈ ప్రాథమిక హక్కును ఒక వ్యాపార సరుకుగా మారుస్తోందా అన్న అనుమానాలు నేడు విద్యావేత్తల్లో, సామాజిక విశ్లేషకుల్లో బలంగా వినిపిస్తున్నాయి. మూడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత వచ్చిన ఈ మార్పులు, బయటకు మెరిసే రంగు లతో కనిపిస్తున్నా, లోపల సామాన్య ప్రజల విద్యావకాశాలను దెబ్బతీసే అంశాలు అనేకం ఉన్నాయని వామపక్ష మేధావులు హెచ్చరిస్తున్నారు. ప్రై **వేటీకరణ: ముసుగులో ఉన్న ముప్పు:**

NEPలో అత్యంత వివాదాస్పదమైన అంశం విద్యా రంగంలో ప్రైవేటు పెట్టుబడులను విచ్చలవిడిగా ప్రోత్సహించడం. దాతృత్వ విద్యా సంస్థలు (Philanthropic institutions) అనే అందమైన పేరుతో కార్పొ రేట్ శక్తులకు ఎర్ర తివాచీ పరచడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకోవాలని చూస్తోంది. విద్య అనేది ఒక లాభాపేక్ష లేని సేవగా ఉండాలి, కానీ ప్రస్తుత విధానం దానిని లాభసాటి వ్యాపారంగా మార్చేం దుకు మార్గం సుగమం చేస్తోంది.ప్రైవేటు విద్యా సంస్థలకు స్వయం నియంత్రణ (Selfregulation) అధికారం ఇవ్వడం అంటే, వాటి ఫీజుల దోపిడీకి పరోక్షంగా అనుమతి ఇవ్వడమే. ఇప్పటికే ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల భారంతో సతమతమవుతున్న మధ్యతరగతి, పేద కుటుంబా లకు ఈ విధానం మరింత భారంగా మారుతుంది. చరిత్రను పరిశీలిస్తే, అమెరికా లేదా బ్రిటన్ వంటి దేశాల్లో విద్యా వ్యవస్థను ప్రైవేటు పరం చేయడం వల్ల పేద, ధనిక వర్గాల మధ్య అగాధం ఎంతలా పెరిగిందో మనకు అర్థమవుతుంది. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో, విద్యను మార్కెట్ శక్తులకు వదిలేయడం వల్ల సామాజిక న్యాయం సమాధి అవుతుంది.

**స్వయం ప్రతిపత్తికి గండి:**

ఉన్నత విద్యా రంగంలో హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (HECI) ఏర్పాటు ప్రతిపాదన అత్యంత ప్రమాదకరమైనది. ఇప్పటి వరకు ఉన్న UGC (University Grants Commission) వంటి సంస్థలను రద్దు చేసి, అన్ని అధికారాలను ఒకే కేంద్ర సంస్థకు కట్టబెట్టడం వల్ల విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుంది. విద్య అనేది కేవలం సిలబస్ పూర్తి చేయడం కాదు; అది విమర్శనాత్మక ఆలోచ నకు (Critical Thinking) వేదిక కావాలి. అధికార కేంద్రీకరణ జరిగిన ప్పుడు, ప్రభుత్వ భావజాలానికి అనుగుణంగా విద్యా సంస్థలు నడుచుకోవాల్సి వస్తుంది, ఇది స్వేచ్ఛా విచారణను అంతం చేస్తుంది.అలాగే, విదే శీ విశ్వవిద్యాలయాలకు ద్వారాలు తెరవడం వల్ల దేశీయ విద్యా వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉంది. ఈ ఖరీదైన విదేశీ క్యాంపస్‌లు కేవలం సంపన్న వర్గాల పిల్లలకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఇది విద్యలో ఒక రకమైన ఎలైటిజం (Elitism)ను సృష్టిస్తుంది, ఫలితంగా సాధారణ ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు ఆ త్మన్యూనతకు లోనయ్యే అవకాశం ఉంది. మాతృభాష పేరుతో వివక్ష?: ప్రాథమిక విద్య మాతృభాషలో ఉండాలనే ప్రతిపాదన సిద్ధాంత పరంగా చాలా బాగుంది. కానీ, ఆచరణలో ఇది ఒక సామాజిక వివక్షకు దారితీ యవచ్చు. నేటి ప్రపంచంలో ఆంగ్లం అనేది కేవలం ఒక భాష కాదు, ఉపాధికి మరియు ప్రపంచ జ్ఞానానికి ఒక తాళంచెవి. సంపన్న కుటుంబాల పిల్లలు ప్రైవేటు స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియంలో చదువుకుంటూ, పేద విద్యార్థులు కేవలం మాతృభాషకే పరిమితమైతే, భవిష్యత్తులో వారు పోటీని ఎలా ఎదుర్కోగలరు? మాతృభాషను గౌరవిస్తూనే, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడటానికి అవసరమైన ఆంగ్ల భాషా నైపుణ్యాన్ని అందరికీ సమానంగా అందించడంలో ప్రభుత్వం విఫలమైతే, అది పేద విద్యార్థుల ఎదుగుదలకు అడ్డుకట్ట వేసినట్లవుతుంది.

**వృత్తి విద్య: నైపుణ్యమా లేక చదువు మధ్యలో ఆపడమా?:**

NEP ప్రవేశపెట్టిన మల్టిపుల్ ఎంట్రీ అండ్ ఎగ్జిట్(Multiple Entry and Exit) విధానం వినడానికి సౌకర్యవంతంగా అనిపించినా, దాని వెనుక ఉన్న సామాజిక కోణాన్ని గమనించాలి. ఒక విద్యార్థి ఆర్థిక ఇబ్బందుల వల్ల మొదటి ఏడాది తర్వాత సర్టిఫికేట్‌తో చదువు ఆపేస్తే, అతను కేవలం ఒక తక్కువ స్థాయి పనివాడిగానే మిగిలి పోతాడు. ఇది డ్రాపౌట్స్ (చదువు మధ్యలో ఆపేయడం)ను చట్టబద్ధం చేసి నట్లు అవుతుంది.వృత్తి విద్యపై అతిగా దృష్టి పెట్టడం ద్వారా విద్యార్థులను కేవలం నైపుణ్యం కలిగిన కార్మికులుగా (Skilled Labor) మార్చడానికి ప్రయత్నం జరుగుతోంది. విద్య అనేది మనిషిని ఒక సంపూర్ణ మానవుడిగా, సామాజిక అవగాహన ఉన్న పౌరుడిగా తీర్చిదిద్దాలి. కానీ ఈ నూతన విధానం విద్యార్థులను కార్పొరేట్ కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా యంత్రాలుగా మార్చే ప్రమాదం ఉంది. విజ్ఞాన శాస్త్రం, సామాజిక శాస్త్రం, సాహిత్యం వంటి అంశాల కంటే కేవలం నైపుణ్యాల కే ప్రాధాన్యత ఇవ్వడం విద్య యొక్క అసలు లక్ష్యాన్ని దెబ్బతీస్తుంది.

**పరీక్షల భారం, గ్రామీణ విద్యార్థుల ఆవేదన:**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) ద్వారా దేశవ్యాప్తంగా ఒకే రకమైన ప్రవేశ పరీక్షలు నిర్వహించడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. నగరాల్లో ఉండే విద్యార్థులకు ఖరీదైన కోచింగ్ సెంటర్లు, ఇంటర్నెట్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. కానీ కుగ్రా మాల్లో ఉండి, కనీస మౌలిక సదుపాయాలు లేని పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఈ కేంద్రీకృత పరీక్షలను ఎలా ఎదుర్కోగలరు? ఇది విద్యను కేవలం పరీక్షల యంత్రం గా మార్చడమే కాకుండా, పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తుంది.

**సామాజిక న్యాయం, రిజర్వేషన్లు:**

జాతీయ విద్యా విధానంలో రిజర్వేషన్ల గురించి స్పష్టమైన ప్రస్తావన లేకపోవడం ఆందోళన కలిగించే మరో ముఖ్యమైన అంశం. భారతదేశం వంటి భిన్నత్వంతో కూడిన సమాజంలో, చారిత్రాత్మక కారణాల వల్ల వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు విద్యలో ప్రాతినిధ్యం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ప్రైవేటీకరణ పెరిగిన కొద్దీ, ఈ వర్గాలకు విద్య అందకుండా పోతుంది. ఆర్థికంగా బలహీన వర్గాలకు (EWS) కోటా ఇవ్వడం తప్పు కాదు, కానీ అది సామాజికంగా వెనుకబడిన వర్గాల హక్కులను కాలరాసే విధంగా ఉండకూడదు. NEPలో ఈ వర్గాల పట్ల ఉన్న అస్పష్టత వారి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది.

**ప్రభుత్వ వ్యయం : ఆచరణ సాధ్యమేనా?:**

విద్యపై జీడీపీలో 6% ఖర్చు చేయాలని 1968 నాటి కొఠారీ కమిషన్ నుండి ఇప్పటి వరకు ప్రతి విద్యా విధానం చెబుతూనే ఉంది. NEP 2020 కూడా అదే మాట చెప్పింది, కానీ ప్రస్తుతం మనం ఖర్చు చేస్తున్న ది కేవలం 3 – 4% మాత్రమే. నిధుల కేటాయింపు పెంచకుండా, కేవలం విధానాలు మార్చడం వల్ల ఫలితం ఉండదు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేవు, ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఉన్నత ప్రమా ణాల గురించి మాట్లాడటం ఆకాశం వైపు చూస్తూ అడుగులు వేయడమే అవుతుంది.

నిజమైన విద్యా సంస్కరణలు అంటే కేవలం కోర్సుల పేర్లు మార్చడం లేదా విదేశీ సంస్థలను పిలవడం కాదు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, ప్రతి గ్రామంలోనూ నాణ్యమైన పాఠశాలలను ఏర్పాటు చేయడం, ఉపాధ్యాయులకు గౌరవప్రదమైన వేతనాలు మరియు భద్రత కల్పించడం ద్వారానే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. విద్యను లాభా పేక్ష లేని రంగంగా ఉంచి, ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించినప్పుడే సామాజిక న్యాయం సిద్ధిస్తుంది. NEP 2020లో పాఠ్యప్రణాళికను సరళీకృతం చేయడం, సృజనాత్మకతకు

ప్రాధాన్యత ఇవ్వడం వంటి కొన్ని మంచి అంశాలు ఉన్నప్పటికీ, దాని అంతర్లీన ఉద్దేశం ప్రైవేటీకరణ వైపు మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. విద్య అనేది ఒక దేశపు పునాది. ఆ పునాది వ్యాపార ప్రయోజనాల మీద కాకుండా, సామాజిక బాధ్యత మీద నిర్మించబడాలి. ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకోకుండా, పేద ధనిక తేడా లేకుండా అందరికీ సమా నమైన, ఉచిత, నాణ్యమైన విద్యను అందించినప్పుడే మన దేశం నిజమై ప్ర గతి పథంలో పయనిస్తుంది. విద్యారంగంలో వస్తున్న ఈ మార్పులను గుడ్డిగా అంగీకరించకుండా, వాటిలోని లోపాలను ఎండగట్టడం ప్రతి పౌరుడి బాధ్యత. ఎందుకంటే, ఇవాల్టి విద్యే రేపటి దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

# ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు 'టెట్' టెన్షన్... టెన్షన్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం లోని ఉపాధ్యాయులు గా ఎంపిక కావడానికి టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) నిర్వహణ కోసం ఏప్రిల్ 15 నుండి ఏప్రిల్ 30 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇచ్చింది. డైట్, బి.ఎడ్ పూర్తిచేసిన ఛాత్రోపాధ్యాయులు డి.ఎస్సీ ద్వారా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలలలో ఉపాధ్యాయులుగా ఎంపిక కావడానికి టెట్ కంపల్సరీ చేసింది. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల ప్రస్తావన టెట్ నోటిఫికేషన్ లో ఎక్కడ లేదు. బిహార్ ఇంకా కొన్ని రాష్ట్రాల్లో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు అర్హత మార్కులను తగ్గించడం జరిగింది.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి కోరడం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రికి, ఎన్‌సిటిఈ కు కోరడంతో కేంద్ర ప్రభుత్వం మన దేశంలోని ఎంతమంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత కాకుండా ఉన్నారని లెక్కలు అడగడంతో తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు టెట్‌పై ఏదైనా ఉత్తర్వులు జారీ చేస్తారని ఆశతో ఎదురు చూస్తున్న తరుణంలో టెట్ నోటిఫికేషన్ రావడంతో ఇన్ సర్వీస్ టీచర్స్‌లో టెన్షన్... టెన్షన్...గా ఉంది.

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంయుక్త కార్యాచరణ సమితి (టీచర్స్ జెఏసి) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 05 న ఛలో ఢిల్లీ లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. 2011 కంటే ముందు ఉపాధ్యాయులుగా చేరిన వారు రెండు సంవత్సరాల లోపు టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలని లేకుంటే ఉద్యోగాన్ని వదులుకోవాల్సి వస్తుందని మన దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి మానసిక సంఘర్షణకు గురౌతున్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ రకమైన విధానం అనుసరిస్తుందో అని టీచర్స్ ఎదురు చూస్తున్నారు. 2009 లో విద్యా కమిషన్ వచ్చిన తర్వాత 2010 నుండి టెట్ అమలులోకి వచ్చింది. టెట్ అమలులోకి వచ్చిన తరువాత 2012, 2017, 2024 మూడు సార్లు టీచర్స్ రిక్రూట్ మెంట్ జరిగింది. టెట్ వారికి అమలులోకి వచ్చింది. అంతకు ముందు జరిగిన టీచర్స్ రిక్రూట్ మెంట్ లో టెట్ అమలులో లేదు. సుప్రీం కోర్ట్ జడ్జి మెంట్‌లో ఐదు సంవత్సరాల లోపు పదవీ విరమణ (రిటైర్డ్ మెంట్)కు దగ్గర ఉన్న వాళ్ళకు మినహాయింపు ఇచ్చారు. 1996 నుండి టీచర్స్ గా ఉన్న వాళ్ళకు 30 సంవత్సరాలు కావస్తున్న 50సంవత్సరాలు దాటిన వాళ్ళు అనేక మంది ఉన్నారు. వాళ్ళలో కంటి చూపు, మోకాళ్ళ నొప్పులు, ఇతర రోగాలతో బాధ పడుతున్న వాళ్ళు అనేక మంది ఉన్నారు. 50 సంవత్సరాలు దాటిన వారికి మినహాయింపు ఇవ్వడం కనీస ధర్మం.ప్రధానోపాధ్యాయ పదోన్నతి లో 50 సంవత్సరాలు దాటిన వారికి డిపార్ట్మెంట్ పరీక్ష నుండి మినహాయింపు ఉంది.

2024 సంవత్సరంలో ఎన్‌సిటిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివరణ కోరితే 2010 కంటే ముందు టీచర్స్‌కు టెట్ అవసరం లేదని వివరణ ఇచ్చారు. ప్రస్తుతం సుప్రీం కోర్ట్ ఇచ్చిన జడ్జిమెంట్ 30 నుండి 40 వేలమంది టీచర్స్ పై ప్రభావం పడుతుంది.

ఉర్దూ, కన్నడ ఇతర దేశ భాషలలో బోధించే బాషోపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్‌లో పేపర్ 3 నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో భాషోపాధ్యాయులకు సాంఘిక శాస్త్రం 60 మార్కులకు కేటాయించడం వలన అనేకమంది తెలుగులో ఉత్తీర్ణత సాధించడం లేదు. ముఖ్యంగా తెలుగు భాషలో నిర్వహించాలని అన్ని ఉపాధ్యాయ సంఘా లు కోరుకుంటున్నారు. బయాలజీ ఉపాధ్యాయులకు గణితం, భౌతికశాస్త్రంలో పరీక్షలు నిర్వహించడం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వారి మానసిక వేదనను అర్థం చేసుకొని పేపర్ 3 నిర్వహించి భాషోపాధ్యాయులకు న్యాయం చేయాలి. ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు 60 మార్కు, బి.సి లకు 75 మార్కులు, ఓ.సి లకు 90 మార్కులు రావాలనడం సమంజసంగా లేదు. ఏ పరీక్షలలోనైనా 35 మార్కులకే ఉత్తీర్ణత ఉంటుంది. అలాంటిది టెట్లో 90 మార్కులు రావాలన్న నియమం ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తుంది.

**కుల ప్రాతిపదికన మార్కులు**

ఒక పాఠశాల లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ నలుగురు ఉపాధ్యాయులు ఉంటే నలుగురిలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు 65 మార్కులు, బి.సి ఉపాధ్యాయుడికి 75 శాతం మార్కులు, జనరల్ (ఒ.సి) ఉపాధ్యాయుడికి 89 మార్కులు అందరి కంటే ఎక్కువ వచ్చినప్పటికీ ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉపాధ్యాయులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రకటించి జనరల్ ఉపాధ్యాయుడు ఉత్తీర్ణత కాలేదు అనడం విశేషం.సమాజం దృష్టిలో, విద్యార్థుల తల్లి దండ్రుల దృష్టిలో, వారి భార్య బంధువుల దృష్టిలో టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించని ఉపాధ్యాయుడిగా చిన్న చూపు.

టెట్ పరీక్ష అంటే ఉపాధ్యాయ అర్హత పరీక్ష 25,30 సంవత్సరాల నుండి పదవతరగతి విద్యార్థులకు బోధించి ఉత్తమ పౌరులను తయారు చేసి కొంతమంది విద్యార్థులే ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించేటట్లు సలహాలు, సహకారం అందించి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం చేత స్వచ్ఛంద సంస్థల చేత ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానింపబడి టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించనంత మాత్రాన ఉపాధ్యాయ వృత్తికి పనికి రాడనడం ఏ రకమైన ధర్మమో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఆర్టీఈ) ఆధ్వర్యంలో పుస్తక రచయితలుగా ఉన్నవారు టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించలేదు కాబట్టి ఉపాధ్యాయుడిగా అర్హత లేదు అనడం సమంజసమేనా? భాషోపాధ్యాయులు (తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడం, తమిళం ఇతర దేశీయ భాషలు)బయాలజి బోధించే ఉపాధ్యాయులకు వారు బోధించే సబ్జెక్టులో టెట్ పరీక్షను నిర్వహించకుండా వారికి సంబంధం లేని ఆంగ్లం, సాంఘిక శాస్త్రం, గణితం, భౌతిక శాస్త్రం, మానసిక శాస్త్రం (సైకాలజీ)లో పరీక్షలను నిర్వహించి ఉత్తీర్ణత సాధించాలని అనడం విచారించదగిన విషయంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టెట్ ఉత్తీర్ణత సాధించకుంటే పదోన్నతి రాదనడం, ఉద్యోగం వదులుకోవాలనడం ఇదేమి న్యాయమని అనేకమంది ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. ఏ ఇద్దరు ఉపాధ్యాయులు కలిసినా టెట్ గురించి చర్చ జరుగుతున్నది.

కేంద్ర ప్రభుత్వం లేదా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టీచర్స్‌గా 2010 కంటే ముందు ఉన్న వాళ్ళకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుకుంటున్నారు.

ఈ వ్యాస రచయిత తెలంగాణ హైకోర్టులో 2024లో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది ఉమా రాణి ద్వారా కేసు వేస్తే 2011 కంటే ముందు ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి టెట్ నుండి మినహాయింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు పదవ తరగతి వార్షిక పరీక్షలకు ఇన్విజిలేటర్, డిపార్ట్మెంట్, చీఫ్ సూపరింటెండెంట్ విధులు, పరీక్షలు కాగానే ఇన్విజిలేటర్ డ్యూటీలు, వేసవి సెలవుల్లో జనాభా లెక్కలు ఈ విధంగా సమయం దొరకడం లేదు. టెట్ పరీక్ష ఏ విధంగా సిద్ధం కావాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

శాసనమండలి ఎన్నికల్లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఓటు హక్కు కలిపించాలని,గత రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న డిప్యూటీ ఈవో, డైట్, బి.ఎడ్ ఎస్సీ ఆర్టీ ఈ, ఐసిఎస్‌ఈ లలో లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని ఉపాధ్యాయుల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల సాధనకు ఉపాధ్యాయ సంఘాలన్నీ కలిసికట్టుగా ఉద్యమాలు, పోరాటాలు చేయాలని నిర్ణయించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరగా నిర్ణయం తీసుకొని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలని లేదా టెట్ ఉత్తీర్ణత మార్కులను ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు తగ్గించాలని, ఎస్సీ, ఎస్టీ, బి.సి., ఒసి ఉపాధ్యాయులకు అర్హత మార్కులు ఒకే విధంగా ఉండేటట్లు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీఈ) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయులు కోరుతున్నారు.

డా ఎస్.విజయ భాస్కర్

# పర్యాటక కేంద్రంగా పులిగుండాల అభివృద్ధి

## డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క
### కాటేజీల నిర్మాణానికి 4 కోట్లు మంజూరు

**ప్రజాపక్షం/పెనుబల్లిః** పెనుబల్లి మండలం బ్రాహ్మళ్ల కుంట గ్రామంలోని పులిగుండాల ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సీఎం బుధవారం, రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పిసిసిఎఫ్ సువర్ణ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమా నాయక్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ లతో కలిసి పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్ట్ ను ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా బోటింగ్, వాటర్ ఫాల్స్, జంగిల్ సఫారీ లను ప్రారంభించారు. ఈ అందమైన ప్రదేశాన్ని పరిచయం చేసిన స్థానిక ఎమ్మెల్యే, డి.ఎఫ్.ఓ. లకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకో టూరిజం అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, తెలంగాణలోని ప్రకృతి సౌందర్యాలను ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కనకగిరి హిల్స్ అభివృద్ధిని తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పులిగుండాల ప్రాజెక్ట్ నీటి పరిసర ప్రాంతాల్లో రెండు వైపులా కాటేజీల నిర్మాణానికి 4 కోట్లు సిఎస్ఆర్ నిధుల నుండి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పనుల అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను వెంటనే సిద్ధం చేసి, పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి, ఎప్పుడు పూర్తవుతాయి అనే కాలపట్టికను సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. పర్యాటకులు ఈ ప్రాంతానికి సులభంగా చేరుకునే విధంగా డబుల్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజలకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక రంగాన్ని విస్తృతంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలలో ఒకటిగా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు.

### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

కనకగిరి హిల్స్ వంటి అందమైన ప్రాంతాలను సందర్శించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎకో టూరిజం క్రింద రాష్ట్రంలో టాప్ 3 గమ్యస్థానాలలో ఒకటిగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన పూర్తి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకో టూరిజం అభివృద్ధిపై పూర్తి దృష్టి సారించిందన్నారు. అలాగే ఈ ప్రాంతానికి వెళ్లే యాక్సెస్ రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి తక్షణమే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ప్రారంభించి మిగిలిపోయిన సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను ప్రస్తుత ప్రభుత్వం వేగంగా పూర్తి చేస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే సూచన మేరకు ఆ ప్రాజెక్ట్ నుండి ఈ ప్రాంతానికి నీటిని తీసుకువచ్చి నిరంతర నీటి సరఫరా కల్పించే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి, సాధ్యమైతే ఈ పనులను పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు.



### ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్

చెట్లు లేకుండా జీవనం సాధ్యం కాదని, మనిషి జీవితం చెట్లపై ఆధారపడి ఉందని తెలిపారు. మనకు అవసరమైన ఆక్సిజన్ చెట్ల నుంచే లభిస్తుందని, మనిషి అవసరాలకు ఉపయోగించే మంచం వంటి అనేక వస్తువులు కూడా చెట్ల నుంచే వస్తాయని తెలిపారు. అటవీ సంరక్షణకు ప్రభుత్వం, మంత్రులు ప్రతిష్టాత్మకంగా కృషి చేస్తున్నారని తెలిపారు. కనకగిరి హిల్స్‌కు ఎకో టూరిజం క్రింద నిధులు, నీలాద్రి హిల్స్‌కు దేవాలయ పర్యాటక అభివృద్ధి క్రింద నిధులను డిప్యూటీ సీఎం, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంజూరు చేయడం జరిగిందన్నారు. మన చుట్టూ ఉన్న అందమైన ప్రకృతిని కాపాడేందుకు అధికారులు ఎంతో శ్రమిస్తున్నారని తెలిపారు. పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్ట్ ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, మన సంస్కృతి, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం కలుగుతుందని అన్నారు. కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, అధికారులు, పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో సిపిఐ నేత మృతి

### బాగం, దండి తరమేష్ నివాళులు



**ప్రజాపక్షం/ తల్లాడ :** భారత కమ్యూనిస్టు పార్టీ తల్లాడ మండల కార్యదర్శి ఓర్సు రమేష్ (48) బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. సొంత పనుల నిమిత్తం నర్సింహారావుపేట గ్రామానికి వెళ్తుండగా వెనక నుంచి ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో రమేష్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రమేష్ కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శిగా బహుముఖ ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎలక్ట్రానిక్స్ యూనియన్ సభ్యునిగా కూడా రమేష్ పనిచేస్తున్నారు. రమేష్ మృతదేహాన్ని ఖమ్మం తరలించి శవ పరీక్ష నిమిత్తం తిరిగి తల్లాడకు తీసుకువచ్చారు. ఖమ్మంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులు నివాళులర్పించారు. మృతదేహం తల్లాడకు చేరుకోగానే వందలాది మంది గ్రామ శివార్లకు చేరుకుని నివాళులర్పించారు. తల్లాడ శివారు నుంచి అంతిమ యాత్రలో సిపిఐ, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రమేష్ అమర్ హై అంటూ నినదించారు. రమేష్ మృతితో తల్లాడలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, జాగర్ల మూడి రంజిత్, దండు ఆదినారాయణ, తల్లాడ ఇంచార్జి మద్దోజు శ్రావణ్, నిమ్మటూరి రామకృష్ణ, యోబు, యమాల గోపాలరావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, చింతల రమేష్, తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, వివిధ పార్టీల నాయకులు షేక్ ఇసు, చల్లా నాగులు, సరికొండ శ్రీనివాసరాజు, గుంటుపల్లి వెంకటయ్య, నర్సింహారావు, తమ్మిశెట్టి నర్సింహారావు, గోపాలరెడ్డి, అనుమోలు సర్వేశ్వరరావు, నర్సింహారావు ఉన్నారు.

# ప్రతి గ్రామానికి మెరుగైన సదుపాయాలే ప్రభుత్వ లక్ష్యం

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క
### రూ.7.50 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్




**ప్రజాపక్షం/పెనుబల్లి :** ప్రతి గ్రామానికి మెరుగైన సదుపాయాలు కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి టీజీ ఎన్పిడిసిఎల్ ద్వారా పెనుబల్లి మండలం తుమ్మలపల్లిలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ నియంత్రికల మరమ్మతు కేంద్ర నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, పెనుబల్లిలో రూ.7 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించిన వైద్య విధాన పరిషత్‌కు చెందిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యం, విద్య రంగాలను అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుని ముందుకు సాగుతున్నదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసిపి, ఎస్ఈ ఎన్పిడిసిఎల్ శ్రీనివాస చారి, డి.ఎం అండ్ హెచ్.ఓ. డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్, తహశీల్దార్, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యానికి నిదర్శనం.. తహసీల్దార్ కార్యాలయం

### ధృవీకరణ పత్రాలు మంజూరులో జాప్యం
### ప్రముఖులకు, పాత్రికేయులకు తప్పని తిప్పలు

**ప్రజాపక్షం/బోనకల్ః** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా దర్శనమిస్తున్నారు. కుల, ఆదాయ, నివాస తదితర ధృవీకరణ పత్రాల మంజూరు ఉద్యోగులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. దరఖాస్తు చేసిన నాటి నుండి విద్యార్థులు, వృద్ధులు కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేయాల్సిన పరిస్థితి దాపురించిదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు తీవ్ర ఎండల వల్ల కార్యాలయానికి వచ్చివెళ్లడానికి వ్యయప్రయాసలు పడాల్సి వస్తుందని మండల ప్రజలు వాపోతున్నారు. కార్యాలయం వద్ద కనీస త్రాగునీరు ఏర్పాటు చేయకపోవడం వల్ల దాహం తీర్చుకోవడానికి ప్రతి సారి ప్రధాన కూడళ్లకు రావాల్సి వస్తుందంటున్నారు. ఇటీవల విద్యార్థుల తల్లిదండ్రులు కేంద్రీయ విద్యాలయానికి దరఖాస్తులో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో కుల ధృవీకరణ దరఖాస్తు చేయడం జరిగింది. ఇటీవల ఓ పాత్రికేయుడు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకొని అధికారులకు విన్నవించి నేటికి వారాలు గడుస్తున్నా మంజూరులో మాత్రం ఏ కదలిక లేదు. ఇక్కడి అధికారులు పైసలకే పనులు చేస్తున్నారనేది ఏమాత్రం ఆరోపణ కాదని మండల ప్రజలు ముక్తకంఠంతో తెలియజేస్తున్నారు.పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ అధికారులు తీరు మాత్రం మారకపోవడంపై మండల ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకొని ప్రజలను ఇబ్బందులకు గురి చేయకుండా సకాలంలో ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ప్రతీ చిన్నారికీ పోలియో చుక్కలు

### మేయర్ పునుకొల్లు నీరజ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు పోలియో వ్యాక్సిన్ వేయించాలని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఆరవ డివిజన్ బస్తీ దవాఖానా ఆయుష్ ఆరోగ్య మందిర్‌లో జరిగిన కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ హాజరై పోలియో వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పోలియో నిర్మూలనకు ఈ వ్యాక్సిన్ ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించేందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, వైద్యురాలు శ్రీయ, ఎఎన్ఎం ప్రమీలరాణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నేత జావిద్ మృతి

### మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి సంతాపం , కాంగ్రెస్‌లో తీవ్ర విషాదం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** చురుకైన నాయకునిగా, వివాదరహితుడిగా పేరొందిన కాంగ్రెస్ నగర మాజీ అధ్యక్షులు, టిపిసిసి కార్యవర్గ సభ్యులు మహ్మద్ జావిద్ (55) రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఖమ్మం నుంచి హైదరాబాద్ వైపు తానే వాహనాన్ని నడుపుకుంటూ వెళ్తున్న జావిద్ సూర్యాపేట జిల్లా తిరుమలగిరి సమీపంలో డివైడర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. చాలా కాలం పాటు కాంగ్రెస్ నగర అధ్యక్షునిగా, టిపిసిసి సభ్యునిగా, సేవాదళ్ రాష్ట్ర బాధ్యునిగా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ ఏ పని అప్పగించినా విజయవంతంగా పూర్తి చేసే జావిద్ మరణం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

**పలువురు సంతాపం :** జావిద్ మృతిపట్ల పలువురు తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఒక నిబద్ధత కలిగిన నాయకున్ని కోల్పోయిందన్నారు.కాంగ్రెస్ పార్టీలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్న జావిద్ అకాల మరణం తనను ఎంతగానో బాధించిందన్నారు. సంతాపం తెలిపిన వారిలో రాజ్యసభ సభ్యులు రేణుకాచౌదరి, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంఎల్‌సి తాతా మధు, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, శాసన సభ్యులు మట్టా రాగమయి, రాందాస్ నాయక్, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, మువ్వా విజయ్ బాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాగండ్ల దీపక్ చౌదరి, మేయర్ పునుకొల్లు నీరజ, పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేశాయి.

**సిపిఐ సంతాపం :** జావిద్ మృతి పట్ల సిపిఐ తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. సంతాపం తెలిపిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, నగర కార్యదర్శి జానిమియా, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

# రామదాసు కట్టడాలకు ఆటంకం కలగకుండా చూడాలి

### రూ.351 కోట్ల పనులను యుద్ధ ప్రాతిపదికన మొదలు
### మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/భద్రాచలం ః** భక్త రామదాసు నిర్మించిన కట్టడాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయ అభివృద్ధి పనులపై ఆయన మంగళవారం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ చారిత్రక ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుని రామదాసు కట్టడాల సమరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు చేయాలని తెలిపారు. రామాలయం అభివృద్ధి తొలిదశ పనుల్లో భాగంగా రూ.351 కోట్ల పనులకు వెంటనే టెండర్లు పిలిచి ఆ ప్రక్రియను నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆలయ నూతన నామూనాను పరిశీలించిన ఆయన శాస్త్రోక్తంగా నిర్మాణాలు సాగాలని తెలిపారు. ఆర్టిటెక్ట్ ఇంజనీర్లు అవసరాన్ని బట్టి ఇక్కడ కార్యాలయాన్ని సిద్ధం చేసుకోవాలని, అధిక శాతం రాయి, మెటిల్ పరికరాలతో కట్టడాలు నిర్మించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భద్రాచలం రామాలయాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీరామ నవమి నాడు పనులకు భూమి పూజా చేశారని చెప్పారు. భద్రాచలం రామాలయం దేశంలోనే అగ్రగామి ఆలయంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వంసిద్ధంగా ఉందని, ఆలయాభివృద్ధిలో భాగంగా రహదార్లతో పాటు పలు రకాల సదుపాయాలు కల్పించి అధిక సంఖ్యలో భక్తులు ఇక్కడికి తరలివచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గోదావరి పుష్కరాల నాటికి తొలిదశ అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు రాత్రింబవళ్లు పనులు చేయాలని సూచించారు. మంత్రి వెంట భద్రాచలం, పినపాక ఎంఎల్ఏలు డా.తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, దేవాదాయధర్మాదాయ శాఖ కమీషనర్ హన్మంతరావు, ఐటిడిఏ పిఓ రాహుల్, సబ్ కలెక్టర్ మినాళ్ శ్రేష్ట, దేవస్థానం ఇఓ దామోదర్ రావు, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ, ఆలయ అస్థాన పండితులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత సామాజిక బాధ్యత

### అడిషనల్ డిజి సంజయ్ కుమార్ జైన్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** రోడ్డు భద్రత సామాజిక బాధ్యతగా గుర్తించాలని అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్ అన్నారు. ప్రజాపలనాప్రగతి ప్రణాళిక లో భాగంగా బుధవారం స్థానిక ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రోడ్డుభద్రతను అందరూ బాధ్యతగా తీసుకుంటే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఇందుకు తల్లిదండ్రులతో పాటు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు ట్రాఫిక్ రూల్స్ గురించి పిల్లలకు తెలియజేయాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వలన కలిగే అనర్థాలను వివరించాలన్నారు. ట్రాఫిక్ సిగ్నాల్స్ పాటించడం, హెల్మెట్ ధరించడం సీటు బెల్ట్ పెట్టుకోవడం వలన కలిగే ప్రయోజనాలను తెలియజేయాలన్నారు. మద్యంసేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, అతివేగంగా వాహనాలు నడుపడం వలన కలిగే అనార్థలను తెలియజేయాలన్నారు. నిబంధనలు సక్రమంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. యుద్ధాలు, నేరాలలో మరణించే వారికంటే రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్న వారు ఎక్కువగా ఉన్నారన్నారు. ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాలలో 1.8 లక్షల మంది ప్రాణాలు కోల్పోతుండగా ప్రతి నిమిషానికి ఒక ప్రమాదం, ప్రతి మూడు నిముషాలకు ఒకరు మృతిచెందుతున్నారని వీరిలో 1845 సంవత్సరాలలోపు వారే అని నివేదికలు తెలుపుతున్నాయన్నారు. విదేశాల్లో ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే కఠినమైన చర్యలతో పాటు జరిమానాలు విధిస్తుంటారని తెలిపారు. మన దేశంలో వచ్చేసరికి అవే నిబంధనలు పాటించడంలో నిర్లక్ష్యంచేస్తారని ఈ అలసత్వం వల్ల ఏటా భారీగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు రోడ్డు భద్రతా నియమాలు పాటించడం వలన పిల్లలకు ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం పోలీసు కమిషనర్ సునిల్‌దత్ మాట్లాడుతూ చిన్న నిర్లక్ష్యం నిండుప్రాణాలను బలితీసుకుంటుందన్నారు.

# రహదారుల భద్రత మనందరి బాధ్యత

### రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం ః** రహదారు భద్రత మనందరి బాధ్యతని, ప్రమాదాల నివారణకు అంతా కృషి చేయాలని కలెక్టర్ అంకిత్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం కొత్తగూడెం హనుమాన్ బస్తీలోని ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీని కలెక్టర్ ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులతో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. చిన్నవయస్సులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్‌లో బాధ్యతాయుత పౌరులుగా ఎదిగేందుకు దోహతపడుతుందని తెలిపారు. తమ వారు వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ పెట్టుకోవాలని, సీటు బెల్టు ధరించాలని చెప్పాలని, ట్రాఫిక్ సిగ్నల్, జీబ్రా క్రాసింగ్ వినియోగం, రోడ్డు నియమాల పాటింపు వంటి అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల కాణంగా అనేక కుటుంబాలు తీవ్రమైన నష్టాన్ని చూస్తున్నాయని తెలిపారు.




# ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

### డాక్టర్ చందు నాయక్

**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగంః** ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని డాక్టర్ చందు నాయక్ తెలిపారు. ఆలయ ఫౌండేషన్ మార్గదర్శకులు ఐఎఎస్ ఆదేశాల మేరకు ఆలయ ఫౌండేషన్, ఆశా పాజిటివ్ ఫీపుల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో, స్థానిక కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ కార్యాలయంలో 13 హెచ్ఐవి బాధిత చిన్నారులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ చందు నాయక్ మాట్లాడుతూ హెచ్ఐవి వైరస్‌తో జీవిస్తున్న వారికి పౌష్టికాహారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి, వైరస్ అదుపులో ఉంటుందని వివరించారు. ప్రభుత్వ ఏఆర్‌టి సెంటర్ ద్వారా లభించే మందులతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని ఆయన భరోసా ఇచ్చారు. నాకో, తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సోసైటీ నిర్ధేశించిన 959599 లక్ష్యాలను అధిగమించి, ఖమ్మం జిల్లాను ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు. విద్యకు భరోసా హెచ్ఐవి బాధిత చిన్నారులు చదువు విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. చిన్నారుల ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయం అందించే విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని హామీ ఇచ్చారు. ప్రోగ్రాం మేనేజర్ టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హెచ్ఐవి తో జీవిస్తూ గవర్నమెంట్ ఆర్ట్ సెంటర్‌లో మందులు తీసుకుంటున్న వారిని క్రమం తప్పకుండా మందుల వాడించాలని, తద్వారా వైరల్ లోడ్ తగ్గి సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటూ, జీవిత కాలం కూడా పెరగడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే ఫాలోఅప్ చేసిన రిపోర్ట్స్ అన్ని వివరాలను సోచ్ మొబైల్ అప్ ద్వారా ఎంట్రీ చేయాలని చెప్పారు.అప్పా ప్రాజెక్ట్ మేనేజర్ శంకర్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ సత్యకుమార్, హైదరాబాద్ లెప్రా సంస్థ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ టి వెంకటేశ్వర్లు, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం అసిస్టెంట్ రామకృష్ణ, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, బాధిత చిన్నారుల కుటుంబ సభ్యులు, కోఆర్డినేటర్స్, సుందర్, నవీన్, రాము, కమ్యూనిటీ లైసోన్ ఫర్ హెల్త్ పాల్గొన్నారు.




# నిజాయితీతో సేవలు అందించాలి

### లక్ష్య సాధనకు కృషి చేయాలి
### దాతల సహకారం అభినందనీయం
### గ్రంథాలయంప్రారంభించిన డిఇఒ

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** నిజాయితీ, నిబద్ధతతో సమాజానికి సేవలు అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి చైతన్యజైని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆమె తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మంచుకొండ ఉన్నత పాఠశాలలో మందడపు పద్మ మందడపు నర్సింహారావు దంపతులు రూ. 7లక్షలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ముఖ్య అతిథిగా హాజరైన డిఈవో చైతన్యజైని ప్రారంభించారు. కళావేదికను డిఈవోతో పాటు స్వాతంత్ర్య సమరయోధులు మందడపు సత్యనారాయణ లు ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని తెలిపారు. సమాజానికి తాము ఏమిస్తున్నామనేది గుర్తెరిగి సేవలు అందించాలని తెలిపారు. విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు తాను వ్యక్తిగతంగా గిఫ్ట్ టు చిల్డ్రన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. నేలకొండపల్లిలో విద్యార్థుల కోసం స్నాక్స్ అందించే కార్యక్రమాన్ని పూర్తిగా తాను దత్తత తీసుకుని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంచుకొండ పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో టాప్ ర్యాంకు సాధించే విద్యార్థినికి సైకిల్ బహుమతిగా అందిస్తానని ఆమె తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించి ఉత్తమ ఫలితాల సాధనకు దోహదపడతాయన్నారు. చిన్న చిన్న కార్యక్రమాల ద్వారా పెద్ద పెద్ద మార్పులు తీసుకు రావచ్చని ఆమె తెలిపారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సర్పంచ్ మందడపు సత్యనారాయణ తో పాటు స్థానిక మాజీ ప్రజాప్రతినిధులను, దాతలను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్ఎం కరుణకుమారి అధ్యక్షతన జరిగిన ఎంఈవో రాములు, సర్పంచ్ తేజావత్ శంకర్, ఉప సర్పంచ్ ముకుందమ్మ, మాజీ సొసైటీ ఛైర్మన్లు మందడపు సుధాకర్, తుమ్మలపల్లి మోహన్ రావు, ఏఏపి ఛైర్మన్ ప్రమీల, మాజీ ప్రజాప్రతినిధులు మందడపు మాధవరావు, భూక్యా లక్ష్మణ్ నాయక్, పద్మావతి, ఏసుబు, చెన్నులింగం, తులసి, పుల్లయ్య, కృష్ణవేణి, భిక్షం, దీప్లానాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులుపాల్గొన్నారు.



# ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలి

### రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని రఘునాథపాలెం ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కోయచలక గ్రామంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై ఎన్‌జెపిటిబిసిడబ్ల్యూఆర్ పాఠశాల విద్యార్థులకు, స్థానికులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన కలిగి ఉంటే ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. పాఠశాలల్లో ట్రాఫిక్ సిగ్నల్స్, జిబ్రా క్రాసింగ్, హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం పై అవగాహన కల్పించాలన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. రోడ్డు దాటేటప్పుడు కూడా కుడి, ఎడమలు చూసుకుని దాటాలన్నారు.



# బాలికల భవిష్యత్‌కు విద్యే బలం



జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

ప్రజాపక్షం/హనుమకొండ : బాలికల భవిష్యత్తు బలంగా ఉండాలంటే విద్యే ప్రధాన ఆధారం అని, బాల సదనంలో ఉన్న ప్రతి విద్యార్థిని మంచి లక్ష్యాలతో కృషి చేస్తూ బాగా చదువుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు.బుధవారం హనుమకొండ సుబేదారిలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల బాల సదనాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా అక్కడ నివసిస్తూ వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్న బాలికలతో ఆత్మీయంగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, వసతి, ఆహారం తదితర అంశాలపై వివరాలు తెలు సుకున్నారు.బాల సదనంలో ఉన్న విద్యార్థినుల సంఖ్య, వారు అభ్యసిస్తున్న కోర్సులు, వంటశాల నిర్వహణ, ఆహార నాణ్యతపై విద్యార్థినులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగదిని పరిశీలించి, భోజన నాణ్యతను పరీక్షించారు.వేసవి సెలవుల్లో బాలికల హాజరు, దత్తత ప్రక్రియలపై జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మరియు సూపరింటెండెంట్ కళ్యాణి నుంచి వివరాలు తీసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల సదనంలోని బాలికల పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, వారికి ఉత్తమ సంరక్షణ, విద్యా అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. దత్తతకు సంబంధించిన దరఖాస్తులు వచ్చిన పక్షంలో, బాలికల గార్డియన్ సమ్మతితో పారదర్శకంగా, వేగవంతంగా చర్యలు చేపట్టాలని సూచించారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి, ఉన్నత స్థాయికి చేరుకునేలా కృషి చేయాలని ప్రోత్సహించారు.ఇద్దరు విద్యార్థినులు జనరల్ నర్సింగ్ కోర్సులో ప్రవేశం పొందేందుకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా సంక్షేమ అధికారి వివరించగా, కలెక్టర్ వారికి అభినందించారు.సందర్శన సమయంలో లక్ష్మీ ప్రసన్న అనే బాలికకు పుట్టిన రోజు కావడంతో, జిల్లా కలెక్టర్ ఆమెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. స్వయంగా దగ్గరకు తీసుకుని ఆశీర్వదించడం ద్వారా బాలికలో ఆనందం నింపారు.అనంతరం బాలికల కోసం సిద్ధం చేసిన భోజనాన్ని రుచి చూసి, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే బాల సదనానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి అవసరమైన సూచనలు అందించారు. సూపరింటెండెంట్ ఎం. కళ్యాణి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్‌చార్జి ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం. మౌనిక, కౌన్సిలర్లు త్రివేణి, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## రైతును రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుంది

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ప్రజాపక్షం / నల్లబెల్లి : విద్యుత్తు ఘతుకంతో మొక్క జోన్న పంట దగ్ధం కావడంతో నర్సంపేట ఎంఎల్ఎ దొంతి మాదవరెడ్డి ఆదేశాల మేరకు మార్కెట్ కమిటి చైర్మన్ పాలాయి శ్రీనివాస్ బుధవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని మూడుచెక్కలపల్లి గ్రామ రైతులను పరమర్శించారు . ఈ సందర్బంగా నర్సంపేట మార్కెట్ కమిటి చైర్మన్ మాట్లాడుతు రైతులను అదుకోనుటకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని రైతులు అధైర్య పడోద్దని తెలిపారు . పంట నష్టా పోయిన రైతుల కోసం అధికారులతో స్థానిక ఎంఎల్ఎ దొంతి మాధవరెడ్డి మాట్లాడినారని జరిగిన నష్టాన్ని అంచన వేసేందుకు అధికారులు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. నర్సంపేట ఎడిఎ దామోదర్‌రెడ్డి ,తహసిల్ధార్ ఎం.కృష్ణ ,మండల వ్యవసాయాధికారి రజిత ,కాంగ్రేస్ జిల్లా పార్టీ కార్యదర్శి చిట్యాల తిరుపతిరెడ్డి ,జిల్లా మునింధర్ ,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్ ,రమేష్ ,సురేష్ పాల్గోన్నారు .

## తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యత



ప్రజాపక్షం/ఖిలా వరంగల్: తెలంగాణ ఉద్యమకారులకు అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని వరంగల్ ఉమ్మడి జిల్లా ఉద్యమకారుల సంఘం కన్వీనర్ మరుపల్ల రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వరంగల్, కరీమాబాద్‌లోని ఎస్‌కే గౌడ్ కళాభవనంలో జరిగిన సమావేశానికి మరుపల్ల రవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జైలు జీవితం గడిపిన వారు రిమాండ్ పొందిన ఉద్యమకారులు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం నెలకు రూ.25వేల పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని పేర్కొని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికి ఇంత వరకు ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి వారిని రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ రెండు తేదీన జరుగు ఉత్సవాలలో అర్హత కలిగిన ఉద్యమకారులందరికి ప్రశంస పత్రం ఇచ్చి ప్రభుత్వం గౌరవించాలన్నారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు మేకల ఎల్లయ్య, కోడూరు నరేష్ మోక్ష, అంకం దేవానంద్, బొద్దుల కుమారస్వామి, ఆనంద్, తవటం కనకరాజు, ఊరుగొండ రమేష్, సోమా మధుకర్, మాటేటి రాజ్‌కుమార్, ముసినిపెల్లి జమున, కొడిపాక రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా పాలనపై సమీక్ష

ప్రజాపక్షం/గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో నెడు ముఖ్యమైన మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అధికారి సత్యనారయణ వెల్లడించారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రజల ప్రాతినిధ్యం (99 రోజుల యాక్షన్ ప్లాన్) కార్యక్రమం నూపథ్యంలో ఈసమావేశం నిర్వహించబడుతోంది గూడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో జరగునుంది మండల పరిధిలోని అమలు అవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాల పురోగతిపై సమగ్రంగా సమీక్ష చేయడం ఈసమావేశం ప్రధాన ఉద్దేశ్యంగా ఉంది.సమావేశంలో తెలంగాణ రాష్ట్ర గీతంలో కార్యక్రమం ప్రారంభమై అనంతరం ఎంపిడివో స్వాగత ప్రసంగం ఉంటుంది. వివిధ శాఖల అధికారులు తమ తమ శాఖల పరిధిలో అమలు చేస్తున్న పథకాలపై నివేదికలు సమర్పించునున్నారు. ముఖ్యంగా రైతు భరోసా వంటి వ్యవసాయ పథకాల అమలు లబ్దిదారుల ఎంపికపై చర్చించనున్నారు. అదనంగా ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు గ్రామాల సమస్యలు వాటి పరిష్కారాలపై చర్చించి తుదిగా కార్యాచరణ పథకాలు (యాక్షన్ పాయింట్స్) రూపోందించనున్నారు. ప్రజాప్రతినిధులు అధికారులు అంగన్‌వాడి టీచర్లు ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు స్వయం సహాయక సంఘూల సభ్యులు తదితరలు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపిడివో సత్యనారాయణ తెలిపారు.

## రోడ్డు భద్రత పాటింపుతో ప్రాణ భద్రత



ప్రజాపక్షం/జనగామ : రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రాణ భద్రతను చూపాలని జనగామ డిసిపి రాజమహేంద్రనాయక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా బుధవారం నెహ్రూ పార్కు సమీపంలో పోలీస్ శాఖ, రవాణా శాఖ సంయుక్తంగా స్కూల్ విద్యార్థులతో మానవ హారం ఏర్పాటు చేసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డిసిపి రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. వాహనదారులు తప్పక హెల్మెంట్ దరించాలని, కార్ నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. రాంగ్ రూట్‌లో వెళ్లరాదని, మద్యం సేవించి వాహనాన్ని నడపరాదన్నారు. ఏ చిన్న విషయంలో నిర్లక్ష్యం వహించినా ప్రాణాల మీదకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అందుకే వాహనదారులు తప్పక నిబంధనలు పాటించాలని, సిగ్నల్ సందర్భంగా ఆగాలన్నారు. ఎసిపి పండరి చేతన్ నితిన్, సిఐ సత్యనారాయణ రెడ్డి, డిటిఓ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ చెన్నకేశవులుతో పలువురు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు ప్రభుత్వం అండ

మాజీ మంత్రి, ఎంఎల్‌సి బస్వరాజు సారయ్య

ప్రజాపక్షం/ఖిలా వరంగల్: చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ మంత్రి, ఎంఎల్‌సి బస్వరాజు సారయ్య అన్నారు. రంగల్ నగరంలోని కొత్తవాడలో చేనేత సొసైటీల బాధ్యులు ఏర్పాటు చేసిన సమావేశానికి మాజీ మంత్రి, ఎంఎల్‌సి బస్వరాజ్ సారయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా చేనేత సొసైటీల బాధ్యులు చేనేత కార్మికులకు సంబంధించిన పలు సమస్యలను ఎంఎల్‌సి సారయ్య దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర విద్యార్థిని, విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లకు కావాల్సిన వస్తువులు కొనుగోలుకై జరిపే టెండర్ల నుండి బెడ్ షీట్లు, జంపఖానాలను మినహాయించి, వాటిని నేరుగా చేనేత సొసైటీల నుండి కొనుగోలు చేయాలని దీనివలన 5వేల మంది కార్మికులకు జీవనోపాధి దొరుకుతుందని కావున ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి అట్టి వస్తువులు చేనేత సొసైటీ నుండి కొనుగోలు చేయడానికి కృషి చేయాలని చేనేత సొసైటీ బాధ్యులు మాజీ మంత్రి, ఎంఎల్‌సి బస్వరాజు సారయ్యను కోరగా, వారు ఇట్టి విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డితో నేరుగా మాట్లాడి హాస్టల్లో విద్యార్థిని, విద్యార్థులకు కావాల్సిన బెడ్ షీట్లు జంపఖానాలను టెండర్ ప్రక్రియ ద్వారా కాకుండా నేరుగా చేనేత సొసైటీల నుండి మాత్రమే కొనుగోలు చేసేలా చూడాలని కోరగా, ఇందుకు అజిత్‌రెడ్డి తమ సానుకూలత వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, మాజీ కార్పొరేటర్ దామెర సర్వేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోరంటల రాజు, చేనేత సొసైటీ ప్రతినిధులు డిఎస్ మూర్తి, ఎలగం భద్రయ్య, ఎలగం చిన్న కొమురయ్య, ఎలగం పెద్ద భద్రయ్య, జయరాజు, మాచబత్తిని కుమారస్వామి, పంతగాని శ్రీనివాస్, కొలిపాక మధునయ్య, ఆదేపు రవి, ఎలగం సాంబయ్య, ల్గొన్నారు.

## రైతులందరికీ భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజాపక్షం /జనగామ : రైతులందరికి బరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జనగామ మార్కెట్ కమిటి చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. బుధవారం జనగామ మండలంలోని పెద్దపహాడ్, గోపరాజుపల్లి, వెంకిర్యాల, గానుగపహాడ్, మరిగడి గ్రామాల్లో ఐకెపి, పిఎసిఎస్ ద్వారా ధాన్యం యకొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో పేదలకు, రైతులకు, మహిళలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, రైతులకు సబ్సిడితో పనిముట్లు ఇస్తున్నామన్నారు. రైతులు తాము దిగుబడి చేసిన ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావడం వలన మద్దతు ధర పొందే అవకాశం ఉంటుందన్నారు. మద్దతు ధర పొందడం కోసం తప్పక ధాన్యం ఆరబెట్టి తీసుకురావాలన్నారు. సర్పంచ్‌లు తోటపల్లి రాజేశ్వరి, గద్ద చంద్రశేఖర్, శానబోయిన ఆనూష మహిపాల్, ఈర్ల అలేఖ్య, నవీన్, కర్రె పరశురాం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, ఎఎంసి డైరెక్టర్లు నామాల శ్రీనివాస్, ఉప సర్పంచ్‌లు వార్డు, సభ్యులు తాపాకుల రాములు, శ్రీధర్‌రెడ్డి, ఈర్ల లక్ష్మన్, ప్రసాద్, చిరంజీవి, నాగరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## రైల్వే ఆర్‌ఓబి భూ సేకరణ ప్రక్రియ వేగవంతం



ప్రజాపక్షం/జనగామ: జనగామ మండలం పెంబర్తి గ్రామంలో నిర్మాణం చేయనున్న ఆర్ఓబ కింద భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. భూ సేకరణ, ఇసుక తరలింపుపై బుధవారం కలెక్టరేట్‌లోకి కాన్ఫరెన్స్ హాల్‌లో రైల్వే, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వయించారు. రోడ్ అండర్ బ్రిడ్జీ, రోడ్ ఓవర్ బ్రిడ్జీ నిర్మాణం కోసం భూ సేకరణ తప్పనిసరి అన్నారు. క్షేత్ర స్థాయిలో ఉన్న అవకాశాలను గుర్తించి సమన్వయంతో తనిఖీలు చేపట్టాలని, వెంటనే నివేదిక సమర్పించాలన్నారు. ఆర్ఓబి సమీక్షలో ఆర్‌డిఓ గోపిరామ్, రైల్వే అధికారులు శేషాచారి, స్రామాట్‌రాయ్, అర్అండ్‌బి ఈఈ సరితా రాణి, జి సెక్షన్ సూపరిండెంట్ చంద్రమోహన్ పాల్గొన్నారు. అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇసుక, గ్రావెన్ తరలింపుపై ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ఇసుక, గ్రావెల్ తరలింపు ప్రక్రియపై డిసిపి రాజమహేంద్రనాయక్‌తో కలిసి కలెక్టరేట్‌లో మైనింగ్,రవాణ, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వయించారు.ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇసుక, గ్రావెల్ రవాణాకు మాత్రమే అనుమతులు ఇవ్వాలని స్పష్టం చేశారు. కమర్షియల్ నాన్ కమర్షియల్ అవసరాల ఇసుక వినియోగంలో కూడా నిర్దిష్ట మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద పోలీస్ అధికారులు నిరంతరం తనఖీలు నిర్వహిస్తూ, అక్రమ కార్యక్రలాపాలు అరికట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఇసుక విని యోగం పారదర్శకంగా నియమ నిబంధనలతకు అనుగుణంగా జరి గేలా అన్ని శాఖలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదే శించారు. అనుమతులు లేకుండా ఇసుకన అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని, జిల్లాలో ప్రభుత్వం కేటా యించిన ఇసుక రీచ్‌ల ద్వారానే ఇసుకను తరలించాలని తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారి ప్రవీన్, ఇసుక సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల పెండింగ్ సమస్యల సాధనకు పోరుబాట

టిఎన్‌జిఓస్ యూనియన్

జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు జిల్లా కలెక్టర్ చాహత్ బజ్ పాయ్ ని కలిసి ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారం కొరకు వినతి పత్రం అందజేసి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు మాట్లాడుతూ ఈనెల 17న భోజన విరామ సమయంలో అన్ని మండల కేంద్రాలలో మరియు జిల్లా కలెక్టర్ ల వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలు, అధికారులకు వినతి పత్రాలు అందజేయన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమనికి డిటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు లింగారెడ్డి, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాస్యనాయక్ ఇంచార్జిలుగా వ్యవహరిస్తారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు,కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి వెళ్లేలా నిరసన తెలియజేస్తారని పేర్కొన్నారు.మే 5వ తేదీన జిల్లా కేంద్రాల్లో సామూహిక దీక్షలు చేపడతామని పేర్కొన్నారు.జూన్ రెండు లోపు పిఆర్సి ప్రకటించాలని, పెండింగ్ బిల్లులు, డిఏలు, హెల్త్ కార్డుల జారీ, సిపిఎస్ రద్దు తో పాటు పెండింగ్లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు ఆకవరపు శ్రీనివాస కుమార్, బైరి సోమయ్య,అన్వర్, పెండెం రాజు, కె.శ్రీనివాస్,సర్వర్ హుస్సేన్, పుల్లూరు వేణుగోపాల్, పనికేల రాజేష్,శ్రీనివాస్ రెడ్డి,రాము నాయక్,కోమల్ రెడ్డి,భాను ప్రకాష్ రెడ్డి, సబీర్, సీతారాం,సరస్వతి,శ్యాంసుందర్, మల్లారెడ్డి,రవి ప్రకాష్,విజయ్ కుమార్, రాజమౌళి,రజిత,నాగ రాణి,అశోక్, ప్రణయ్, పృథ్వి, అఫ్జల్,కుమార స్వామి, వీరన్న,సదానందం, పాల్గొన్నారు.



## మండల సభకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజాపక్షం/ములుగు: ప్రజాపాలన..ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 16న మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో నిర్వహించనున్న సభలను పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. ముందస్తుగానే సభా వేదికలను సందర్శించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని మండల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. ఎంపిడిఓలు, తహసీల్దార్లతో, ఇతర మండల స్థాయి అన్ని శాఖల అధికారులతో సమావేశమై తగు సూచనలు చేయాలన్నారు. సభలు నిర్వహించే ప్రదేశాలలో తగిన నీడ, తాగునీరు వంటి కనీస వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు మంజూరు, నూతన రేషన్ కార్డుల పంపిణీ, సన్నబియ్యం పంపిణీ, కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్, సన్నవడ్ల బోనస్, ఇతర సంక్షేమ పథకాల గురించి సభలలో అవగాహన కల్పించడంతో పాటు, ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్దిదారుల వివరాలు చదివి వినిపించాలని, లబ్దిదారులతో వారి అనుభవాలను ప్రజలకు తెలియజేసేలా చూడాలన్నారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వంటి వాటికి సంబంధించి గ్రామ సభలలో వచ్చిన అర్జీలను మండల సభలకు ముందు తప్పనిసరిగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సభలకు ప్రజా ప్రతినిధులను తప్పనిసరిగా ఆహ్వానించాలని, అందరూ భాగస్వాములు అయ్యేలా చొరవ చూపాలన్నారు. సభ ప్రారంభ సమయంలో ప్రోటోకాల్ ప్రకారం ముందుగా రాష్ట్ర గేయం, ముఖ్యమంత్రి సందేశం అందరికి వినిపించాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు ఉద్దేశించి అరైవ్..అలైవ్ కార్యక్రమం గురించి సభల్లో తెలపాలని అన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా సభల విజయవంతానికి అంకితభావంతో కృషి చేయాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, స్థానిక సంస్థలు సంపత్‌రావు, జిల్లా పౌరసరఫరాల మేనేజర్, జిల్లా వ్యవసాయ అధికారి, నీటి పారుదలశాఖ ఈఈలు, విద్యుత్ శాఖ అధికారులు, హౌసింగ్ పిడి, జిల్లా ఉద్యానవన అధికారి, సిపిఓ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, డిపిఓ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## మహిళల రిజర్వేషన్‌తో లబ్ధికి కేంద్ర ప్రభుత్వం యత్నం

బిసి హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

ప్రజాపక్షం/ వరంగల్ : మూడు రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై చర్చించే ముందు చట్టసభలలో బిసిలకు 50శాతం రిజర్వేషన్, మహిళా రిజర్వేషన్లలో బిసి కోటా నిర్ణయించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈసమావేశాల సందర్భంగా ప్రధానమంత్రి దేశంలోని మహిళలను మీ పార్లమెంటు సభ్యులందరికీ లేఖలు రాసి నారీ శక్తి వందన్ బిల్లుకు సహకరించే విధంగా వారిపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేయడం జరిగిందని, మహిళల ప్రయోజనం కోసమే ఈ ముఖ్యమైన పని చేపట్టామని మోదీ ఆర్భాటంగా ప్రకటిస్తున్నాడని, అయితే అగ్రవర్ణాల మహిళల ప్రయోజనాలకోసమా లేక బిసి బడుగు బలహీన వర్గాల మహిళల కోసమా ఆయన చెప్పాలన్నారు. చట్టసభలకు బిసి బడుగు, బలహీన వర్గాల, అణగారిన కులాల మహిళలు రాకూడదని ప్రశ్నించారు. బిసినని చెప్పుకునే ప్రధాని దృష్టిలో మహిళలంటే అగ్రవర్ణాల ఆధిపత్య కులాలకు చెందిన వారేనా అని ప్రశ్నించారు. మహిళలలో సగానికిపైగా ఉన్న ఓబిసిల మహిళలు గుర్తుకు రావడంలేదా అన్నారు. నిజంగా మహిళల ఎడల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా డీ లిమిటేషన్‌తో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్‌లో బిసి కోటా నిర్ణయం చేసి అమలు పరచాలన్నారు. ఒకవైపు తమిళనాడు, వెస్ట్ బెంగాల్ లో ఎన్నికలు జరుగుతున్న వేళ హడావిడిగా పార్లమెంటు సమావేశాలు జరిపి మహిళ ల కోసం ఏదో చేస్తున్నట్టు గా ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందెందుకే ఈ నా టకం ఆడుతున్నట్టు స్పష్టమవుతున్నదన్నారు. దేశంలో ఏనాడో జరగాల్సిన జన గణనను కావాలని వాయిదా వేసి ఇప్పుడు నిర్వహిస్తూ అది పూర్తి కాకముందే నియోజకవర్గాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన చే యడం ఎలా న్యాయమవుతుందన్నారు. లోకస భ సీట్లు 850 వరకు పెంచి ఉత్తరాధికి, దక్షిణాధికి మధ్యన గ్యాప్ పెంచే ప్రయత్నం సరైన కాదన్నారు. ఈ అంశాలపై అన్ని రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి ఏకాభిప్రాయ సాధనకు కృషి చేయాలన్నారు. ప్రస్తుత సమావేశాలలో ఇండియా కూటమి సభ్యులు, ఎన్డీఏ కూటమిలోనున్న బిసి ప్రతినిధులు కూడా చట్టసభలలో బిసిలకు 50శాతం రిజర్వేషన్, మహిళా రిజర్వేషన్లలో బిసి కోటా కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడితేవాలన్నారు.



## సురక్షిత ప్రయాణమే కుటుంబానికి భరోసా

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాపక్షం/మంగపేట/ఏటూరు నాగారం : సురక్షిత ప్రయాణం ప్రతి కుటుంబానికి భరోసా ఇస్తుందని, వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం ఏటూరు నాగారం మండల కేంద్రం లోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరిగి కుటుంబాలు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.

## పిల్లలకు కూడా హెల్మెట్ అవసరం

జిల్లా ఎస్‌పి శబరీష్

ప్రజాపక్షం/మహబూబాబాద్: పిల్లల భద్రత ప్రతి తల్లిదండ్రి యొక్క ప్రథమ బాధ్యతని పిల్లలు కూడా హెల్మెట్ ధరించాలని మహబూబాబాద్ జిల్లా ఎస్‌పి డాక్టర్ శబరీష్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్ నుండి అ్రైవ్ అలైవ్ – 2026 కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు రోడ్డు భద్రత పై అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు . ఈ ర్యాలీలో తమ పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లే తల్లిదండ్రులు, వారి పిల్లలు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది పాల్గొని రోడ్డు భద్రతపై ప్రజలలో చైతన్యం కల్పించారు. “ఇప్పుడు అవసరం లేదు” అనే నిర్ల క్ష్యం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ప్రమాదం ఎప్పుడు జరుగుతుందో చెప్పలేమని, హెల్మెట్ ఒక్కటే ప్రాణాలను రక్షించే ప్రధాన భద్రతా సాధనం అని పేర్కొన్నారు. పిల్లలను ముందు, వెనుక కూర్చోబెట్టి ప్రయాణించే సమయంలో వారికి సరిపోయే సైజ్ హెల్మెట్ తప్పనిసరిగా పెట్టాలని సూచించారు. హెల్మెట్ సరైన విధంగా బిగించి పెట్టకపోతే ఉపయోగం ఉండదని, కాబట్టి సరిగ్గా ధరించడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు.అలాగే, ఒక్క కుటుంబం మాత్రమే కాకుండా సమాజం మొత్తం ఈ నియమాన్ని పాటించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పిల్లలు తమ తల్లిదండ్రులకు హెల్మెట్ ధరించమని గుర్తు చేయడం ద్వారా మంచి మార్పు తీసుకురాగలరని, రోడ్డు భద్రత కుటుంబ స్థాయి నుంచే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.వేగ పరిమితులు పాటించడం, ట్రిపుల్ రైడింగ్ నివారించడం, ట్రాఫిక్ నియమాలను గౌరవించడం వంటి అంశాలు కూడా రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో కీలకమని వివరించారు.

## నూతన రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

‘ఆత్మ’ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి



ప్రజాపక్షం/మహబూబాబాద్ : రైతులను వరి, పత్తి, మొక్కజొన్న, మిరప వంటి పంటల నుండి పంట మార్పిడి చేయించి లాభాలను ఇచ్చే ఆయిల్ పామ్, పండ్లు, కూరగాయలు, మునగ, పూలు, మల్బరీ, తేనెటీగలు పెంపకం, పుట్టగొడుగుల పెంపకం మొదలైన మార్కెట్ డిమాండ్ గల వాటిని సాగు చేయాలని ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో కురవి గ్రామం & మండలం వద్ద ఆయిల్ పామ్ పై అవగాహన మరియు ప్రదర్శన క్షేత్ర సందర్శనను మేక వెంకట్ రెడ్డి, ఆయిల్ పామ్ తోటలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్ నల్ల సుధాకర్ రెడ్డి, మాట్లాడుతూ వరి, పత్తి, మిరప, మొక్క జొన్న పంటలకు బదులుగా రైతులు పంట మార్పిడి ద్వారా లాభదాయకమైన పంటలను సాగు చేయాలని తెలిపారు. మార్కెట్ డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్, అన్ని రకాల కూరగాయలు, పండ్లు, మునగ, ఉల్లి, వెల్లుల్లి, పూలు, మల్బరీ మొదలైన పంటలు సాగు చేయాలని తెలిపారు. ఆత్మ చైర్మెన్, మహబూబాబాద్ నల్ల సుధాకర్ రెడ్డి మరియు అభ్యుదయ రైతుల అమృత హస్తాలతో పంట మార్పిడి ద్వారా ఆయిల్ పామ్ మల్బరీ సాగు పై కర పత్రాలు మరియు డైరీలు ఆవిష్కరించారు.రైతులను ఉద్దేశించి జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్నతో పాటు పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీలు, కూరగాయల పందిళ్ళు, మల్చింగ్, కోల్డ్ రూమ్స్, నిల్వ గిడ్డంగులు, షేడ్ నెట్ హౌస్లు, ఆయిల్ పామ్ రాయితీ, మార్కెటింగ్ వసతులు, మల్బరీ రాయితీలు పొందాలని తెలిపినారు. రైతులు నీటి & భూసార పరీక్షలు చేయించుకోవాలి, ప్రకృతి సేద్యం అవలంభించాలని తెలిపా రు. బోర్లు, బావుల కింద వరి, పత్తి, మిరప, మొక్కజొన్న వంటి పంటలకి బదులుగా, మార్కెట్ డి మాండ్ ఉన్న ఆయిల్ పామ్, అన్ని రకాల కూరగాయలు, పండ్లు, మునగ, ఉల్లి, వెల్లుల్లి, పూలు, మ ల్బరీ మొదలైన పంటలు సాగు చేయాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి రాజేశ్వరి, ఉద్యాన విస్తరణ అధికారి టి. విజయపాల్ రెడ్డి, రమేష్, ఆయిల్ ఫెడ్ విస్తరణ అధికారి కె. రంజిత్, ఆయిల్ ఫెడ్ మానిటరింగ్ అధికారి కె. రంజిత్, బిందు సేద్య ఇంజనీర్ కిషోర్, బిందు ప్రతినిధి అశోక్, జి. ప్రసాద్ బాబు, అశోక్, ఆగస్టిన్ అభ్యుదయ పాల్గొన్నారు.

# చెన్నై ఖాతాలో రెండో విజయం!

పంతొమ్మిదో సీజన్‌లో కోలకతా నైట్ రైడర్స్ కథ మారడం లేదు. వేదిక మారినా ఆ జట్టు పరాజయాల వ్యథ మాత్రం మారడం లేదు. రెండొందలకుపైగా కొడుతుందనుకున్న చెన్నై సూపర్ కింగ్స్‌ను 192కే నిలువరించిన కోలకతాను బ్యాటర్లు నిట్ట నిలువునా ముంచేశారు. నూర్ అహ్మద్(3–21) స్పిన్ మాయాజాలం చూపిస్తూ మూడు వికెట్లతో 11వ ఓవర్లోనే సీఎస్కే గెలుపు ఖాయం చేశాడు. ఈ కుర్ర స్పిన్నర్ ధాటికి మిడిలార్డర్ కుప్పకూలగా.. ఆఖర్లో రొవ్మన్ పావెల్(31), రమన్‌దీప్(35 నాటౌట్) పోరాడినా సరిపోలేదు. దాంతో, చెన్నై వరసగా రెండో విజయం నమోదు చేసింది. మూడుసార్లు ఛాంపియన్ కోలకతా నైట్ రైడర్స్‌కు పంతొమ్మిదో సీజన్‌లో ఏదీ కలిసి రావడం లేదు. ఓపెనింగ్ జోడీని మార్చిన కలిసి రాలేదు. డేంజరస్ ఓపెనర్ ఫిన్ అలెన్(1) ఔటయ్యాడు.. అయితే.. వికెట్ పడగా.. సునీల్ నరైన్ (24)కు 18 పరుగుల వద్ద లైఫ్ లభించింది. క్యాచ్ వదిలేశాడు. కానీ, ఖలీల్ అహ్మద్ రెండో బంతికి స్లిప్‌లో గుర్జప్నీత్కు నరైన్ దొరికాడు. 29కే రెండు వికెట్లు పడిన వేళ.. రఘువంశీ(27), కెప్టెన్ అజింక్యా రహానే (28)లు గెలిపించే బాధ్యత తీసుకున్నారు. ఓపెనర్లు తేలిపోగా రహానే, రఘువంశీ ఆచితూచి ఆడుతూ హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో ఆశలు రేపారిద్దరూ. కానీ, 11వ ఓవర్‌లో నూర్ అహ్మద్(321) వరస



బంతుల్లో రహానే, కామెరూన్ గ్రీన్(0)ను బౌల్ చేసి కోలకతాను దెబ్బకొట్టాడు. ఆ తర్వాతి ఓవర్‌లో డేంజరస్ రింకూ సింగ్(6)ను వెనక్కి పంపిన ఈ స్పిన్నర్ మ్యాచ్‌ను చెన్నై వైపు తిప్పాడు. రొవ్మన్ పావెల్(31), రమన్‌దీప్ సింగ్(35 నాటౌట్)లు పోరాడినా గెలిపించలేకపోయారు. 32 పరుగుల తేడాతో విక్టరీ కొట్టిన సీఎస్కే ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది.

## మెరిసిన శాంసన్, బ్రెవిస్

టాస్ ఓడిన చెన్నై సూపర్ కింగ్స్‌కు శుభారంభం దక్కలేదు. తొలి ఓవర్‌లో సంజూ శాంసన్(48) హ్యాట్రిక్ ఫోర్లతో తన ఉద్దేశాన్ని చాటాడు. అయితే.. ఫామ్‌లో లేని రుతురాజ్ గైక్వాడ్(7)ను అనుకుల్ రాయ్ చేసి బ్రేకిచ్చాడు. శాంసన్ జతగా ఆయుష్ మాత్రే(38) దూకుడుగా ఆడాడు. నాలుగో ఓవర్‌లో 4, 4, 6, 6తో ఇరవై రన్స్ పిండుకున్నాడు మాత్రే. రెండో వికెట్‌కు 47 పరుగులు జోడించిన మాత్రేను వైభవ్ అరోరా ఔట్ చేసి రెండో వికెట్ అందించాడు. ఆ తర్వాత సర్ఫరాజ్ ఖాన్(23) జతగా రెచ్చిపోయిన సంజూను కార్తిక్ త్యాగీ బౌల్ చేశాడు. 111కే మూడు వికెట్లు పడిన వేళ.. కోలకతా బౌలర్లపై డెవాల్ బ్రెవిస్ (41), సర్ఫరాజ్ ఎదురుదాడికి దిగారు. నరైన్ ఓవర్‌లో సర్ఫరాజ్ బౌల్డవ్వగా.. అర్ధ శతకానికి చేరువైన బ్రెవిస్ను కార్తిక్ త్యాగి వెనక్కి పంపాడు. డెత్ ఓవర్లలో ఓవర్టన్(7 నాటౌట్), శివం దూబే(13 నాటౌట్)లు ధనాధన్ ఆడలేకపోవడంతో 200లు కొట్టాలనుకున్న చెన్నై 192కే పరిమితమైంది.

## జాతీయ హాకీ శిబిరానికి తెలంగాణ ప్లేయర్లు




జాతీయ హాకీ శిబిరానికి రాష్ట్రానికి చెందిన హర్షకుమార్, వీణ ఎంపికయ్యారు. రాంచీ వేదికగా ఇటీవల ముగిసిన జాతీయ సబ్ జూనియర్ హాకీ టోర్నీలో మెరుగైన ప్రదర్శన కనబరిచిన హర్షకుమార్, వీణ భోపాల్‌లోని సాయ్ సెంటర్‌లో శిక్షణ పొందనున్నారు. ఈనెల 19 నుంచి మొదలయ్యే క్యాంప్ ద్వారా అండర్–18 జూనియర్ ఆసియా కప్ టోర్నీకి భారత జట్లను ఎంపిక చేయనున్నారు. వచ్చే నెల 29 నుంచి జూన్ 6వ తేదీ వరకు జపాన్ వేదికగా ఆసియా కప్ హాకీ టోర్నీ జరుగనుంది.

## దీప్తికి విజ్డెన్ క్రికెటర్ అవార్డు



విజ్డెన్ అల్మానాక్ 2026 అవార్డుల్లో భారత క్రికెటర్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. తొమ్మిది విభాగాల్లో ఏడింటిని కైవసం చేసుకున్నారు. స్వదేశం వేదికగా ముగిసిన వన్డే ప్రపంచకప్‌లో ఆల్‌రౌండర్‌గా దీప్తి అద్భుత ప్రదర్శన కనబరుస్తూ 22 వికెట్లు పడగొట్టింది. అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో రాణించిన దీప్తి టీమ్‌ఇండియా వరల్డ్ కప్ గెలువడంలో కీలకంగా వ్యవహరించింది. వీటిని పరిగణనలోకి తీసుకున్న విజ్డెన్..దీప్తిని 'వుమెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు ఎంపిక చేసింది. టి–20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా అభిషేక్‌శర్మ ఎంపిక కాగా, ఫైవ్ క్రికెటర్స్ ఆఫ్ ద ఇయర్ అవార్డు జాబితాలో టీమ్‌ఇండియా నుంచి గిల్, సిరాజ్, పంత్, జడేజా చోటు దక్కించుకున్నారు.

# ఎన్నో అవశేషాలు..




కాకతీయ కాలపు దేవాలయ అవశేషాలు : వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు జిల్లాలోని శివాలయాలు, శిల్పాలు చాలా వరకు శిథిలమయ్యాయి. వరంగల్ వేయిస్తంభాల గుడి మరమ్మతు పేరుతో జరిగిన నష్టం ఇప్పటికీ భర్తీ కాలేదు. కాగా, వాడరేవు, నాగాయలంక వంటి సముద్రతీరంలోని పాత ఓడరేవులు ఉనికిని కోల్పోతున్నాయి. నిర్లక్ష్యం, వర్షపాతం, సంరక్షణ లోపం వల్ల రాతిపై ఉన్న కొండపల్లి కోట, ఏలూరు ప్రాచీన శాసనాలలో వివరాలు ప్రమాదంలో ఉన్నాయి. కడప, నెల్లూరు ప్రాంతాల్లో రేనాటి చోళుల వంశానికి చెందిన శాసనాల సంఖ్య అనేకం. వాటిలో కొన్ని ఇళ్ల గోడల్లో ఇమిడిపోయి ఉన్నాయి. నాగార్జున కొండ, అమరావతి ప్రాంతాల్లోని కొన్ని అవశేషాలు పర్యాటకుల రద్దీ, విస్తృత నిర్మాణాల వల్ల ప్రమాదంలో ఉన్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా, చారిత్రక అవశేషాలను కాపాడడానికి శాస్త్ర సాంకేతికతను విస్తారంగా ఉపయోగించుకోవాలి. డిజిటల్ ఆర్కైవింగ్ కూడా ఇప్పుడు విశేషంగా ఆదరణ పొందుతున్నది. ప్రాచీన హస్తప్రతులు పాడైపోక ముందే ఫోటోలు, డిజిటల్ ఫార్మాట్లు, పునర్వ్యాఖ్యానాలు రూపొందించాలి. ఇదిభవిష్యత్తుకు ఒక బలమైన రక్షణ. ఇలాంటి చర్యలు లేకపోతే, అవశేషాలు నాశనమవుతాయి. అప్పుడు గత స్మృతుల జాడ ఉండదు. ఒక గ్రామం పక్కన ఉన్న పాత బురుజు కూలిపోతే, ఆ ఊరి గుర్తింపునకు దెబ్బ తగిలినట్లే. దీనివల్ల విద్యా నష్టం కూడా. ఎందుకంటే, శాసనాలు, శిల్పాలు లేకపోతే చరిత్ర పుస్తకాలు అంచనాలపై మాత్రమే ఆధారపడాలి. ఒక సమాజం తన చరిత్రను వదిలేస్తే, ప్రతి తరం తన మూలాలను కోల్పోతుంది. కాబట్టి, ప్రభుత్వా



లు, పురాతత్వశాఖలు మాత్రమే కాకుండా సాధారణ ప్రజలు కూడా పెద్ద పాత్ర పోషించాలి. పాత కట్టడాల వద్ద చెత్త వేయకపోవడం, అవశేషాలను కాపాడుతున్న వారికి సహాయం చేయడం, పర్యాటక ప్రాంతాల్లో శిల్పాలను చేతితో తాకకుండా దూరంగా ఉండడం వంటి చర్యలు అవసరం. అదే విధంగా స్థానిక చరిత్ర గురించిన అవగాహన పెంచాలి. సోషల్ మీడియా ద్వారా సంరక్షణ ఉద్యమాలను ప్రోత్సహించాలి. ఇలాంటి



చిన్నచిన్న చర్యలు భవిష్యత్తులో పెద్దమార్పుని తెస్తాయనడంలో సందే హం లేదు. ప్రభుత్వం కూడా ఈ దిశగా దృష్టి సారించాలి. పురాతత్వ శాఖలకు పెద్దమొత్తంలో నిధులు సమకూర్చాలి. అవశేషాల చుట్టూ బఫర్ జోన్ ఏర్పాటు చేయాలి. నాశనమైన కట్టడాలపై శాస్త్రీయ పునరుద్ధరణ ప్రాజెక్టులు చేపట్టాలి. స్థానిక పాఠశాలల్లో చరిత్ర సంరక్షణపై విద్యా కార్యక్రమాలు నిర్వహించాలి. అవశేషాల డిజిటల్ మ్యాపింగ్‌కు చర్యలు తీసుకోవాలి. ప్రతిజిల్లాలో ప్రత్యేక పురావస్తు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి. ఏదిఏమైనా, మన సంరక్షణ పద్ధతులు మారకపోతే చారిత్రక అవశేషాలు కనుమరుగయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అన్నీ మన చేతిలో లేకపోయినా, చాలా వాటిని రక్షించడానికి మనకు శక్తి ఉంది. ఒక అవశేషాన్ని కాపాడటం అంటే ఒక నాగరికతను నిలబెట్టడం. ఒక జ్ఞాపకాన్ని నిలుపుకోవడం. ఒక చరిత్రను భవిష్యత్తులోకి తీసుకుపోవడం. నిజానికి చారిత్రక అవశేషాలు మనకు పాఠాలు నేర్పే గురువులు. వాటి నాశనం ఒక సాంస్కృతిక శూన్యతను మాత్రమే సృష్టించదు, ఒక సమాజం తన మూలాలను కోల్పోవడానికి దారితీస్తుంది. ప్రకృతి, నిర్లక్ష్యం, ఆధునికీకరణ, దోపిడీ వంటి శక్తులు వాటిని నెమ్మదిగా చెరిపేస్తున్నప్పటికీ మనం సకాలంలో కదిలితే అనేక అవశేషాలను కాపాడగలుగుతాం. మన పూర్వీకుల చరిత్ర ఎక్కడ? అని భవిష్యత్ తరాలు అడిగే ప్రశ్నకు జవాబు ఇవ్వగలిగే సామర్థ్యం మన చర్యలలోనే ఉంది.

## చరిత్ర విస్మరించిన శ్రమజీవులు

**'నెలునదీ నాగరికతలో సామాన్యుని జీవనమెట్టిది? తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?'**

చరిత్రను మనం ఎక్కువగా రాజులు, సామ్రాజ్యాలు, యుద్ధాలు, విజయగాథల రూపంలోనే చదువుతుంటాం. కానీ ఆ మహత్తర చరిత్రకు అసలైన పునాది వేసింది ఎవరు అన్న ప్రశ్నను లోతుగా అడిగితే, సమాధానం స్పష్టంగా కనిపిస్తుంది...సాధారణ మనుషులు, కూలీలు, రైతులు, కళాకారులు, శిల్పులు, వ్యాపారులు. ప్రాచీన నాగరికతల వెనుక ఉన్న అసలైన శక్తి వీరే. వారి శ్రమ లేకుండా ఏ సామ్రాజ్యమూ, ఏ నగరమూ, ఏ చారిత్రక అద్భుతమూ నిలబడలేదు. ప్రాచీన నాగరికతలు ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఎదిగాయి. నైలు, టైగ్రిస్–యూఫ్రటిస్, సింధు, యెల్లో నదీ లోయల నాగరికతలు అన్నీ రైతుల శ్రమపై నిలిచాయి. విత్తనం నాటడం నుంచి పంట కోత వరకు, నీటిపారుదల కాలువలు తవ్వడం నుంచి భూమిని సారవంతం చేయడం వరకు అన్నీ సాధారణ రైతుల కష్టమే. వారు ఉత్పత్తి చేసిన ఆహారమే అధిక ఉత్పత్తిగా మారి, సమాజంలో ఇతర వృత్తులు ఎదగడానికి అవకాశం కల్పించింది. ఈ అధిక ఉత్పత్తి లేకపోతే రాజులు, పూజారులు, లేఖకులు, సైనికులు వంటి ప్రత్యేక వర్గాలు పుట్టే ప్రశ్నే ఉండేది కాదు. అదే విధంగా, చరిత్రలో మనం ఆశ్చర్యంతో చూసే పిరమిడ్లు, దేవాలయాలు, కోటలు, నగర గోడలు తదితరాలన్నీ వేలాది మంది కూలీల చెమట చుక్కలతో నిర్మితమయ్యాయి. ఈజిప్టు పిరమిడ్లను నిర్మించిన వారు దేవతలు కాదు, సాధారణ కార్మికులే. మెసపోటేమియా జిగ్గురాట్లు, రోమన్ రహదారులు, ఇంకా నాగరికత రాతి నగరాలు అన్నీ శిల్పులు, రాయి కట్టేవారు, మోయువారు, పనివాళ్ల సమష్టి శ్రమ ఫలితాలు. రాజుల పేర్లు శాస



నాల్లో నిలిచినా, ఆ శాసనాలను నిలబెట్టిన రాళ్లు కార్మికుల చేతుల మీదుగా నిలబడ్డాయి. కళలు, వృత్తులు కూడా కార్మిక వర్గాల నుంచే పుట్టాయి. కార్మికుల వివిధ రకాల పనులే ప్రతితరంలోనూ నాగరికతకు ఆర్థిక బలం చేకూర్చాయి. నిజానికి, ఏరాజ్యమైనా నిలవాలంటే ప్రజల శ్రమమీదే ఆధారపడుతుంది. శ్రమ ఆగితే రాజ్యాలు కూలిపోతాయి. ఇది చరిత్ర ఎన్నోసార్లు నిరూపించింది. కాబట్టి చరిత్రను నిజంగా అర్థం చేసుకోవాలంటే, రాజుల కిరీటాల వెనుక ఉన్న కూలీల చేతులను గుర్తించాలి. నాగరికతలు అనేవిపై నుంచి కిందికి వచ్చిన అద్భుతాలు కావు... అవి కింద నుంచి పైకి నిర్మించబడిన శ్రమపర్వతాలు. సాధారణ మనిషి శ్రమే చరిత్రకు అసలైన వెన్నెముక. ఈ నిజాన్ని గుర్తించినప్పుడే మన చరిత్ర పఠనం సంపూర్ణమవుతుంది.

# దక్షిణాది రాష్ట్రాలపై బిజెపి సవతితల్లి ప్రేమ

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ్మా

**ప్రజాపక్షం/నాగర్ కర్నూల్ :** నియోజకవర్గాల పునర్విభజనలో తెలంగాణలతో పాటు దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తూ, సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. బాల నరసింహ్మా తీవ్రంగా విమర్శించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు నరసింహ్మా మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం దేశాన్ని నడపడానికి మాత్రం దక్షిణాది రాష్ట్రాల నుంచి పన్నుల ఇతర రూపాల్లో పెద్దఎత్తున సంపదను తీసుకెళ్తుందని, కానీ నియోజకవర్గాల స్థానాలు పెంపు విషయం వచ్చినప్పుడు ఉత్తరాది రాష్ట్రాలకు పెద్దపీట చేయడానికి కుట్రలు పన్నుతుందన్నారు. 1970 దశకంలో కేంద్ర నిబంధనలు, కుటుంబ నియంత్రణ నిర్ణయాలను దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక , కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాల ప్రజలు జనాభా నియంత్రణ పాటించడానికి కుటుంబ నియంత్రణను పాటించి ప్రభుత్వ నిర్ణయాలను గౌరవించారు. గడిచిన కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు సంపద సృష్టించడంలో పేదరిక నిర్మూలనలో నిరక్షరాస్యతను నిర్మూలించడంలో ఉత్తరాది రాష్ట్రాలకు అందనంత ఎత్తున దక్షిణాది రాష్ట్రాలు ఉన్నాయన్నారు. ఇవేవీ పట్టని ఉత్తరాది రాష్ట్రాలు పరిపాలన దక్షత లేని రాజకీయ చదరంగంలో పావులుగా మారిన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, రాజస్థాన్ లాంటి రాష్ట్రాలు విపరీతంగా జనాభాను కుటుంబ నియంత్రణ నిబంధనలు గాలికి వదిలేసి పెంచడం జరిగిందన్నారు. కేంద్రంలో బిజెపి సర్కార్ ఇప్పుడు జనాభా లెక్కల ప్రకారంగానే నియోజకవర్గాల పునర్విభజన స్థానాలు కేటాయిస్తామనడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అఖిలపక్ష సమావేశాలు నిర్వహించకుండా ఏకపక్షంగా మోదీ ప్రభుత్వం చేస్తున్న ఈ డీలిమిటేషన్లో దక్షిణాది రాష్ట్రాలకు ఏ మాత్రం అన్యాయం జరిగిన రాజకీయాలకతీతంగా మేధావులు ప్రజాసంఘాలు ఏకమై ఉత్తరాది రాష్ట్రాల కొమ్ముగాసే కేంద్రప్రభుత్వ వైఖరిని తీవ్రంగా వ్యతిరేకించాల్సిన చారిత్రాత్మక అవసరం ఉందన్నారు.



సిపిఐగా ఈ అంశంపై ఇప్పటికే అనేకమార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తెలియజేసిందన్నారు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలు కూడా తమ వైఖరి చెప్తున్నప్పటికీ కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని ఇది దేశ భవిష్యత్తుకు మంచిది కాదని హెచ్చరించారు. ఉత్తరాది రాష్ట్రాల పెత్తనం దక్షిణాది రాష్ట్రాలపై ఇకపై చెల్లదు అనేటువంటి రకంగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుందని, అది మరింత పెరగక ముందే కేంద్ర ప్రభుత్వం తాను చేస్తున్న తప్పును తెలుసుకొని నియోజకవర్గ స్థానాలను సమానంగా అభివృద్ధిలో భాగమైన రాష్ట్రాలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని లేనిపక్షంలో పెద్ద ప్రజా ఉద్యమాన్ని చవి చూడాల్సి వస్తుందని బాల నరసింహ్మా హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంజి, జిల్లా సమితి సభ్యులు మారేడు శివ శంకర్, గుర్రపు కుర్మయ్య, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి కొత్త రామస్వామి, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీక కొమరంభీమ్

### అడవిపై హక్కులను కాపాడుకోవటం మనందరి బాధ్యత

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఆదివాసీల ఆత్మ గౌరవ ప్రతీక కొమరం భీమ్ అని, ఆయన ఆశయాలను ప్రతీ ఒక్కరు ముందుకు తీసుకెళ్ళాలని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా అన్నారు. భద్రాద్రి జిల్లా పాల్వంచ మండల పరిధి తోగ్గూడెంలో ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాబీర్‌పాషామాట్లాడుతూ నైజాం, నవాబు ల నిరంకుశ పాలనుకు వ్యతిరేకంగా అడవి బిడ్డల హక్కుల కోసం జల్, జంగిల్ జమీన్ అనే నినాదంతో కొమరం భీమ్ అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. నేటి సమాజంలో కూడా ఆదివాసీల భూములపై అటవీ సంపదపై దాడులు జరుగుతున్నాయని, వాటిని తిప్పి కొట్టడానికి భీమ్ చూపిన పోరాట పటిమ అవసరమని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటుగా వారి హక్కుల రక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసుకోవటం ద్వారా యువతకు వారి చరిత్రను వివరించినట్టవుతుందని చెప్పారు. కొమరం భీమ్ త్యాగం వృధా పోనివ్వకుండా దోపిడీ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరూ అడుగులు వేయాలని సాబీర్‌పాషా కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, సిపిఐ మండల కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జర్పుల మోహన్‌రావు, బదావత్ శ్రీనివాస్, కొమరం ప్రకాష్, నిడమనూరి శివరామక్రిష్ణ, పొట్టెయ్య తదితరులు పాల్గొన్నారు.


## ఇచ్చిన హామీల అమలుకు సమరశీల పోరాటాలు

### ఎఐవైఎఫ్ నిర్మాణ బాధ్యులు కొండపర్తి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పాలకులు అవలంభిస్తున్న విధానాలపై, ఇచ్చిన హామీల అమలుకు యువత, విద్యార్థులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐవైఎఫ్ నిర్మాణ బాధ్యులు కొండపర్తి గోవిందరావు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈసమావేశంలో కొండపర్తి గోవిందరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయన్నారు. నిరుద్యోగులను ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ది కోసం వాడుకుంటూ హామీలు గుప్పిస్తున్నారని ఆ తర్వాత వాటిని విస్మరిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. సిపిఐ ఖమ్మం జిల్లా దండి సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువత, విద్యార్థులు పాలకుల విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో ఎఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి, సిపిఐ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎఐవైఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా ఆఫీస్ బేరర్స్ మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, శ్రావణ్ కుమార్, గనపారపు ఉపేందర్, చింతల రమేష్, కొల్లు రవి, సతీష్‌రెడ్డి, పగిడిపల్లి ఏసు తదితరులు పాల్గొన్నారు.




# దేశంలో దళితులపై పెరుగుతున్న దాడులు



### సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** దేశంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరుగుతున్నాయని సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆరోపించారు. ఈనెల 17నుండి 18 వరకు వరంగల్‌లో జరిగే దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర 2వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర మహాసభ ల పోస్టర్‌ను జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 70 సంవత్సరాల స్వతంత్ర పరిపాలనలో నేటికీ దళితులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. సమానత్వం సామాజిక న్యాయం అభివృద్ధి కుల నిర్మూలన కాగితాలకే పరిమితమై, దళిత బలహీనవర్గాల హక్కుల కోసం అభివృద్ధికి రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్లు గత కొన్ని సంవత్సరాలుగా బిజెపి ఎన్‌డిఎ సర్కార్ హరిస్తుందన్నారు. దళితులపై ఆకృత్యాలు, మానభంగాలు హత్యలు, దాడులు ఇలాంటి దుశ్చర్యలు జరుగుతున్న బిజెపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ప్రైవేటు రంగాలలో ఎస్సీలకు రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. దళితుల అభివృద్ధికి డిహెచ్‌పిఎస్ కృషి చేస్తుందని తెలిపారు. దళిత హక్కుల పోరాట సమితి రెండవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాజ్ కుమార్ కోరారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి పొన్నగంటి లావణ్య, అధ్యక్షులు రాచపల్లి భద్రయ్య, కమలాకర్, వాసంపల్లి రజిత, ఎండి.యాకుబ్ పాషా, శ్రీలత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



**పెద్దపల్లి :** సిపిఐ అనుబంధ ప్రజాసంఘం డిహెచ్‌పిఎస్ రాష్ట్ర రెండో మహాసభలు ఈ నెల 17, 18 న వరంగల్‌లో జరుగుతాయని, మహాసభలను విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుకూరి రాజారత్నం కోరారు. బుధవారం జిల్లాకేంద్రంలోని గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న దళిత వ్యతిరేక విధానాలకు పోరాట కార్యక్రమాలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడుసార్లు అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై మైనార్టీలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, మహిళలపై అత్యాచారాలు మితిమీరి పోతున్నాయని, దళితులకు రావలసిన హక్కులు కూడా ఇప్పటి వరకు అమలు చేసిన పరిస్థితులు లేవని ఆయన ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులకు మూడు ఎకరాల భూమి, దళిత బంధు ఇలా ఎన్నో హామీలతో ప్రభుత్వాలు చేపట్టిన దళితులకు మాత్రం అన్యాయాలే జరిగినాయని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు సబ్ ప్లాన్ నుంచి నిధులు విడుదల చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల్లో జరుగుతున్న దళిత వ్యతిరేక విధానాలపై మహాసభలో చర్చించి పోరాట కార్యక్రమాలు తీసుకోవడానికి జరుగుతుందని ఆయన తెలిపారు. మహాసభల విజయవంతానికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ ప్రజాసంఘాల నాయకులు పడాల కనకరాజు, రొంటాల లింగయ్య, బోంత రాజు, ఎర్ర గొల్ల చేరాలు, ఆర్.కనకయ్య, గాజుల పునేంద్ర. పుల్లూరి రామచందర్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి : సిపిఐ

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** పండించిన ధాన్యం అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నందున ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సిపిఐ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. సహకార సంఘం, ఐకెపి సెంటర్ల ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు. యాదాద్రి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలో ధాన్యం కేంద్రాలను రైతుసంఘం, సిపిఐ నాయకులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో వరి కోతలు పూర్తయినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు రోడ్ల పైన ధాన్యాన్ని ఆరబోసి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులకు మద్దతు ధరకు దూరమవుతుందని మండిపడ్డారు. దళారులు రైతుల వద్ద నుంచి తక్కువ ధరలకు వడ్లు కొనుగోలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని బ్యాగులు, తాగునీరు, రవాణా వంటి మౌలిక సదుపాయాలు కల్పించి పారదర్శకంగా కొనుగోలు నిర్వహించాలని వారు కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు , ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు తోకల రామ్‌రెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు బచ్చన గాలయ్య, చిలివేరు అంజయ్య, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, కలకొండ సంజీవ, పట్టణ కార్యదర్శి పల్లె మల్లారెడ్డి, ఈద మల్లయ్య, పల్లె గోపాల్‌రెడ్డి, భీమనపల్లి గాలయ్య, పెంటయ్య, ఎర్రోళ్ల లింగయ్య, సింగపంగ రమేష్, నోముల యాదయ్య, చిలువేరు రమేష్, పబ్బు మారయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
గురువారం
16-04-2026
www.prajapaksham.in


## తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు: కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/భీమ్‌గల్ : జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని మండలాల ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఎంపీఓలు ఇతర అధికారులతో కలెక్టర్ తాగునీటి సరఫరా తీరుతెన్నులపై సమీక్ష నిర్వహించారు. ఒక్కో మండలం వారిగా నీటి సరఫరా పరిస్థితిపై, అందుబాటులోని నీటి వనరులు, చేపట్టాల్సి ఉన్న మరమ్మతులు తదితర వాటిపై ఆరా తీసుకున్నారు. వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన జరపాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి ఎద్దడి రాకుండా ప్రణాళికా బద్ధంగా వ్యవహరిస్తూ అవసరమైన చోట్ల యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని, ఎంపీఓలు, ఏఈలు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా,ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ రాజేందర్, డీపీఓ శ్రీనివాస్‌రావు, మిషన్ భగీరథ ఈఈ రాకేష్, నియోజకవర్గ పరిధిలోని మండలాల ఎంపీడీఓలు, ఏఈలు, ఎంపీఓలు పాల్గొన్నారు.


**తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు :**
అన్ని ఆధునాతన వసతులతో ప్రభుత్వం నిర్మించదలచిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమ్‌గల్ మండలం గోన్‌గొప్పుల ప్రభుత్వఉన్నత పాఠశాల ఆవరణలో పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి అనువైన పరిస్థితులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదనపు తరగతి గదులతో పాటు ల్యాబ్ రూమ్‌లు, లైబ్రరీ, కంప్యూటర్‌గదులు, ఆర్‌ఓ ప్లాంట్, బోర్‌వెల్ తదితర నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఈఓ అశోక్ తదితరులున్నారు.

## కాలిపోయిన జొన్న పంటను పరిశీలించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/తలమడుగు : తలమడుగు మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన రైతు అజీస్ పటేల్ జొన్న పంట కాలిపోయిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరు ఎకరాల్లో సాగు చేసిన జొన్న పంట పూర్తిగా కాలిపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బాధిత రైతు అధైర్యపడొద్దని, ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం బరంపూర్ గ్రామంలో పంట నష్టపోయిన రైతు మొరుగు ప్రకాష్‌ను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. వెంటనే మండల వ్యవసాయ అధికారితో మాట్లాడి, నష్టపోయిన పంటలను సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆదేశించారు. ప్రభుత్వం కచ్చితంగా నష్టపరిహారం అందించాలని, కేవలం వరికే కాకుండా జిల్లాలోని అన్ని పంటలకు రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫసల్ బీమా పథకం అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మొట్టే కిరణ్‌కుమార్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, పార్టీ నాయకులు ప్రకాష్, రంజిత్‌రెడ్డి, అబ్దుల్లా, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత



ప్రజాపక్షం/తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న నాలుగు టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమి నుండి మొరం తరలిస్తున్న వాహనాలను గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్సై రాధిక తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అక్రమంగా మొరం తరలిస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేశామని వెల్లడించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఖనిజ సంపదను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆమె కోరారు.

## ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో సిసిరోడ్డు పనులు



ప్రజాపక్షం/నిజాంసాగర్ : మహ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు 15 లక్షల రూపాయలతో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సహకారంతో సిసి రోడ్డుపనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీంధర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి కృషిచేసిన ఎమ్మెల్యేకు గ్రామస్థులందరూ రుణపడి ఉంటారన్నారు. గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే కట్టుబడి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాములు, ఉపసర్పంచ్ బీమన్‌పల్లి శంకర్, కుమ్మరి కృష్ణ, శంకర్, అంజయ్య, లింగాల నర్సింహులు, వార్డుసభ్యులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించండి..
# సురక్షితంగా ఇంటికి చేరుకోండి

ఐజి చంద్రశేఖర్ రెడ్డి



ప్రజాపక్షం/మనోహరాబాద్ : రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కళ్లకల్ గ్రామంలో బుధవారం మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్ ఆధ్వర్యంలో అరైవ్–అలైవ్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్టీ జోన్1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి,మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, ఎస్పీ డివి శ్రీనివాస్ రావు, డీఎస్పీ నరేందర్ గౌడ్‌లు హాజరయ్యారు. వీరిని సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజుగౌడ్, ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్‌లు పూల మొక్కలు అందజేసి శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.ముందుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా రోడ్డు భద్రత పై అవగాహన సదస్సు కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఐజి చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం అరైవ్–అలైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా మాత్రమే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు ఎక్కువగా గురవుతున్నారని, హెల్మెట్ ధరించకపోవడం వల్ల మరణాలు అధికంగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. ఇంటి పెద్ద రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని, ప్రమాదం ముందస్తుగా చెప్పి రాదు అనే విషయాన్ని గుర్తుంచుకుని జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందికి,గ్రామస్తులకు హెల్మెట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు రంగ కృష్ణ, సందీప్ రెడి, ఎస్ఐ సుభాష్ గౌడ్, ఆర్డీవో జయచంద్ర రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ సెక్రెటరీ ప్రియాంక, పాలకవర్గ సభ్యులు, అధికారులు, నాయకులు, ఆటో యూనియన్ కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు వేగవంతం

జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



ప్రజాపక్షం/సంగారెడ్డి : జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ విద్యాశాఖ, డీఆర్డీఏ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన స్కూల్ కాంపౌండ్ వాల్స్ పాఠశాలల మరుగుదొడ్లు, జీపి బిల్డింగ్స్, మహిళా సంఘ భవనాల నిర్మాణ పనులు నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి పనిని నాణ్యతతో చేపట్టి ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని సూచించారు. జిల్లాలో కొనసాగుతున్న పనుల ప్రగతి సంతృప్తికరంగా లేని చోట వెంటనే చర్యలు తీసుకోవాలని పనుల్లో ఆలస్యం జరగకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో కాంపౌండ్ వాల్స్, టాయిలెట్స్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు భద్రత వాతావరణం కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా అధికారులు తమ తమ విభాగాల పనుల ప్రగతిపై వివరాలు సమర్పించారు. ఈ సమావేశంలో మహిళా శిశు, సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, డీఈఓ వెంకటేశ్వర్లు, పిడి డీఆర్డీఏ జ్యోతి పంచాయతీ రాజ్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై సిసిఎస్ టీం మెరుపుదాడి



ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : వేల్పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు సిసిఎస్ ఏసిపి మస్తాన్ అలీ ఆధ్వర్యంలో సిసిఎస్ సిబ్బంది బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. 14 టైర్ వాహనాలు రెండు, సెల్‌ఫోన్‌లు రెండు, ఇద్దరు డ్రైవర్లను స్వాధీనం చేసుకొని తదుపరి చర్య నిమిత్తం వేల్పూర్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వోకి అప్పగించినట్టు పోలీసు కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## మహిళలకు 33 శాతం రిజర్వేషన్ చరిత్రాత్మక ఘట్టం

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా




ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : 'నారీ శక్తి... దేశానికే శక్తి' అని మహిళలను ఆర్థికంగా స్వతంత్రం చేయడం, విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు పెంచడం, మహిళల హక్కులు రక్షించడం, 'నారీ శక్తి అభియాన్' ముఖ్య ఉద్దేశమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. బుధవారం నిజామాబాద్ నాందేవ్‌వాడ శివాజీచౌక్ నుంచి ఉమా మహేశ్వరాలయం వరకు నారీ శక్తి వందన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల పాత్ర కుటుంబం నుంచి దేశాభివృద్ధి వరకు కీలకమన్నారు. మహిళలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 60 ఏళ్లుగా అమలు చేయని మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని మోదీ చేస్తున్నారన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతిరెడ్డి, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ ప్రమోద్, డిప్యూటి ఫ్లోర్ లీడర్ జ్యోతి, విప్ న్యాలం సునీత, కార్పొరేటర్లు కల్పే అర్చన, వైష్ణవి, ఇప్పకాయల సుమిత్ర, కాంపల్లి మమత, ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

## భాషా, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది

ఎంపి గోడం నగేష్



ప్రజాపక్షం/ ఉట్నూర్ : మాతృభాషా, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆదిలాబాద్ ఎంపి గోడం నగేష్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీఎంఆర్సీ భవనంలో ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో 'గిరిజన అభివృద్ధిసమగ్ర వ్యూహాలు' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ టి. ప్రతాప్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సును ఎంపి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో గిరిజన విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్య ద్వారానే సామాజిక, ఆర్థిక, పర్యావరణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం వివిధ రాష్ట్రాల ప్రొఫెసర్లు తదితరులు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ మాతృభాషను, సంప్రదాయాలను మరువకూడదని హితవు పలికారు. ప్రకృతిని గౌరవించే గుణం ఆదివాసుల సొంతమని, నైతిక విలువలను కాపాడాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాదక్ అనిత, అధ్యాపకులు, రీసెర్చ్ అభ్యర్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రగ్బీ క్రీడాకారిణి రితికకు సన్మానం



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ఒడిశాలోని భువనేశ్వర్‌లో నిర్వహించిన అండర్14 జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారిని గడ్డం రితికను జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్న ఘనంగా సన్మానించారు. నిర్మల్ ఆల్ఫోర్స్ పాఠశాలలో చదువుతున్న రితిక గత జనవరిలో డోర్నకల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆమెను శాలువతో సత్కరించిన డీఈఓ, క్రీడల్లో జిల్లా ఖ్యాతిని చాటడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా క్రీడా కార్యదర్శి వన్నెల భూమన్న, రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి భూమేష్, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి రవీందర్‌గౌడ్ పాల్గొని రితికను అభినందించారు.

## సంగారెడ్డిలో న్యాయ అవగాహన సదస్సు




ప్రజాపక్షం/సంగారెడ్డి : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా సంగారెడ్డిలోని గిరిజన బాలుర న్యాయ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి బి.సౌజన్య ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు న్యాయ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశానికి సమానత్వం,స్వేచ్ఛ , న్యాయం అనే మూల సూత్రాలను అందించారని తెలిపారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరు జీవితంలో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని పిల్లల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని ముఖ్యంగా బాలల సంరక్షణ చట్టం పోక్సో చట్టం సైబర్ నే రాలు , బాల్య వివాహాలు, బాల కార్మిక నిరోధక చట్టంపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. అదే విధంగా న్యాయ పరమైన సమస్యలపై అవసరమైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ స హాయం అందుబాటులో ఉంటుందని అవసరమైతే సంగారెడ్డి జిల్లా న్యా య సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## సమగ్ర అభివృద్ధి, వసతుల కల్పనకు చర్యలు

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం ద్వారా గ్రామాలలో సమగ్ర అభివృద్ధి, వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, జిల్లా పంచాయితీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి గణపతి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదికారి డాక్టర్ అనిత, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులతో కలిసి ఎంపిక చేయబడిన ఏడు గ్రామాల సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన (పిఎంఅజయ్) కింద అమలు చేయబడుతున్న ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన (పిఎంఎజివై) ద్వారా గ్రామీణ ప్రాంతాలలో సమగ్ర అభివృద్ధి సాధించడం లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఎంపిక చేసిన గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేయడం ప్రధాన ఉద్దేశ్యంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లాలోని చెన్నూర్ మండలంలోని సుందరశాల, దండేపల్లి మండలంలోని ధర్మారావుపేట, హాజీపూర్ మండలంలోని హాజీపూర్, జైపూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామపంచాయితీ పరిధిలోని రొమ్మిపూర్, కన్నెపల్లి మండలంలోని సాలిగాం, తాండూర్ మండలంలోని చౌటుపల్లి, వేమనపల్లి మండలంలోని బయ్యారం గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఆదర్శ గ్రామాలలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు, సేవలు అందుబాటులో ఉండి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రతి వ్యక్తి తన సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకునేలా వాతావరణం కలిగిన గ్రామంగా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఎస్‌సి ప్రాధాన్య గ్రామాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడం, సామాజిక ఆర్థిక సూచికలను అభివృద్ధి చేయడం, విద్యలో ప్రవేశాలను పెంచడం, విద్యార్థులకు వసతి సదుపాయాలు కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ఆదర్శ గ్రామ అభివృద్ధి కోసం రూపొందించే కార్యాచరణ ప్రణాళికలలో గ్రామస్థాయి కమిటీ ఏర్పాటు నుండి గ్రామ అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయడం వరకు జాగ్రత్తగా వ్యవహరించాలని , నిధుల వినియోగం, పూర్తి చేయాల్సిన పనుల సంఖ్య తదితర అంశాలపై పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఎంపిక చేయబడే గ్రామాలు సాధారణంగా 40 శాతం కంటే ఎక్కువ షెడ్యూల్డ్ కులాల జనా భా కలిగి ఉండాలని కనీసం 500 జనాభా కలిగి ఉండాలని తెలిపారు. గ్రామస్థాయిలో అవసరాల అంచనా, గృహ సర్వేలు, మౌలిక సదుపాయాల లోటుపాట్ల గుర్తింపు, కుటుంబ స్థాయి అవసరాల విశ్లేషణ ప్రక్రియల ద్వారా ప్రణాళిక రూపొందించి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన ద్వారా గ్రామాలలో సమగ్ర అభివృద్ధి , మౌలిక వసతుల మెరుగుదల సామాజిక సమానత్వం, జీవన ప్రమాణాల పెరుగుదల సాధించడమే లక్ష్యం అని అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు.

## వేసవిలో తాగునీటి సమస్యపై అప్రమత్తం

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రజాపక్షం/మెదక్ : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా జిల్లాలో 21న నిర్వహించనున్న మండల, మున్సిపల్ సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. ముందస్తుగానే సభా వేదికలను సందర్శించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లతో, ఇతర మండల స్థాయి అన్ని శాఖల అధికారులతో సమావేశమై తగు సూచనలు చేయాలన్నారు. సభలు నిర్వహించే ప్రదేశాలలో తగిన నీడ, తాగునీరు వంటి కనీస వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, నూతన రేషన్ కార్డుల పంపిణీ, సన్న బియ్యం పంపిణీ, గృహ లక్ష్మి , మహాలక్ష్మి , ఇందిరా మహిళా శక్తి పథకం, కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్, సన్న వడ్ల బోనస్, ఇతర సంక్షేమ పథకాల గురించి సభలలో అవగాహన కల్పించడంతో పాటు, ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారుల వివరాలు చదివి వినిపించాలని, లబ్ధిదారులతో వారి అనుభవాలను ప్రజలకు తెలిజేసేలా చూడాలన్నారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వంటి వాటికి సంబంధించి గ్రామ సభలలో వచ్చిన అర్జీలను మండల సభలకు ముందు తప్పనిసరిగా ఆహ్వానించాలని, అందరూ భగస్వాములు అయ్యేలా చొరవ చూపాలన్నారు. సభ ప్రారంభ సమయంలో ప్రోటోకాల్ ప్రకారం ముందుగా రాష్ట్ర గేయం, వినిపించాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు ఉద్దేశించిన అరైవ్–అలైవ్ కార్యక్రమం గురించి సభల్లో తెలియజేయాలని అన్నారు. ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ గూగుల్ మీట్‌లో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డిసిహెచ్‌ఎస్ శివదయాల్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ రావు, డీఎఫ్ఓ జోజి, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, డిపిఓ యాదయ్య, ఆర్ అండ్ బి ఈఈ వేణు, ఆర్ డబ్ల్యూ ఎస్ మిషన్ భగీరథ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

**139 కిలోల గర్భిణీకి పాప జననం**



ప్రజాపక్షం/గజ్వేల్ : గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో బుధవారం ఒక అరుదైన, అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యాప్రాల్ గ్రామానికి చెందిన సాయిరాం పూజ (29) అనే గర్భిణీకి వైద్యులు సురక్షితంగా శస్త్ర చికిత్స నిర్వహించి పండంటి బిడ్డకు ప్రాణం పోశారు. బాధితురాలు 139 కిలోల ఊబకాయంతో పాటు థైరాయిడ్ సమస్యతో బాధపడుతూ వివిధ ప్రైవేట్ ఆసుపత్రులను సంప్రదించింది. అయితే వారు ఆపరేషన్ నిమిత్తం రూ. 2 లక్షల ఖర్చు అవుతుందని చెప్పడంతో అంత ఆర్థిక స్తోమత లేక వారి కుటుంబ సభ్యులు గజ్వేల్ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అన్నపూర్ణను సంప్రదించారు. ఈ క్రమంలో ఆమె ప్రత్యేక చొరవ తీసుకొని టీంగా ఏర్పడి వైద్యుల కృషితో పూజకు (3.75 కిలోలు) ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ ఊబకాయాన్ని నిర్లక్ష్యం చేస్తే పెద్ద సమస్య అవుతుందని, భవిష్యత్తులో బిపి, షుగర్, కేన్సర్ వంటి ముప్పులు పొంచి ఉంటాయని స్పష్టం చేశారు. థైరాయిడ్ ఉండడం వలన అధిక బరువు, నీరసం, అలసట, చలిని తట్టుకోలేకపోవడం, వణుకు, నిద్రలేమి, జుట్టు రాలడం, చర్మం పొడి బారడం, మలబద్ధకం. గుండె వేగంలో మార్పులు, మానసిక ఒత్తిడి లక్షణాలు ఉన్న మహిళలు వెంటనే తమను సంప్రదించాలని కోరారు. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను పూర్తి చేసిన వైద్యులు, సిబ్బందిని ఆమె అభినందించారు. ఈ బృందంలో డాక్టర్ అన్నపూర్ణ ప్రత్యేక చొరవతో డాక్టర్ మంజుల, డాక్టర్ త్రివేణి, డాక్టర్ సుశీల, డాక్టర్ సతీష్, అనస్థీషియా డాక్టర్ మైపాల్, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, ఆంజనేయులు, శ్రీలత, టెక్నీషియన్ రవీందర్, బాబి, కవిత తదితరులు సహకరించగా, జిల్లా ఆసుపత్రిలో నాణ్యమైన చికిత్స పొందాలని డాక్టర్ అన్నపూర్ణ వివరించారు. బాధిత కుటుంబ సభ్యులు ఆసుపత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మొక్కజొన్న కొనుగోలులో వేగం



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : మొక్కజొన్న కొనుగోలులో వేగం పెంచాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు.ఈ సందర్భంగా ఆయన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో మక్కల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.రైతులకు ఇబ్బంది కలుగకుండా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి, తూకం వేసిన మక్కలసంచులు త్వరగ లోడింగ్ పూర్తి చేయాలని,సంబంధిత అధికారులకు కృష్ణారావు సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్ రెడ్డి, బుస రాజేష్,ఎలిసే రాజు, గుడ ఐలాపూర్ భూమారెడ్డి, గూడ రాజారెడ్డి,పిట్టల వంశీ,రెబ్బాటి రాజా శేఖర్, తిమ్మని రాములు,సంజీవ్,కనుక జగన్, రైతులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:హైదరాబాద్‌లోని శ్రీమతి దుర్గాబాయి దేశ్ ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ శిక్షణా సంస్థలో 2026–2027 విద్యా సంవత్సరానికి గానూ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి పి. వేణుగోపాల్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలికలు, పాక్షిక అనాథలు (తల్లి లేదా తండ్రిని కోల్పోయిన వారు), నిరుపేద బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాధితులు, దివ్యాంగ బాలికలు, పదవ తరగతి పూర్తి చేసిన అర్హులైన బాలికలు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు.డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ సెమీ కండక్టర్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ల్యాండ్ స్కేప్ 3 సంవత్సరాల కోర్సులు అందుబాటులో ఉన్నాయని, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (అనాథలకు మినహాయింపు), మరణ ధ్రువీకరణ పత్రం ( అనాథలకు మాత్రమే ), బోనఫైడ్, స్టడీ సర్టిఫికేట్లు, 2పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో తమ దరఖాస్తులను సంబంధిత ధ్రువపత్రాలతో జతచేసి మే 25 లోపు పెద్దపల్లి పట్టణంలోని కోర్టు సమీపం లోని బాల రక్ష భవన్ కార్యాలయం నందు సమర్పించాలని, ఎంపికైన విద్యార్థినులకు ఉచిత విద్య, వసతి కల్పించబడుతుందని, పూర్తి వివరాలకు 9966676181, 6300398362 నంబర్లను సంప్రదించాలని జిల్లా సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## సిఎంను కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి



ప్రజాపక్షం/ధర్మపురి : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్ మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో ధర్మపురి పుర పరిధిలోని 15 వార్డులకు గాను15 వార్డుల్లో విజయం సాధించి పీఠాన్ని కైవసం చేసుకోవడం పట్ల సీఎం నాగలక్ష్మి ని ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ గడపకు చేరేలా చూడాలని,నిజాయితీ కూడిన పాలనను అందించాలని అభివృద్ధి విషయంలో సంపూర్ణ సహకారం అందిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి పట్టణానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని,క్షేత్రంలోని శ్రీ లక్ష్మి నృసింహస్వామి ఆలయ దర్శనానికి త్వరలో వస్తానని పేర్కొన్నారు.

## గడువు లోగా అభివృద్ధి పనులు పూర్తి : కలెక్టర్ కోయశ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతి పై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని విద్యా సంస్థల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, నూతన తరగతి గదుల నిర్మాణం, మౌలిక వసతుల ఏర్పాటును వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాలో నిర్మాణంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాల పనులను జూన్ నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని,ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు.పనుల వేగవంతం కోసం అవసరమైతే అదనపు షిఫ్టులు ఏర్పాటు చేయాలని, రాత్రివేళల్లో కూడా లైటింగ్ సదుపాయాలతో పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే, జిల్లాలో చేపట్టిన అంగన్వాడీ కేంద్రాల మరమ్మత్తు పనులను మే 15లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఈఈ పీఆర్ శంకరయ్య,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా లక్ష్మికిరణ్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట జిల్లా అదనపు (రెవెన్యూ)గా లక్ష్మి కిరణ్ బుధవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ హైమావతిని కలెక్టర్ చాంబర్‌లో మర్యాద పూర్వకంగాకలిసారు. జిల్లాలో రెవెన్యూ వ్యవస్థ, భూ భారతి పెండింగ్ అప్లికేషన్లు డిస్పోజల్ గురించి కాసేపు చర్చించారు. ఆనంతరం అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ అబ్దుల్ హమీద్‌ను మర్యాద పూర్వకంగాకలిసారు. జిల్లాలో ప్రజలకు రెవెన్యూ సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు.

# విత్తన కొరత రానివ్వం

* నాణ్యమైన విత్తనాలు అందించడమే ప్రధాన లక్ష్యం
* తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి
* స్వశక్తి సంఘాల మహిళలు వ్యవసాయ అధికారులు కలిసి విక్రయించేలా ప్రణాళిక.. కలెక్టర్ చిత్రా మిశ్రా




ప్రజాపక్షం/కరీంనగర్:జిల్లాలో రాబోయే వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు విత్తన కొరత లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని దీంతోపాటు నాణ్యమైన విత్తనాలను తమ సంస్థ ద్వారా అందిస్తామని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు. వానా కాలం సీజన్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే అంశంపై బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో విత్తన డీలర్లు, సహకార సంఘాల సిఇఒలు, ఎఫ్‌పిఒలు, ఏఆర్‌ఎస్‌కే ప్రతినిధులతో చైర్మన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో విత్తన సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. సీడ్స్ కార్పొరేషన్ కరీంనగర్ యూనిట్ రంగపేట నుంచి నాణ్యమైన విత్తనాలను ఉమ్మడి జిల్లా రైతులకు సరఫరా చేస్తామని తెలిపారు. ప్రైవేట్ కంపెనీలకు దీటుగా ప్రభుత్వ విత్తనాల నాణ్యత ఉంటుందని అన్వేష్ రెడ్డి గారు భరోసా ఇచ్చారు. రైతుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా సంస్థ పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం మార్కెట్లో డిమాండ్ ఉన్న సన్నారకల్లో ప్రధానంగా బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638 జేజీఎల్ 27356 రకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దొడ్డు రకాల విషయానికి వస్తే కెఎన్ఎం 118, ఎమ్‌టియు 1010 రకాలను నిల్వ ఉంచినట్లు తెలిపారు. వీటితో పాటు భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుమును పిల్లిపెసర రైతులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డీలర్లు ఎట్టి పరిస్థితులో సంస్థ విత్తనాలు అమ్మాల్సిందేనని సూచించారు. లైసెన్స్ ఉన్న ప్రతి డీలర్ తప్పనిసరిగా ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను తమ తమ దుకాణాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో వరి సాగు విస్తీర్ణం సుమారు 2.8 లక్షల ఎకరాలు వ్యవసాయ అధికారులు అంచనా వేశారని తెలిపారు. సుమారు 60వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని పేర్కొన్నారు.

**స్వశక్తి మహిళలు వ్యవసాయ అధికారులతో కలిసి కృషి చేస్తాం..** గ్రామ గ్రామానా ప్రభుత్వ విత్తనాలను రైతులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసేలా ప్రత్యేక ప్రణాళిక రచిస్తున్నామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ఇందుకోసం స్వశక్తి మహిళా సంఘాలు వ్యవసాయ అధికారులు పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ముందుకు వెళ్తామన్నారు. త్వరలో జిల్లా స్థాయిలో ప్ర త్యేక సమీక్ష సమావేశం నిర్వహించి ప్రభుత్వ విత్తనాల విక్రయంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మోసపూరిత ప్రకటనల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలోఆక్‌డిఒ కె.మహేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా సహకార అధికారి సీడ్ కార్పొరేషన్ మేనేజర్ రాజీవ్ కుమార్, కరీంనగర్ ప్రాంతీయ మేనేజర్ విష్ణు వర్ధన్ రెడ్డి, జిల్లా మహిళా సమైక్య అధ్యక్షురాలు సబిత, ఎడిఎలు, మండల వ్యవసాయ అధికారులు, విత్తన అధికారులు శ్రీకాంత్, మౌనిక, డీలర్లు, ఎఫ్‌పిఒ మహిళా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఠాగూర్ సినిమాను మరిపించిన 'వన్' హాస్పిటల్ వైద్యుల తీరు

ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్

ప్రజాపక్షం/కరీంనగర్ :నగరంలోని కోర్టు రోడ్డులోని వన్ హాస్పిటల్ వైద్యుల తీరు ఠాగూర్ సినిమాను మైమరిపించిందని చనిపోయిన మహిళలకు వైద్యం అందిస్తున్నట్లు నటిస్తూ చికిత్స పేరుతో డబ్బులు వసూలు చేసే కార్యక్రమానికి వన్ హాస్పిటల్ యాజమాన్యం తెరలేపిందని వన్ హాస్పిటల్ చర్య మానవత్వాన్ని పూర్తిగా దెబ్బ తీసే విధంగా ఉందని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భాంవడ పల్లి యుగంధర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. వేములవాడ మండలం శాత్రాజూపల్లికి చెందిన సాహెబ్ బీ (60) గుండె సంబంధిత వ్యాధితో ఈనెల 10వ తేదీన నగరంలోని వన్ ఆసుపత్రిలో యాంజియోగ్రామ్ చికిత్స నిర్వహించి అనంతరం వివిధ సాకుల పేరిట మంగళవారం ఆపరేషన్ చేశాక, తర్వాత మహిళ వైద్యం వికటించి సాహెబ్ బి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యంతో క్రమేపి వన్ హాస్పిటల్‌లో వైద్యం వికటిస్తూ చనిపోయే వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుందని, తక్షణమే ఈ ఆసుపత్రి అనుమతులను రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆసుపత్రి ఎండి మహేష్ రెడ్డి తో పాటు ఈ ఆపరేషన్లో పాల్గొన్న వైద్యులందరిపై హత్య కేసు నమోదు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇంకా ఎంతమంది చనిపోతే ఈ ఆసుపత్రి గుర్తింపును అనుమతులను రద్దు చేస్తారని ఆయన జిల్లా అధికారులను ప్రశ్నించారు. గడచిన వారం రోజుల్లో ఇద్దరూ వేములవాడకు సంబంధించిన వాసులు వైద్యం కోసం వచ్చి చనిపోయినట్లు విమర్శించారు. నిర్లక్ష్యంగా వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలను తీస్తున్న ఆస్పత్రిని తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన మృతదేహానికి వైద్యం చేస్తున్నట్లు నటిస్తూ చికిత్స పేరుతో కుంటి సాకులు చెబుతూ డబ్బులు వసూళ్ల పర్వానికి ఆసుపత్రి యాజమాన్యం తెరలేపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలను తీస్తున్న ఆసుపత్రి యాజమాన్యం ప్రాణాలు పోయాక కొందరు బ్రోకర్లను పెట్టుకొని బేరసారాలకు దిగుతోందని విమర్శించారు. ప్రజల ప్రాణాలను తీస్తూ నిబంధనలు పాటించని వన్ ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆసుపత్రి ముందు అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని యుగంధర్ హెచ్చరించారు.

## బిఆర్ఎస్ పథకాలు క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి




ప్రజాపక్షం/జగిత్యాల:జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 20న నిర్వహించనున్న తెలంగాణ సాధకుడు, మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రమణ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పిలుపునిచ్చారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కెసిఆర్ బహిరంగ సభ సన్నాహక సమావేశాన్ని ముఖ్య నాయకులతో కలిసి నిర్వహించారు. అనంతరం జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ,కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్,ఎమ్మెల్సీ రమణ,మాజీ మార్క్ఫెడ్ చైర్మన్ లోక బాబు రెడ్డి , మాజీ జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ లు మాట్లాడుతూ ఈ సభ తో బిఆర్ఎస్ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల్లో మరింత నమ్మకం పెంపొందించే వేదికగా మార్చాలని తెలిపారు.ఈ సభలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ లో చేరబోతున్నారని పేర్కొన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వాటి ప్రయోజనాలను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహిస్తూ విస్తృత ప్రచారం చేయాలని, యువతను పెద్ద ఎత్తున సభకు తీసుకురావాలని నాయకులు కోరారు. కార్యకర్తలంతా ఐక్యతతో కృషి చేసి సభను ఘన విజయంగా నిలపాలని, కార్యక్రమం నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు.సభను చారిత్రాత్మక విజయంగా నిలిపి పార్టీకి మరింత బలం చేకూర్చాలనిఆకాంక్షించారు.ఈ సమావేశంలో వివిధ మండలాల నాయకులు ఉన్నారు.

## కోట 'రెజోనెన్స్' విద్యార్థినిని అభినందించిన ఎమ్మెల్యే




ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:కరీంనగర్ లోని కోట ఇన్స్టిట్యూట్ వారి రెజోనెన్స్ జూనియర్ కాలేజీ ఇంటర్ ఫలితాల ద్వారా రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చిపెట్టిందని , ఇది కరీంనగర్‌కు గర్వకారణమని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కరీంనగర్ లోని రేకుర్తిలో గల కెపిఎస్ హైస్కూల్‌లో కోట రెజోనెన్స్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ఫస్ట్ మార్కులు వచ్చిన సంధర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి మాట్లాడారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చిన అంజిరెడ్డి కరీంనగర్‌కు రాష్ట్ర స్థాయిలో కీర్తి తీసుకురావడం గర్వకారణమన్నారు. మరో అతిధి ట్రస్మా అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి.అంజిరెడ్డి క్రమశిక్షణ అతనిని బ్రాండ్ ఇమేజ్‌కు దగ్గరగా తీసుకెళ్లిందని అన్నారు. కోట విద్యాసంస్థల చైర్మన్ డా.అంజిరెడ్డి మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థులు ఎక్కడికో వెళ్లకుండా స్మార్ట్ క్లాస్ విద్యా విధానం ద్వారా స్థానికంగానే మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో కోట విద్యాసంస్థలను స్థాపించి తొలి ప్రయత్నంలోనే రాష్ట్రస్థాయి మార్కులు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో గాలి సౌమ్యశ్రీ 469, ద్వితీయ సంవత్సరంలో కె.సహన శ్రీ 995, ద్వితీయ సంవత్సరం బైపిసిలో జి.రోషిని 993, బైపిసి ప్రథమ సంవత్సరంలో పి.శరణ్య 438లను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్, ట్రస్మా అధ్యక్షుడు పూల గుచ్చం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కోట విద్యాసంస్థల చైర్మన్ డా.డి.అంజిరెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ - పెళ్లి వివాదం..?

''ధూల్మిట్టలో యువతి అనుమానాస్పద మృతి'' •యువతి మృతి వెనుక అసలు కారణం ఏంటి..?•ఉరివేసుకున్న స్థితిలో మృతదేహం... అన్నికోణాల్లో దర్యాప్తు • శిల్ప మృతిపై ధూల్మిట్టలో విషాదఛాయలు



ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట : పెళ్లి చర్చల తర్వాత ఓ యువతి మృతి చెందిన ఘటన మిస్టరీగా పలు అనుమానాలకు తావిస్తోంది. సిద్దిపేట జిల్లా మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ధూల్మిట్ట మండల కేంద్రానికి చెందిన సుందరగిరి శిల్ప (20), ఇంట్లో ఉరి వేసుకున్న స్థితిలో మృతిచెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ మృతికి '' ప్రేమ పెళ్లి వివాదమే '' ముఖ్యమైన కారణంగా మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదులో స్పష్టంగా తెలుస్తోంది. మద్దూరు పోలీసులు, మృతురాలి తల్లి ఫిర్యాదు; స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గత కొంత కాలంగా కొత్తూర్‌లోని ఫిషర్ సైంటిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో మృతురాలు సుందరగిరి శిల్ప పనిచేస్తుంది. పెళ్లి విషయమై కుటుంబ సభ్యులు ఈ నెల 12వ తేది సాయంత్రం ఫోన్ ద్వార ఇంటికి పిలవడంతో మరుసటి రోజు 13 మధ్యాహ్నం సమయంలో ధూల్మిట్టకు శిల్ప చేరుకుంది. 14 ఉదయం సమయంలో కుటుంబ సభ్యులు పెళ్లి విషయం గురించి మాట్లాడినప్పుడు, శిల్ప తనకు పని చేసే చోట ఒక వ్యక్తిని ప్రేమిస్తున్నట్లు తెలిపింది. దీనిపై శిల్పను తల్లిదండ్రులు సుందరగిరి లక్ష్మి, బాబులు మందలించి వారివారి పనులకు వెళ్లిపోయారని, అదే రోజు సాయంత్రం సుమారు 6 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి చూడగా, శిల్ప ఇంట్లో చీరతో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మద్దూరు పోలీసులకు మృతురాలు శిల్ప తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై మద్దూరు పోలీసులు కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. శిల్ప మృతితో ధూల్మిట్టలో విషాదఛాయలు నెలకొన్నాయి.

**జీవితంలోఎదురయ్యే సమస్యలు క్షణిక ఆవేశానికి యువత గురికావద్దు :** జీవితంలో సమస్యలు, భావోద్వేగాలు, కుటుంబ విభేదాలు సహజమేనని పెద్దలు సూచిస్తుంటారు. తాత్కాలిక ఆవేశంలో తీసుకునే నిర్ణయాలు యువతకు శాశ్వత నష్టాలకు దారితీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సమస్యలు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులు, లేదా నమ్మకమైన వ్యక్తులతో మాట్లాడటం ద్వారా పరిష్కారం సాధ్యమవుతుందని, ప్రాణం అమూల్యమని యువత గుర్తించుకోవాలని పెద్దలు పిలుపునిస్తున్నా రు.

## నిబంధనలకు అనుగుణంగా ఎంపిక

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : ప్రభుత్వ పథకాలకు నిబంధనలకు అనుగుణంగా అర్హులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘ అభివృద్ధి సంస్థ (ఎస్సీ కార్పొరేషన్) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ ఎస్సీ యాక్షన్ ప్లాన్2025–26 కి సంబంధించిన అంశాలు, మండలవారీగా లక్ష్యాలను కమిటీ ముందు ప్రవేశ పెట్టి వారి సంయుక్తంగా ఆమోదం పొందటం జరిగింది. లబ్ధిదారుల ఎంపిక కోసం ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025–26 గైడ్ లైన్స్ ప్రకారంగా మండలస్థాయి ఎంపిక కమిటీని ఏర్పాటు చేశారు. ఈడీ ఎస్సీ కార్పొరేషన్ కింద వ్యవసాయ రంగం ( సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్), పశు పోషణ రంగం ( 2 మిల్క్ అనిమల్స్), రవాణా రంగం ఈవీ త్రీ వీలర్స్ (గూడ్స్), ఈవీ త్రీ వీలర్స్ ఈ వీ టు వీలర్స్ పరికరాలు సబ్సిడీ పై అందుబాటులో ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. లబ్ధిదారుల, మండల స్థాయిలో లక్ష్యాల కేటాయింపు అన్నీ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత సమయంలో చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, జనరల్ మేనేజర్ (జిల్లా పరిశ్రమలు) హనుమంతు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి , లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మల్లికార్జున రావు పాల్గొన్నారు.

## 'మా భూమి' తీసుకుంటే మాకు చావే గతి

*మా అనుమతి లేకుండా మా భూమి ఆక్రమిస్తున్నారు* అధికారులకు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా స్పందన కరువు* ప్రభుత్వం మాకు న్యాయం చెయ్యాలి



ప్రజాపక్షం/రాయికల్ : మాభూమి తీసుకుంటే మాకు చావే శరణ్యం అంటూ రాయికల్ పట్టణంలోని భూ రైతులు బుధవారం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో తమ గోడును వెల్లబోసుకున్నారు. భూ బాధిత రైతులు కుర్మ మల్లారెడ్డి,కుర్మ నారాయణ రెడ్డి,కుర్మ ప్రేమ్ రెడ్డి లు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకెపి భవనం దగ్గర ఉన్న మా యొక్క స్వంత 20 గుంటల భూమిని ప్రభుత్వ అమృత్ పథకంలో ట్యాంక్ నిర్మాణం కోసం మా అనుమతి లేకుండ నియంతృత్వంతో అధికారులు మా పంట భూమిని లాక్కునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు.అధికారులు మేము ఇట్టి భూమిని ఆమోదించామని ఇచ్చే నష్ట పరిహారం తీసుకుని రైతులు భూమిని మాకు అప్పజెప్పాలని రైతులమైన మాకె అల్టిమేటం ఇచ్చారని బాధపడ్డారు.మాకు ఉన్నదే ఈ కొద్దీ భూమి ఇది ఆక్రమించుకుంటే మాబ్రతుకులు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేసారు.మాకు న్యాయం చెయ్యాలంటూ జిల్లా కలెక్టర్ ,జెసి కి ,ఎమ్మెల్యే ఎంపీ లకు విజ్ఞప్తి చేసినప్పటికిని వారు చెప్పున్నప్పటికీ స్పందన లేదని అన్నారు. పట్టణంలోని రెవెన్యూ సర్వే నెంబర్ లు [ 988/2/1/1/,] [988/2/1/2/1] [988/2/1/3/1] భూమిలో ఇప్పటి వరకు మేము గ్రామ అభివృద్ధి కోసం ఐకెపి భవనం కు ఇచ్చామని మా ద్రాతృత్వాన్ని గుర్తించి ప్రభుత్వ అధికారులు మాకు న్యాయం చేయవలసింది గా పోయి అన్యాయంగా ఉన్న పంట భూమిని లాక్కువాలనుకోవడం సమంజసం కాదని తెలిపారు. ఇకనైనా మా భూమిలో పెట్టిన ప్రతిపాదనను అధికారులు విరమించుకోవాలని డిమాండ్ చేసారు. లేదంటే మాకు చావే శరణ్యమని విలేకరుల సమావేశంలో తెలిపారు.అనంతరం మాజీ సర్పంచ్ తురగ రాజారెడ్డి మాట్లాడుతూ బలవంతంగా నిరుపేద రైతులు భూమిని లాక్కోవాలని చూడడం సరికాదని అన్నారు. గతంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అధికారులు సహకారంతో రైతులమే భూములు దానమిచ్చి గ్రామ అభివృద్ధికి దోహద పడ్డామని,ఇలా బలవంతంగా భూమిని లాక్కోవడం ఎక్కడ చూడలేదని రైతులకు సంబంధం లేకుండా భూమిని సర్వే చేయడం గ్రామ సభ పెట్టి ఆమోదించడం నష్టపరిహారం తక్షణమే ఇస్తామనడం కుట్ర పూరితంగా అధికారులు వ్యవహరిస్తున్నారు.వేరే చోట దాత భూమిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికిని ఇదే భూమి కావాలని అధికారులు పట్టు పట్టడం సరికాదని తక్షణమే ఈ పేద రైతుల భూమిలో పెట్టిన అమృత్ ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రాము లింగ రెడ్డి ,జలపతి లక్ష్మి రెడ్డి ,లింగా రెడ్డి ,వేణు,గంగాధర్ ,సురేందర్ పాల్గొన్నారు.

# రీల్

నూతన నటీనటులతో తెరకెక్కిన సినిమా. 'తిమ్మరాజుపల్లి టీవీ'. వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఈ నెల 17న థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు.



## 'మీర్జాపురంరాణి కృష్ణవేణి' నేటి తరానికి స్ఫూర్తి

అలనాటి నటి, గాయని, నిర్మాత కృష్ణవేణమ్మ జీవితాన్ని గ్రంథస్తం చెయ్యడం ఎంతో సంతోషంగా ఉందని, ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. 'మీర్జాపురంరాణి కృష్ణవేణి' పుస్తకాన్ని రచయిత భగీరథ, నిర్మాత ఎన్.ఆర్. అనురాధాదేవి వెంకయ్య నాయుడుకి బహూకరించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ 'తెలుగు సినిమా ప్రారంభ రోజుల్లో బాల నటిగా ప్రవేశించి, కథానాయికగా ఎదిగిన కృష్ణవేణమ్మ మీర్జాపురం రాజావారిని వివాహం చేసుకోవడంతో ఆమె జీవితం అనూహ్యమైన మలుపు తిరిగింది' అని చెప్పారు. 'కృష్ణవేణమ్మ కేవలం నటి, గాయనిగానే కాదు అభిరుచి కలిగిన నిర్మాత, ఎన్నో సందేశాత్మక సినిమాలను రూపొందించారు. ఎన్.టి.రామారావు ని 'మనదేశం' సినిమాతో పరిచయం చేశారు. అందుకే ఆమె అంటే నాకు గౌరవం' అని వెంకయ్య నాయుడు చెప్పారు. 'అక్కినేని నాగేశ్వర రావు, అంజలీదేవి, ఎస్.వి.రంగారావు, రేలంగి వెంకట్రామయ్య, సిహెచ్.నారాయణ రావు, ఘంటసాల, రమేష్ నాయుడు, త్రిపురనేని గోపీచంద్, తాపీ ధర్మారావు, చిత్రపు నారాయణ మూర్తి లాంటి వారికి చేయూత నిచ్చిన కృష్ణవేణమ్మ చిరస్మరణీయురాలు' అని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. 'మీర్జాపురంరాణి కృష్ణవేణి 'పుస్తకాన్ని రచించిన సీనియర్ జర్నలిస్ట్ భగీరథను, నిర్మాత ఎన్ .ఆర్ .అనురాధాదేవిని వెంకయ్య నాయుడు అభినందించారు.



## ఎమ్మెస్ రాజు దర్శకత్వంలో 'అగధ'

ఎమ్మెస్ రాజు అంటే ఒక బ్రాండ్. సుమంత్ ఆర్ట్స్ పతాకంపై ఆయన నిర్మించిన 'శత్రువు, దేవి, మనసంతా నువ్వే, ఒక్కడు, వర్షం, నువ్వొస్తానంటే నేనొద్దంటానా 'చిత్రాలు ఒక ట్రెండ్ సృష్టించాయి. దర్శకునిగా కూడా ఆయన తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. 'డర్టీ హరి', 'మళ్లీ పెళ్లి' చిత్రాలు అందుకు నిదర్శనాలు. ఒకసారి చేసిన కాన్సెప్ట్‌ని మళ్లీ మళ్లీ అనుసరించటం ఆయనకు ఇష్టం ఉండదు. ఏం చేసినా ప్రేక్షకులకు ఒక యూనిక్ అనుభవం ఇవ్వాలన్నదే ఆయన లక్ష్యం. అందుకోసమే ఆయన 'అగధ'ను సిద్ధం చేస్తున్నారు. 'అగధ' ప్రమోషన్స్ విభిన్నంగా మొదలుపెట్టారు. ఇందుకు సంబంధించి ఒక ఇంట్రెస్టింగ్ ఫన్నీ వీడియోను విడుదల చేశారు. ఇద్దరు దొంగలు ఎమ్మెస్ రాజు ఆఫీసులో దొంగతనానికి వెళ్లడం, అక్కడున్న సినిమా పోస్టర్స్‌ని చూస్తూ ఆ దొంగలు ఆ సినిమా జ్ఞాపకాలను తలుచుకోవడం, చివరగా ఒక పోస్టర్‌ని చూసి అక్కడ ఏదో ఉందని భయపడటంతో ఆ వీడియో ఎండ్ అవుతుంది. తీరా అక్కడ ఉన్నది 'అగధ' సినిమా పోస్టర్. ఆ పోస్టర్‌ను విడుదల చేశారు. ఒక చీకటి గుహ చుట్టూ వెలుగుతున్న కొన్ని కాగడాలు చీకటే కాదు ఆ సన్నని వెలుతురు కూడా భయానకంగా ఉంది. అక్కడ ఒక భారీ విగ్రహం. మొహమంతా మిస్టిక్‌గా ఉంది. ఆ విగ్రహానికి 12 చేతులు. ఈ విగ్రహం ముందు & వెనుతిరిగి ఉన్న ఒకమ్మాయి . ఆమె వేషధారణ కూడా చాలా విభిన్నంగా ఉంది.తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రూపొందుతున్న 'అగధ' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ 'ఇదొక మిస్టికల్ డివైన్ థ్రిల్లర్. ఈ చిత్రానికి సంగీతం: మిక్కిన్ అరుల్ దేవ్, ఛాయాగ్రహణం : నాని చమిడిశెట్టి, ఎన్. వి. ఎన్. సుబ్బరాజ్ , నిర్మాత: కాశీ విశాలాక్షి బలుసు, రచన దర్శకత్వం: ఎమ్మెస్ రాజు.



## పాన్ ఇండియా చిత్రాలు స్వయంభు, నాగబంధంలో నభా నటేష్

అప్ కమింగ్ హీరోయిన్ నభానటేష్ రెండు సినిమాలతో అలరించబోతోంది. ఈ సమ్మర్‌లో ఆమె నటించిన రెండు చిత్రాలు కూడా పాన్ ఇండి యా స్థాయిలో విడుదల నేపథ్యంలో ఈ రెండు సినిమాలపై భారీగా ఆశలు పెట్టుకుంది. ఈ రెండు సినిమాల్లో ఏ ఒక్కటి హిట్ అయినా తన కెరీర్‌కు ప్లస్ అవుతోందని నభానటేష్ భవిస్తోంది. ఆమె నటించిన రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలు స్వయంభు, నాగబంధం ఈ వేసవి విడుదలకు సిద్ధమవుతున్నాయి. భిన్నమైన కథా నేపథ్యాలతో తెరకెక్కిన ఈ రెండు చిత్రాల్లో నభా డిఫరెంట్ రోల్స్‌లో ప్రేక్షకుల్ని అలరించబోతోంది. నాగబంధం చిత్రంలో పార్వతి క్యారెక్టర్ లో, స్వయంభు చిత్రంలో సుందర వల్లి అనే యువరాణి పాత్రలో ఆమె నటిస్తోంది. స్వయంభు, నాగబంధం చిత్రాల్లోని కంటెంట్ ఆడియెన్స్‌కు రీచ్ అయితే నభా నటేష్ హీరోయిన్‌గా మరో స్థాయికి వెళ్లడం ఖాయమని అనుకోవచ్చు. బ్యూటిఫుల్, టాలెంటెడ్ హీరోయిన్ నభానటేష్ తన కొత్త స్టిల్స్‌తో ఆకట్టుకుంటోంది. నాలుగేళ్ల క్రితం ఆమె భుజానికి గాయమైంది. 2022లో నభాకు మల్టీపుల్ ఫ్రాక్చర్స్ అయ్యాయి. ఎడమ భుజానికి గాయమైంది. ఆ ప్రమాదం తర్వాత తన కానడెంట్ కోల్పోకుండా ఆ పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొన్న మళ్లీ బిజీ హీరోయిన్‌గా మారిపోయింది.

## గ్యాంగ్ స్టర్ చిత్రాలకు అడ్రస్, గైడ్‌గా 'టాక్సిక్'



లాస్ వెగాస్లో నిర్వహించిన సినిమా కాన్ 2026 కార్యక్రమంలో రాకింగ్ స్టార్ యశ్ సందడి చేశారు. 'టాక్సిక్: ఎ ఫెయిరీ ఫర్ గ్రోన్ అప్స్' గురించి వేదికపై యశ్ మాట్లాడిన మాటలు, చెప్పిన విషయాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. 'రామాయణ' సహ నిర్మాత నమిత్ మల్హోత్ర, యశ్ ఇద్దరూ కలిసి 'టాక్సిక్' గురించి ఎన్నో విషయాల్ని పంచుకున్నారు. గ్యాంగ్ స్టర్ జానర్ చిత్రాలకు ఇకపై అడ్రస్‌గా, గైడ్‌గా 'టాక్సిక్' ఉంటుందని అభివర్ణించారు. అంతర్జాతీయ వేదికపై యశ్ మాట్లాడుతూ 'మొదటిసారిగా ఇంగ్లీష్లో మేం సినిమాని చిత్రీకరించాం. 'టాక్సిక్'లో ఎన్నో లేయర్స్ ఉంటాయి. ఇది రెగ్యులర్ యాక్షన్, గ్యాంగ్ స్టర్ చిత్రం కాదు. పైకి చూస్తుంటే.. ఇదొక యాక్షన్, గ్యాంగ్ స్టర్ మూవీలా మాత్రమే కనిపిస్తుంది. గొప్ప టెక్నీషియన్, గొప్ప దర్శకురాలు గీతూ మోహన్ దాస్తో పని చేయడం నాకెంతో ఆనందంగా ఉంది. ఆమె గ్యాంగ్ స్టర్ చిత్రాలకు ఓ కొత్త దారి వేసినట్టుగా అనిపిస్తుంది. ఈ ప్రపంచంలో ప్రతీ వంద కిలోమీటర్లకు భాష, సంస్కృతి, సంప్రదాయాలు వేరుగా ఉంటాయి అన్నారు. గీతూ మోహన్దాస్ దర్శకత్వంలో మాస్టర్ మైండ్ క్రియేషన్స్, కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించిన 'టాక్సిక్: ఎ ఫెయిరీ ఫర్ గ్రోన్ అప్స్' చిత్రంలో యష్, నయనతార, కియారా అద్వానీ, హ్యూమా ఖురేషి, రుక్మిణి వసంత్, తారా సుతారియా తదితరులు నటించారు. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది



## 'అటు ఫ్రెండ్ ఇటు లవర్' ట్రైలర్ లాంచ్

ఫ్యాషన్ హంట్ సమర్పణలో ప్రిన్స్ ఫిల్మ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద నజీం ఎస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'అటు ఫ్రెండ్ ఇటు లవర్'. ఈ సినిమాతో ప్రిన్స్, సాంచి కశ్యప జంటగా తెరకు పరిచయం కాబోతోన్నారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రాబోతోన్న ఈ మూవీకి సంబంధించిన ట్రైలర్ను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో ప్రిన్స్ మాట్లాడుతూ 'మేం అంతా ఎంతో కష్టపడి' అటు ఫ్రెండ్ ఇటు లవర్ సినిమాని తీశాం. అందరి సహకారంతోనే చిత్రాన్ని పూర్తి చేయగలిగాం. దర్శకుడు ఈ మూవీని ఎంతో గొప్పగా చిత్రీకరించారు. ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలో మాకు సపోర్ట్‌గా నిలిచిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. తెలుగు ఆడియెన్స్ మంచి చిత్రాల్ని ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారు. సాంచీతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. మా సినిమాని ఇలానే అందరూ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను అని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ ప్రణీత్ మాట్లాడుతూ ..''అటు ఫ్రెండ్ ఇటు లవర్' మ్యూజిక్ ఇవ్వడం ఆనందంగా ఉంది. ఇదొక డిఫరెంట్ స్టోరీ. ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది' అని అన్నారు.కెమెరామెన్ రాము రాయల్ మాట్లాడుతూ 'అటు ఫ్రెండ్ ఇటు లవర్'లో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్ : లోకేష్ కుమార్ కదలి, డీఓపీ : రాము రాయల్.

## రాజ మహేంద్రవరంలో 'భోగి' కొత్త షెడ్యూల్



శర్వానంద్ 'భోగి' చిత్రంతో హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. పాన్‌ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా కోసం శర్వానంద్, సంపత్ నందిని తొలిసారిగా చేతులు కలిపారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె.రాధామోహన్ భారీ నిర్మాణంతో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. ఫస్ట్‌లుక్ విడుదలకు లభించిన అద్భుత స్పందన నేపథ్యంలో, చిత్ర బృందం ఇప్పుడు రాజమండ్రిలో అత్యంత కీలకమైన, లెన్తీ షెడ్యూల్‌ను ప్రారంభించింది. షూటింగ్ రంప చోడవరం అడవులలో షూటింగ్ జరుగుతోంది. ఎ బ్లడ్ ఫెస్ట్ అనే ఆకట్టుకునే ట్యాగ్లైన్తో వస్తున్న 'భోగి' చిత్రంలో శర్వానంద్ ఒక సరికొత్త అవతార్ లో కనిపిస్తున్నారు. ఇప్పటికే ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ అంచనాలు పెంచింది. దర్శకుడు సంపత్ నంది 1960లో ఉత్తర తెలంగాణమహారాష్ట్ర సరిహద్దు నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వాస్తవికమైన కథనం, పవర్ ఫుల్ నేపథ్యంతో ఈ చిత్రం ఇంటెన్స్ డ్రామాతో గొప్ప ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనుంది. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. కిరణ్ కుమార్ మన్నె ప్రొడక్షన్ డిజైన్, కిషోర్ కుమార్ అరోకియా సినిమాటోగ్రఫీ, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.రక్షా బంధన్ పండుగ సందర్భంగా ఆగస్ట్ 28న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. చార్మింగ్ స్టార్ శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి, రోహిత్ పాఠక్ నటిస్తున్నారు.

## నామినేటెడ్ పదవుల్లో బిసిలకు జనాభా దామాషా ప్రకారం అవకాశం కల్పించాలి



బిసి హక్కుల సాధన సమితి విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** త్వరలో భర్తీ చేయనునన నామినేటెడ్ పదవుల్లో బిసిలకు జనాభా దామాషా ప్రకారం అవకాశం కల్పించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్‌లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయం లో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బాపురాజుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎంఎల్‌ఎ, ఎంపి ఎన్నికల సందర్భంగా గెలుపు గుర్రాలకి టికెట్లు ఇస్తామని చెప్పి బిసిలకు తక్కువ స్థానాలు ఇచ్చి అన్యాయం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవుల్లో బిసిలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి న్యాయం చేస్తామని చెప్పి తూ తూ మంత్రంగా ప్రాధాన్యత లేని పదవులను బిసిలకు కట్టబెడికేవలం ఒకే ఒక కులానికి అన్ని పదవులు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీకి సంబంధం లేని వ్యక్తులకు కార్పొరేషన్ పదవులు కట్టబెడుతూ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీని నమ్ముకున్న బిసిలకు మాత్రం మొండి చేయి చూపిస్తున్నారన్నారు. . స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌కు సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండడంతో పార్టీ పరంగా 42 శాతం స్థానాలు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ దానికి కూడ నిలబెట్టుకోలేకపోయిందని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ జనరల్ స్థానాల్లో పోటీ చేసిన బీసీలను ప్రజలు గెలిపించారని ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ మరియు మున్సిపల్ ఎన్నికల్లో 61శాతం గెలవడం ఇది బిసిల చైతన్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికైన కాంగ్రెస్ పార్టీ బిసిల చైతన్యాన్ని గుర్తించి త్వరలో భర్తీ చేసే నామినేటెడ్ పదవుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు . లేకపోతే వచ్చే ఎన్నికలో బిసిల తమ సత్తా చాటుతారని హెచ్చరించారు.

## మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకమని బిజెపి దుష్ప్రచారం చేస్తోంది

భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పెంపు, మహిళా రిజర్వేషన్లపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో, ఇండియా కూటమి మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమని బిజెపి దుష్ప్రచారం చేస్తోందని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆల్ పార్టీ మీటింగ్ నిర్వహించి, అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలని మల్లికార్జున ఖర్గే సూచించారని తెలిపారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చాయని, అమలు విషయంలో కూడా అన్ని పార్టీలను భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ అమలులో 2026 జనగణనను పరిగణనలోకి తీసుకుంటామని కేంద్రం చెప్పిందని గుర్తు చేశారు. ప్రస్తుత 543 లోక్‌సభ సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అయితే ప్రోరేటా విధానంలో డీలిమిటేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే నిధుల పంపిణీలో దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతున్నాయని విమర్శిస్తూ, పది రోజులు ఆగితే కేంద్రానికి నష్టం ఏమిటి? అని ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదనను ప్రస్తావిస్తూ 50 శాతం ప్రోరేటా, 50 శాతం రాష్ట్రాల ఆర్థిక అభివృద్ధి ఆధారంగా సీట్ల పెంపు చేయాలని సూచించారని తెలిపారు. ఈ అంశంపై ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆయన లేఖలు రాసినట్టు చెప్పారు. కేంద్రం ప్రతిపాదించిన 850 పార్లమెంట్ సీట్ల పెంపుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, పార్లమెంట్‌లో బలం ఉందని బుల్డోజ్ రాజకీయాలు చేయొద్దని హెచ్చరించారు. 2026 జనగణనను పరిగణనలోకి తీసుకుంటారా లేదా అనేది స్పష్టం చేయాలని చామల కిరణ్‌కుమార్ రెడ్డి కోరారు.

## జిలిటిన్ స్టిక్స్ పేలుడులో నలుగురి దుర్మరణం

27 మందికి గాయాలు





**కదిరి టౌన్ :** ఎపిలోని సత్యసాయి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన జిలిటిన్ స్టిక్స్ పేలి నలుగురు మృతిచెందారు. 27 మంది గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు పురుషులు, మహిళ, చిన్నారి ఉన్నారు. క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పేలుడు ధాటికి ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఓ కూలీ ఇంట్లో నిల్వ ఉంచిన జిలిటిన్ స్టిక్స్ పేలాయి. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంత్రి సత్యకుమార్ ఘటనపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. జిలిటిన్ స్టిక్స్, అమ్మోనియం సల్ఫేట్ వల్లే పేలుడు జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. వెంకన్న, సంపత్ కుటుంబం కొండల్లో జిలిటిన్ స్టిక్స్ పేల్చి రాళ్లుగా మార్చి విక్రయిస్తోంది. పేలుడు పదార్థాలు, డీజిల్ నిల్వ ఉంచుకున్నట్లు అధికారులు గుర్తించారు. పేలుడు ప్రమాదంపై సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. పేలుడు ప్రభావంతో ఇంటి పైకప్పు కూలిపోవడంతో పాటు సమీపంలోని మూడు ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయని తెలిపారు. ఈ ఘటన అత్యంత దురదష్టకరమని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మతుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేసియా, క్షతగాత్రులకు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని ఆయన కోరారు. బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని బీజేపీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు గోరంట్ల మోహన్ శేఖర్ కూటమి ప్రభుత్వాన్ని కోరారు. పేలుడు ఘటనపై శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ స్పందించారు. ఈ ప్రమాదంలో నలుగురు మరణించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. పేలుడు పదార్థాల వల్ల ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు.

## తీవ్రంగా ప్రతిఘటిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సారించాలని కెటిఆర్ సూచించారు. ఫిర్జాదిగూడ సమావేశంతో పాటు తనను కలిసిన మీడియాతో బుధవారం కెటిఆర్ మాట్లాడారు. గత ఐదు దశాబ్దాలుగా దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ చర్యలను విజయవంతంగా అమలు చేశాయని, 'జాతీయ జనాభా విధానాన్ని తూచా తప్పకుండా పాటించినందుకు ఇప్పుడు మమ్మల్ని శిక్షిస్తారా?' అని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం సుమారు 24 శాతంగా ఉందని, ఈ శాతాన్ని ఏ స్థితిలోనైనా కాపాడాలన్నారు. '0.01% శాతం తగ్గుదల కూడా తమకు ఆమోదయోగ్యం కాదని, ఆరు దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ సీట్ల శాతం 24 శాతంగానే కొనసాగాలి. దీనిని మార్చేందుకు ప్రయత్నిస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని, తమ తమ ఆందోళనలను పట్టించుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు.

పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లులో అస్పష్టత ఉన్నదని, 50 శాతం సీట్లు పెరుగుతాయని కేంద్ర నేతలు చెబుతున్నప్పటికీ,ఆ బిల్లులో మాత్రం ఆ ప్రస్తావన ఎక్కడా లేదని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై 2022–23 నుంచే బిఆర్‌ఎస్ గళమెత్తుతోందని, కేవలం జనాభా ప్రాతిపదికన పార్లమెంటు సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన పునరుద్ఘాటించారు. 1971లో పార్లమెంటు సీట్లపై విధించిన స్తంభన జనాభా నియంత్రణ ప్రాతిపదికన జరిగిందని కెటిఆర్ గుర్తు చేశారు.

### రేవంత్ రెడ్డి 'హైబ్రిడ్' ముఖ్యమంత్రి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక 'హైబ్రిడ్ ముఖ్యమంత్రి అని కెటిఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ రాజకీయ వైఖరిలో స్థిరత్వం లేదని, 'ఉదయం ఆయన కాంగ్రెస్ ప్రతినిధిగా,సాయంత్రానికి బిజెపితో కలిసిపోతారని ఆరోపించారు. సహజంగానే ఇలాంటి హైబ్రిడ్ విధానం ఆయన పాలనలో కూడా కనిపి స్తోందన్నారు. ముఖ్యమంత్రి ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించే ప్రతిపాదన అంశంలో జిహెచ్‌ఎంసి ప్రతినిధులు, జెడ్‌పిటిసి సభ్యులు లేదా ఎంఎల్‌ఎలను సిఎం రేవంత్ రెడ్డి ఎందుకు సంప్రదించలేదని కెటిఆర్ ప్రశ్నించారు. 'మీకో విధానం, ఇతరులకో విధానం అంటే కుదరదు. ఒక జాతీయ పార్టీగా కాంగ్రెస్ పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేయకుండా స్పష్టతతో, బాధ్యతతో మాట్లాడాలి' అని ఆయన సూచించారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుకు బిఆర్‌ఎస్ మొదటి నుంచి చిత్తశుద్ధితో సంపూర్ణ మద్దతునిస్తుందన్నారు. రాజ్యాంగ విధి విధానాల ప్రకారం మొదట జనగణన,ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన,ఆ తర్వాతే నిర్మాణాత్మక మార్పులు జరగాలని ఆయన అన్నారు.

## చెల్లించక తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని ఆరోపించబడుతున్న ఈ పునర్విభజన ప్రక్రియ భారతదేశ ప్రగతికి దోహదపడినందుకు శిక్షా? అని ఆయన ప్రశ్నించారు. తమిళనాడు, దక్షిణ రాష్ట్రాలకు ఇదేనా ప్రతిఫలం? అని నిలదీశారు. సహజంగానే వింధ్య పర్వతాలకు దక్షిణాన ఉన్న ప్రతి దక్షిణ భారతీయుడు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. 'బిజెపి నిప్పుతో ఆడుకుంటోంది. నియోజకవర్గాల పునర్విభజనకు నిరసనగా నేడు తమిళనాడు వ్యాప్తంగా ఇళ్లపైనా, బహిరంగ ప్రదేశాలపైనా నల్ల జెండాలు రెపరెపలాడతాయి. కేంద్ర ప్రభుత్వం తమిళనాడు వాణిని గౌరవించడానికి, వెనక్కి తగ్గడానికి నిరాకరిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది. మీరు చెల్లించబోయే మూల్యం చాలా భారీగా ఉంటుంది' అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఇది కేవలం డిఎంకె అధ్యక్ష హోదాలో మాత్రమే కాకుండా, అన్నింటికంటే ముఖ్యంగా ఆత్మగౌరవం గల తమిళుడిగా హెచ్చరిస్తున్నానన్నారు. మన ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి భారతదేశంలోని అన్ని పార్టీలు, ఎంపిలు ఏకం కావాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఉదయం, కేంద్రం ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ కారణంగా రాష్ట్రం ఎదుర్కోవాల్సిన పరిణామాలపై చర్చించేందుకు స్టాలిన్ డిఎంకె ఎంపిలు, ఆ తర్వాత పార్టీ జిల్లా కార్యదర్శులతో అత్యవసర సమావేశం నిర్వహించారు.

## సమ్రాట్ చౌదరీ ప్రమాణస్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

చేయించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వీరిలో ముఖ్యమంత్రి పదవిని త్యజించిన జెడియు అధ్యక్షుడు నితీష్ కుమార్, కేంద్ర మంత్రి, మాజీ బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా, అలాగే బిహార్‌లో అధికార ఎన్‌డిఎ కూటమిలో మూడవ అతిపెద్ద భాగస్వామ్య పక్షమైన ఎల్‌జెపి (ఆర్‌వి) అధినేత చిరాగ్ పాశ్వాన్ ఉన్నారు. ఈ సందర్భంగా జెడియుకు చెందిన బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్ కుమార్ చౌదరి కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సమ్రాట్ చౌదరీకి అభినందనలు తెలిపారు. ఆయనలోని ఉత్సాహం, ప్రజా సేవ పట్ల అంకితభావం, క్షేత్రస్థాయి అనుభవం రాష్ట్రానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు.

జెడియుకు చెందిన ఇద్దరు నాయకులను ఉప ముఖ్యమంత్రులుగా నియమించే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తూ, సమ్రాట్ చౌదరీ, మరో బిజెపి నాయకుడు విజయ్ కుమార్ సిన్హా తన ఉప ముఖ్యమంత్రులుగా ఉన్నప్పటి అధికార సమీకరణాలు ఇప్పుడు తలక్రిందులైనట్లుగా ఈ పరిణామం కనిపిస్తోంది. 75 ఏళ్ల నితీష్ కుమార్ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికవడంతో రాష్ట్రంలో ఈ నాయకత్వ మార్పు అనివార్యమైంది. సమ్రాట్ చౌదరీ రాజకీయాల్లోకి వచ్చి దాదాపు మూడు దశాబ్దాలు గడిచినా, 57 ఏళ్ల ఈ నాయకుడు బిజెపిలో చేరింది మాత్రం కేవలం తొమ్మిదేళ్ల క్రితమే. 'నేను ఈ రోజు నుంచే నా పనిని ప్రారంభిస్తాను. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మాజీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ రూపొందించిన పాలనా నమూనానే బిహార్‌లోనూ అనుసరిస్తామని ప్రజలు నిశ్చింతగా ఉండవచ్చు' అని ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం సమ్రాట్ చౌదరీ విలేకరులతో అన్నారు. ఆయనకు కాబోయే ఇద్దరు డిప్యూటీలు 1980వ దశకంలో తమ రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు.

వారి అనుభవం, సామర్థ్యం, రాజకీయ నిబద్ధత కారణంగా నితీష్ కుమార్ వారిపై నమ్మకం ఉంచారు. వారు నితీష్ కుమార్ ప్రభుత్వంలో కీలక మంత్రి పదవులను నిర్వహించారు. అంతేకాకుండా, విజయ్ కుమార్ చౌదరి 20152020 మధ్య అసెంబ్లీ స్పీకర్‌గా కూడా పనిచేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం, ముఖ్యమంత్రి సచివాలయానికి వెళ్లి, అక్కడ ప్రభుత్వ అధికారులతో సమావేశమై, తన పరిపాలన ప్రాధాన్యతల గురించి వారికి వివరించారు. తరువాత, చౌదరి బిజెపి కార్యాలయాన్ని కూడా సందర్శించగా, పార్టీ కార్యకర్తలు ఆయనను సన్మానించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com